www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-12-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 272

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: చవితి సా.4:03 తదుపరి పంచమి, నక్షత్రం: పుష్యమి రా.2:53 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.11:45-1:16, దుర్ముహూర్తం: మ.12:29-1:13, మ.2:40-3:24, అమృతఘడియలు: రా.8:50-10:20, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:37, సూర్యాస్తమయం: 5:36 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పోలీసులే దొంగల్లా..

2

అర్ధరాత్రి శవాన్ని తెచ్చి.. మరో రాణా పరిధిలో పడేశారు!

గుర్తుతెలియని మృతదేహం కేసు దర్యాప్తును తప్పించుకొనేందుకే..

గుట్టుచప్పుడు కాకుండా ఓ షాపు ముందు పడేసి వెళ్లిన కానిస్టేబుల్, హోంగార్డు

యూపీలోని మీరట్‌లో సీసీటీవీ కెమెరాకు చిక్కిన 'దొంగ' పోలీసులు

దక్షిణాది వంటకంబు..
ఒహోహ్హో మాకె ముందు

మన వంటకాలను అమితంగా ఇష్టపడుతున్న అమెరికన్లు

యూఎస్‌లో పది వేల భారతీయ రెస్టారెంట్లు!



భారతీయ రెస్టారెంట్ల కేంద్రంగా డాలస్ మెట్రో ఏరియా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కన్నా కొందరు షెఫ్‌ల జీతమే ఎక్కువ

ఒక పాత సినిమాలో.. విలక్షణ నటి సూర్యకాంతం 'డాలర్ బజ్జీ' అని అమ్మితే నవ్వుకున్నాం!

కానీ.. ఇప్పుడా సీన్ నిజమైంది. అమెరికాలో దక్షిణ భారత రుచులకు ఆదరణ పెరుగుతోంది!!

భారతీయ ఆహారం అంటే నాన్, రోటీ, చికెన్ టిక్కా మసాలా వంటివే అనుకున్న అమెరికన్లు.. 'కోరీ భుజింతును.. గోంగూర పచ్చడి..' అంటూ ఇప్పుడు మన వంటకాలను లొట్టలేసుకుని తింటున్నారు.

(డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి)

కాలిఫోర్నియాలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఒక తెలుగు టెకీ.. తన సహోద్యోగులకు పార్టీ ఇవ్వా లనుకున్నాడు. అందరినీ మధ్యాహ్న భోజనానికి.. దగ్గర్లోని భారతీయ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక.. వారు ఆర్డర్ చేసిన మెనూ చూసి నివ్వెరపోవడం అతని వంతయింది. ఎందుకంటే.. వారందరూ ఆర్డర్ చేసింది బిర్యానీలు, మసాలా

మిగతా 12వ పేజీలో...



కట్టుదిట్టం.. చట్టబద్ధం!
ఇక అమరావతే!

పార్లమెంటులో చట్టబద్ధత దిశగా అడుగులు

విభజన చట్టంలో సవరణకు కేంద్ర న్యాయశాఖ ఓకే

సెక్షన్ 5(2)లో 'అమరావతి రాజధాని' అని స్పష్టీకరణ

గ్రామాలు, పరిధులు పొందుపరిచేలా బిల్లు

కేంద్ర మంత్రివర్గం ఆమోదించడమే తరువాయి

పార్లమెంటు ఆమోద ముద్రతో 'చట్టబద్ధత'

ఆపై... రాష్ట్ర స్థాయిలో అమరావతిని కదల్చడం అసాధ్యం

రాజధానిపై మూడు ముక్కలాటలు, జగన్నాటకాలకు తెర

కూటమి సర్కారు రాగానే తెరపైకి కీలక ప్రతిపాదనలు

క్యాబినెట్ తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన ప్రభుత్వం



ఇక 'అమరావతి'కి తిరుగుండదు! ఆంధ్రుల నూతన రాజధాని... చట్టబద్ధమైన రక్షణతో భద్రంగా ఉంటుంది. కట్టుదిట్టమవుతుంది. 'చంద్రబాబు మొదలుపెట్టారు... జగన్ వచ్చి పక్కన పెట్టారు... ఇప్పుడు చంద్రబాబు మళ్లీ కష్టపడి అమరావతిని గాడిన పెడుతున్నారు. మళ్లీ జగన్ వస్తే ఎలా?' అనే ప్రశ్నలకు, సందేహాలకు ఇక తావే లేదు. 'అమరావతి'ని కదిలించే శక్తి వారెవరికీ ఉండదు! ఎందుకంటే... 'ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి' అని పార్లమెంటులోనే చట్టం చేసేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర న్యాయ శాఖ కూడా ఈ బిల్లు ముసాయిదాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కేంద్ర మంత్రివర్గం ఆమోదించి, పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లును ప్రవేశపెట్టడమే మిగిలింది. అక్కడ ఆమోద ముద్ర పడితే... అమరావతిని మరెవ్వరూ కదిలించలేరు. స్వార్థ రాజకీయాల కోసం నవ నగరాన్ని బలిచేయలేరు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తెలంగాణ ఆవిర్భావం తర్వాత నవ్యాంధ్ర 'రాష్ట్రంలేని రాజధాని'గా ఏర్పడిన సంగతి తెలిసిందే. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014' సెక్షన్ 5లో రాజధానికి సంబంధించిన అంశాలను పొందుపరిచారు. ఇందులోని సబ్ సెక్షన్ 2లో... "విభజన తర్వాత పదేళ్ల వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. నవ్యాంధ్రకు 'కొత్త రాజధాని' ఏర్పాటవుతుంది" అని పేర్కొన్నారు. సబ్ సెక్షన్ 3లో... ఏపీ కొత్త

మిగతా 11వ పేజీలో...

చట్టబద్ధత వస్తే...

'అమరావతి ఆంధ్రుల రాజధాని' అని పార్లమెంటులో చట్టం చేసిన తర్వాత... ఎవరు అధికారంలోకి వచ్చినా దానిని రాష్ట్ర స్థాయిలో కదిలించలేరు. మళ్లీ 'మూడు ముక్కలాటల' వంటివి మొదలుపెట్టడం సాధ్యం కాదు. రాజధానిని మార్చాలంటే... కేంద్రం పార్లమెంటులో మరోసారి 'సవరణ'లు చేయాల్సి ఉంటుంది. ఎన్డీయే హయాంలో ఇది కుదిరేపని కాదు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడినప్పటికీ... 'అమరావతి' జోలికి వెళ్లే అవకాశమే లేదు. రాష్ట్ర విభజన చేసిందే అప్పటి యూపీఏ సర్కారు. నవ్యాంధ్ర రాజధానికి కేంద్ర మద్దతుతో పాటు... పలు అంశాలను అందులో అప్పుడే పొందుపరిచారు. ఈ స్ఫూర్తికి భిన్నంగా, 'జగన్నాటకాల'కు కాంగ్రెస్ సహకరించబోదు. వెరసి... పార్లమెంటులో సవరణ చట్టం ఆమోదం పొందగానే 'అమరావతి'కి చట్టబద్ధమైన బలం, రక్షణ లభిస్తుంది.

ఇదో జిల్లా కార్యాలయం



ఈ ఫొటోలో కనిపిస్తున్న చిన్న గది ఏమిటో తెలుసా..! అనకాపల్లిలోని బీసీ సంక్షేమ, సాధికార జిల్లా అధికారి కార్యాలయం! ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వాచ్‌మన్ కోసం నిర్మించిన ఈ గదిలో కార్యాలయం ఏర్పాటు చేశారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా నిజమే. గత జగన్ సర్కారు కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేసింది కానీ.. జిల్లా కార్యాలయాలకు శాశ్వత భవనాల కోసం స్థలాలు, నిధులు కేటాయించకుండా 'పాలన'ను గాలికొదిలేసింది.

కొత్త జిల్లాలు.. పాత కష్టాలు

నాడు విభజించి.. వదిలేసిన జగన్ సర్కారు

13 కొత్త జిల్లాల కేంద్రాల్లో పరిస్థితి దారుణం

ఓ ప్రణాళిక లేకుండా హడావుడిగా ఏర్పాటు

నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం

తాత్కాలిక భవనాల్లోనే కార్యాలయాలు

ఫంక్షన్ హాళ్లు, చాలీచాలని అద్దె భవనాల్లో

కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఏర్పాటు

చాలా చోట్ల కనీస వసతులూ కరువు

ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు

పలు కార్యాలయాల్లో సిబ్బంది కొరత


అనేక శాఖలు ఇన్‌చార్జుల పాలనలోనే

సమస్యలు పరిష్కరించని జగన్ సర్కారు

కూటమి దృష్టిసారించాలని వినతులు

13 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను 2022లో అప్పటి జగన్ ప్రభుత్వం 26 జిల్లాలుగా విభజించింది. నేటి చంద్రబాబు ప్రభుత్వం మరో 3 కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తోంది. ఈ కొత్త జిల్లాల సంగతి సరే... జగన్ ఏర్పాటు చేసిన 13 'పాత' జిల్లాల పరిస్థితి ఏంటి? బాలారిష్టాలు దాటాయా? కార్యాలయాలు ఏర్పడ్డాయా? సిబ్బంది సమకూరారా? దీనిపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న పరిశీలనాత్మక కథనం...

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



12 శ్రీ సత్యసాయి జిల్లాలోని ఈ రేకుల షెడ్డే సమగ్రశిక్ష కార్యాలయం

వందేమాతరంపై నేడు చర్చ

వెలుగులోకి రాని కీలక విషయాలు వెల్లడించేందుకే!

150 ఏళ్ల వేడుకల్లో భాగంగానే

రేపటి నుంచి సర్ సహా ఎన్నికల సంస్కరణలపై చర్చ



న్యూఢిల్లీ, డిసెంబరు 7: వందేమాతర గీతంపై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరపనున్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకను ఏడాది పాటు నిర్వహించుకోవడంలో భాగంగా ఈ చర్చ చేపట్టనున్నారు. ఈ జాతీయ గేయం గురించి ఇప్పటివరకు వెలుగులోకి రాని పలు కీలక విషయాలను ఈ సందర్భంగా వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో వందేమాతరంపై చర్చను ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మిగతా 2వ పేజీలో...



డాలస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి లోకేశ్, కోమటి జయరాం, తదితరులు

15 ఏళ్లు కూటమే!

విడాకులు ఉండవ్: లోకేశ్

మిస్ ఫైర్‌లు.. క్రాస్ ఫైర్‌లూ ఉండవు

ఆంధ్రులు గర్వపడేలా అభివృద్ధి

ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ.. ఇదే మా నినాదం

విపక్షంలో ఉన్నప్పుడు అండగా ఉన్న ప్రవాసాంధ్రులు మా గుండెల్లో ఉంటారు

మీరు ఎన్ఆర్ఐలు కాదు.. ఎంఆర్ఐలు

అమెరికాకు వచ్చి దశాబ్దాలు గడిచినా మీ మనసు ఎప్పుడూ ఏపీవైపే

డాలస్ ప్రవాసాంధ్రుల భేటీలో లోకేశ్

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమని మంత్రి లోకేశ్ అన్నారు. 'గుజరాత్, ఒడిసాలో ఒకే ప్రభుత్వం ఉండడం వల్ల అభివృద్ధి జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు కాదు.. పది కాదు.. పదిహేనేళ్ల టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉండడం ఖాయం. ఆంధ్రులు గర్వపడే విధంగా అభివృద్ధిలో ముందుకెళ్తాం. విడాకులు

మిగతా 11వ పేజీలో...

గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం
25 మంది మృతి


బిర్చ్ నైట్‌క్లబ్‌లో అర్ధరాత్రి అగ్నికీలలు

బాణసంచా పేలుడుతో క్షణాల్లో వ్యాపించిన మంటలు

ఇరుకుదారిలో బయటికి వెళ్లలేకపోయిన బాధితులు

బేస్‌మెంట్‌లో చిక్కుకుని ఊపిరాడక పలువురి మృతి

క్లబ్ యజమానులు, మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు



అగ్ని ప్రమాదం జరిగిన నైట్ క్లబ్



పనాజీ, డిసెంబరు 7: గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 25 మంది మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. రాత్రి ఒంటి గంట సమయంలో ఉత్తర గోవాలోని అర్పోరా-నగావ్ గ్రామంలో అర్పోరా నది ఒడ్డున ఉన్న బిర్చ్ బై రోమియో లేన్ అనే నైట్‌క్లబ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించి క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో మంటల్లో చిక్కుకుని కొందరు, దట్టమైన పొగకు ఊపిరాడక మరికొందరు మరణించారు. మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బందిని గుర్తించారు. మరో 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. క్లబ్‌లో బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

మిగతా 2వ పేజీలో...



శ్రీశైలం డ్యాం దిగువన అప్రాన్‌కు 15 మీటర్ల దూరంలో ఏర్పడిన ప్లంజ్‌పూల్ గుంత (ఫైల్)

శ్రీశైలం ప్రాజెక్టుకు డేంజర్ బెల్స్!

డ్యాం పునాదుల కంటే లోతుకు చేరిన ప్లంజ్‌పూల్ గొయ్యి!!

11

రక్షణగా పెట్టిన 62 సిలిండర్లు శిథిలం

కాంక్రీటు కొట్టుకుపోవడంతో.. నీటిలోపల బయటపడిన కొన్ని సిలిండర్లు

తక్షణం కొత్తవి అమర్చాలి.. లేదంటే ముప్పే!

సీడబ్ల్యూపీఆర్ఎస్, సీలైన్ సంస్థల నివేదికలు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఇంజనీర్లు

వీటికి రూ.160-180 కోట్ల వ్యయం!

అప్రోచ్ రోడ్డు, ఇతర మరమ్మతులకు 203 కోట్లిచ్చిన చంద్రబాబు ప్రభుత్వం

ఇప్పటికే టెండర్లు పిలిచిన అధికారులు

కొండరాళ్లు జారకుండా షాట్ క్రీటింగ్‌కూ

తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్ పూల్ భారీ గొయ్యి నుంచి ప్రమాదం పొంచి ఉందా? డ్యాం భద్రతకు ఏర్పాటు చేసిన సిలిండర్లు దెబ్బతిన్నాయా..? వీటి తాజా పరిస్థితిపై అధ్యయనం చేసిన సంస్థలు ఇచ్చిన నివేదికలు ఈ ప్రశ్నలకు అవుననే జవాబిస్తున్నాయి. సిలిండర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తే ప్లంజ్‌పూల్ గుంతలు డ్యాం ఆనకట్ట వైపు విస్తరించే ప్రమాదం ఉంది.



రద్దులోనే విమానాలు

2

ఆదివారం 650 ఇండిగో సర్వీసులు రద్దు.. ఎయిర్‌పోర్టుల్లోనే వేలాది మంది పడిగాపులు

సంక్షోభాన్ని సరిదిద్దేందుకు కమిటీ ఏర్పాటు.. ఆదివారం ఉదయానికి 610 కోట్లు రీఫండ్

పదో తేదీకి అన్ని సర్వీసులూ నడుపుతాం: ఇండిగో.. కేంద్ర విధానాల వల్లే సంక్షోభం: కాంగ్రెస్

రాజకీయం చేయొద్దు: రామ్మోహన్.. 5 వేల విమానాల రద్దు.. 8 లక్షల మందికి ఇబ్బంది

ఇండిగో సంక్షోభంపై ఆదివారం ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పోలీసులే దొంగల్లా!

▸ మృతదేహాన్ని మరో పోలీస్ ఠాణా పరిధిలో పడేసిన ఖాకీలు

మీరట్, డిసెంబరు 7: యూపీలోని మీరట్‌లో పనిదొంగలైన పోలీసులు పట్టుబడ్డారు. లోహియా నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ స్టేషనరీ దుకాణం ముందు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని చూసిన షాపు యజమాని సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించడంతో.. దానిని తెచ్చి అక్కడ పడేసింది పోలీసులేనని తేలింది. ఆ పోలీసులది లోహియా నగర్ స్టేషన్ కాదని, ఎల్-బ్లాక్ ఔట్‌పోస్టు ఠాణాకు చెందిన కానిస్టేబుల్, హోంగార్డుగా గుర్తించారు. గురువారం అర్ధరాత్రి దాటాక వారిద్దరూ బైక్ మీద వచ్చి ఆ దుకాణం ముందు ఆగడం.. వారి వెనకే ఓ ఆటో రావడం.. వారి సమక్షంలోనే ఆటోలోని ఇద్దరు వ్యక్తులు మృతదేహాన్ని దింపి షాపు ముందుపెట్టి వెళ్లిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. వాస్తవానికి ఎల్-బ్లాక్ ఠాణా పోలీసులు తమ పరిధిలో ఆ మృతదేహాన్ని గుర్తించారు. 'మృతుడు ఎవరో కనుక్కోవాలి.. ఎలా చనిపోయాడో దర్యాప్తు చేయాలి.. శవజాగారం తప్పదు. ఈ తతంగమంతా ఎందుకొచ్చిన తలనొప్పి' అని ఆ మృతదేహాన్ని మరో ఠాణా పరిధిలోకి వచ్చే ప్రాంతంలో పడేసి చేతులు దులిపేసుకుందామని భావించారు. కానీ, సీసీటీవీ కెమెరాతో కథ అడ్డం తిరిగింది.

సోనియా వద్దకు 'కర్ణాటక' పంచాయితీ

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'కర్ణాటక సీఎం సీటు' పంచాయితీ సోనియాగాంధీ వద్దకు చేరింది. శనివారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా నేతృత్వంలో కీలక సమావేశం జరిగింది. రెండు గంటలపాటు చర్చలు సాగాయి. ఇటీవల సిద్దరామయ్య, డీకేలతో జరిపిన చర్చల సారాంశాన్ని ఖర్గే ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ నెల 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ భారీ సభ నిర్వహించనుంది. అప్పటిదాకా కర్ణాటక అంశాన్ని ప్రస్తావించరాదని సోనియా సూచించినట్లు తెలుస్తోంది. ఓట్ల చోరీపై ఆందోళన ముగిశాక.. 15వ తేదీన ఢిల్లీలో అందుబాటులో ఉండాలని సిద్దరామయ్య, శివకుమార్‌లను సోనియా ఆదేశించే అవకాశం ఉంది.

రూ.500 కోట్లు ఇస్తే సీఎం పదవి

▸ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య సంచలన వ్యాఖ్య

చండీగఢ్, డిసెంబరు 7: పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిగా నవజ్యోత్ సింగ్ సిద్ధూను పార్టీ ప్రకటిస్తే ఆయన క్రియాశీలక రాజకీయాల్లోకి తిరిగి వస్తారని సిద్ధూ భార్య, పార్టీ నాయకురాలు నవజ్యోత్ కౌర్ సిద్ధూ అన్నారు. ఏ పార్టీకైనా ఇవ్వడానికి తమ వద్ద డబ్బు లేదని, కానీ తాము పంజాబ్‌ను 'బంగారు రాష్ట్రం'గా మార్చగలమన్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుకునేందుకు ఇవ్వడానికి తమ వద్ద రూ.500 కోట్లు లేవన్నారు. ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఎవరైనా డబ్బులు అడిగారా అని మీడియా ప్రశ్నించగా.. ఎవరూ అడగలేదు, కానీ రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చిన వ్యక్తి సీఎం అవుతారని ఆమె ఆరోపించారు.

గజనీ దండయాత్రలపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం

న్యూఢిల్లీ, డిసెంబరు 7: భారతదేశంపై మహమూద్ గజనీ చేసిన దండయాత్రల గురించి విద్యార్థులు మరింత వివరంగా అధ్యయనం చేయనున్నారు. ఈ మేరకు 'ఘజ్నవీద్ దండయాత్రలు' పేరిట నవీకరించిన ఏడో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకాన్ని ఎన్‌సీఈఆర్‌టీ శుక్రవారం విడుదల చేసింది. ఇంతకుముందు పుస్తకంలో గజనీకి సంబంధించి చిన్న పేరా మాత్రమే ఉండేది.

రాజస్థాన్‌లో శవ రాజకీయాలు చేస్తే ఐదేళ్లు జైలు

జైపూర్, డిసెంబరు 7: శవాలను గౌరవించే చట్టాన్ని రాజస్థాన్ ప్రభుత్వం ఆదివారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం.. శవంతో నిరసనలు తెలపడం, శవాలను రాజకీయంగా వినియోగించడం వంటి చర్యలను ప్రభుత్వం క్రిమినల్ నేరాలుగా పరిగణిస్తుంది. అలాంటివారిపై గరిష్ఠంగా 5 ఏళ్ల వరకు జైలుశిక్షతో పాటు జరిమానానూ విధిస్తారు.



'కథ సంకలనం' ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ మృణాలిని, పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు తదితరులు

ఉత్తమ కథల సంకలనం ఓ యాగం

▸ 'కథ 2024 సంకలనం' ఆవిష్కరణలో వక్తలు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏటా తెలుగులో సుమారు 3 వేల కథలు వస్తున్నాయని, వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి సంకలనంగా తేవడం నిజంగా ఓ యాగమని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల సెమినార్ హాల్లో ఆయన అధ్యక్షతన 'కథ 2024 సంకలనం' ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ... యువతరం నుంచి మంచి కథలు రావాలన్నారు. కథ 2024 సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మృణాలిని తొలిప్రతిని ప్రముఖ కథకురాలు పి.సత్యవతికి అందజేశారు. ఆర్ఎం ఉమామహేశ్వరరావు సమీక్ష చేస్తూ కథల్లోని కొన్ని పాత్రలు ఎప్పటికీ వెంటాడతాయన్నారు. కథకి బలం ఇచ్చేది పాత్ర నిర్మాణమేనని రచయితలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్, వైద్యుడు ఏవీ గురవారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు



ఓటు వేసేందుకు తరలివచ్చిన ఓటర్లు

గోషామహల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఇన్‌చార్జి కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీనాయుడు వనిత మహా విద్యాలయంలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని మొత్తం 78 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా 36.16శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. మొత్తం 37,142 మంది ఓటర్లలో మహిళలు 5,087 మంది, పురుషులు 8342 మంది మొత్తం 13,429 మంది ఓటు వేసినట్టు చెప్పారు.

అమెరికాలో అగ్నిప్రమాదం.. మరో తెలుగు విద్యార్థి మృతి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అల్బనీ ప్రాంతంలో ఇటీవల ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మరో తెలుగు విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అన్వేష్‌రెడ్డి సారపెల్లి అనే యువకుడు మృతి చెందినట్లు అమెరికాలోని కాన్సులేట్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడేనికి చెందిన అన్వేష్‌రెడ్డి కుటుంబం కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.

'నాల్గో తరగతి ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలి'

విజయవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లోని నాల్గో తరగతి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ.. నాల్గో తరగతి ఉద్యోగులకు న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు, వేతన సవరణలపై ఎన్జీజీవో అసోసియేషన్ దృష్టి సారిస్తోందన్నారు.

సీజేఐ కుమారుడికి.. కార్మికుడి కొడుక్కి ఒకే నిబంధనలా?

▸ రాజ్యాంగం గురించి కనీస అవగాహనలేని వారే నాపై విమర్శలు గుప్పించారు: జస్టిస్ గవాయ్



ముంబై, డిసెంబరు 7: ఎస్సీలకూ క్రీమీలేయర్ వర్తింపజేయాలని తీర్పునిచ్చినందుకు తీవ్ర విమర్శల పాలయ్యానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. రాజ్యాంగ నిబంధనల గురించి కనీస అవగాహన లేని వారే అజ్ఞానంతో తనపై ఆరోపణలు గుప్పించారని చెప్పారు. సీజేఐ కుమారుడికి.. కార్మికుడి కొడుక్కి ఒకే ప్రమాణాలు వర్తింపజేయవచ్చా అని ప్రశ్నించారు. ఎస్సీ కోటాలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న (క్రీమీలేయర్) వర్గాలను రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి దూరంగా ఉంచాలంటూ.. గతేడాది ఆగస్టులో విస్తృత ధర్మాసనంలో భాగమైన జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. అయితే ఆ తీర్పుతో తన సొంత సామాజిక వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదురయ్యాయని చెప్పారు. న్యాయమూర్తులు తమ తీర్పుల గురించి చర్చించకూడదని.. అయితే తాను రిటైరయ్యాను కాబట్టి మాట్లాడుతున్నానని వివరించారు. 'నేను రిజర్వేషన్ ద్వారానే సీజేఐ దాకా ఎదిగి.. ఇప్పుడు క్రీమీలేయర్ వర్తింపజేయాలంటూ మాట్లాడానని ఆరోపణలు గుప్పించారు. రాజ్యాంగ నిబంధనలు తెలియని వారే ఇలా మాట్లాడతారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవులకు అసలు రిజర్వేషన్లు వర్తించవనేది కూడా వారికి తెలియదు. ఈ పదవుల కోసం పోటీ పడాల్సి వస్తుంది. సాధారణంగా సీనియారిటీని బట్టి 65 ఏళ్ల లోపున్న వారికే అవకాశం దక్కుతుంది. క్రీమీలేయర్‌పై నాకంటే ముందు 1975లో జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ కూడా మాట్లాడారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టాన్ని, న్యాయమూర్తుల మునుపటి తీర్పులను బట్టే మాట్లాడతాము. నేను చెప్పింది సరైందో.. కాదో దేశ ప్రజలే చెప్పాలని కోరుతున్నా..' అని వ్యాఖ్యానించారు.

రద్దులోనే విమానాలు

▸ ఆదివారం 650 సర్వీసులు రద్దు చేసిన ఇండిగో

▸ 610 కోట్లు రిఫండ్... పదో తేదీకల్లా అన్ని సర్వీసులూ నడుపుతాం: ఇండిగో

▸ ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దు: రామ్మోహన్



ఆదివారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో లగేజీని వెతుక్కుంటున్న ప్రయాణికులు

న్యూఢిల్లీ/ముంబై, డిసెంబరు 7: దేశంలో విమానయాన సంక్షోభం కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు, విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికుల పడిగాపులు కొనసాగుతున్నాయి. ఆదివారం దేశవ్యాప్తంగా 650 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందులో శంషాబాద్ నుంచి 115 సర్వీసులు, బెంగళూరు నుంచి 150, ఢిల్లీ నుంచి 108 సర్వీసులు ఉండటం గమనార్హం. అయితే పరిస్థితిని సరిదిద్దుతున్నామని, బుధవారం నాటికి దాదాపు అన్ని సర్వీసులను పునరుద్ధరిస్తామని ఇండిగో ప్రకటించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభమని కాంగ్రెస్ ఆరోపించింది. విమాన చార్జీలపై నియంత్రణలు కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఇండిగో సంక్షోభంతో లక్షలాది మంది ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడటం, ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. డీజీసీఏ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఇసిడ్రో పోర్కెరస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. భారీగా విమానాల రద్దుపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా ఇండిగోపై చర్యలు చేపడతామని వెల్లడించింది. ఇక జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని రవాణా, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం.. విమానయాన సంక్షోభంపై దృష్టిపెట్టినట్టు తెలిసింది. ప్రైవేటు విమానయాన సంస్థలు, డీజీసీఏ ఉన్నతాధికారులను పిలిపించి వివరణ కోరనున్నట్టు సమాచారం.

10వ తేదీకల్లా అన్ని సర్వీసులు

ఇండిగో విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. మొత్తం 2,300 సర్వీసులకుగాను ఆదివారం దేశవ్యాప్తంగా 1,650 సర్వీసులను నిర్వహించామని, 650 విమానాలు రద్దయ్యాయని ఇండిగో ప్రకటించింది. క్రమక్రమంగా అన్నింటినీ మెరుగుపరుస్తూ వస్తున్నామని, బుధవారానికల్లా పూర్తిస్థాయి సర్వీసులు నిర్వహిస్తామని తెలిపింది. మొత్తం 138 ప్రాంతాలకుగాను 135 ప్రాంతాలకు సర్వీసులను పునరుద్ధరించినట్టు వివరించింది. సర్వీసుల పునరుద్ధరణ కోసం 'సంక్షోభ నిర్వహణ కమిటీ'ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. రద్దయిన విమానాలకు సంబంధించి ప్రయాణికుల సొమ్మును వేగంగా తిరిగిస్తున్నామని, ఆదివారం ఉదయానికల్లా రూ.610 కోట్ల రీఫండ్లు చెల్లించామని తెలిపింది. ప్రయాణికులకు సంబంధించిన 3 వేల బ్యాగులను వారికి అందజేశామని వెల్లడించింది. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా.. ఎయిరిండియా నుంచి కనెక్టింగ్ విమాన టికెట్లు, రిటర్న్ టికెట్లు ఉన్నవారు వాటిని రద్దు చేసుకుని తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో దేశీయ ప్రయాణికులకు టికెట్ల రద్దు, ప్రయాణ తేదీ మార్పు కోసం చార్జీలను ఒకసారి మినహాయిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో తమ కుటుంబం కూడా ఇబ్బందిపడిందని బాలీవుడ్ నటుడు సోను సూద్ చెప్పారు. అయితే, 'ఈ అంశంలో సిబ్బంది కూడా నిస్సహాయులే. అందువల్ల మనం బాధ్యతాయుతమైన పౌరులుగా వారితో మర్యాదగా వ్యవహరించాలి" అని ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

కేంద్ర గుత్తాధిపత్య విధానాల ఫలితమే: రాహుల్

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల కారణంగానే విమానయాన సంక్షోభం నెలకొందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. "ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల కారణంగా సాధారణ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇండిగో సంక్షోభం ఆ గుత్తాధిపత్య మోడల్ ఫలితమే. భారత్‌లో ప్రతి రంగంలో ఆరోగ్యకరమైన, న్యాయమైన పోటీ ఉండాలి. అప్పుడు ప్రజలకు మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ కుమ్మక్కు గుత్తాధిపత్య విధానాలతో కాదు.." అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సంక్షోభం కేవలం ఇండిగో సంస్థ తప్పిదం కాదని.. ఇది డీజీసీఏ, విమానయాన శాఖతో పాటు మొత్తం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని కాంగ్రెస్ నేత చిదంబరం విమర్శించారు.


5 రోజులు.. 5 వేల విమానాల రద్దు

ఈ నెల 2 నుంచి ఇండిగో విమాన సంక్షోభం మొదలైంది. 7వ తేదీనాటికి ఐదు రోజుల్లో మొత్తం 5 వేలకుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. సుమారు 8 లక్షల మంది ప్రయాణికులు తీవ్రంగా ప్రభావం పడింది. పౌర విమానయాన శాఖ అమల్లోకి తెచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిట్ నిబంధనల ప్రభావాన్ని అంచనా వేయడంలో ఇండిగో విఫలమైందని పైలట్ల సంఘాలు తెలిపాయి.

రాజకీయం చేయొద్దు: రామ్మోహన్

కేంద్ర గుత్తాధిపత్య విధానాల కారణంగానే ఇండిగో సంక్షోభమన్న రాహుల్ వ్యాఖ్యలను పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు తప్పుబట్టారు. ఇండిగో సంక్షోభ పరిస్థితిని రాజకీయం చేయవద్దన్నారు. "ఇండిగో సమస్య ప్రజలకు సంబంధించిన అంశం. రాజకీయ అంశం కాదు. ఏదైనా ప్రతిపక్ష నేత పూర్తిగా వివరాలు తెలుసుకుని మాట్లాడితే మంచిది" అని సూచించారు.

లోకం తీరు



హోటళ్లు, ఈవెంట్స్ ఆర్గనైజర్లు ఆధార్ కాపీలను తీసుకోవద్దు!

▸ త్వరలో యూఐడీఏఐ కొత్త నిబంధన

న్యూఢిల్లీ, డిసెంబరు 7: హోటళ్లు, ఈవెంట్ ఆర్గనైజర్స్ వంటి సంస్థలు కస్టమర్ల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను తీసుకుని నిల్వ చేయకుండా నిరోధించే లక్ష్యంతో త్వరలోనే యూఐడీఏఐ కొత్త నిబంధనను తీసుకురానుంది. జిరాక్స్ కాపీలు తీసుకుని నిల్వ చేయడం ఆధార్ చట్టానికి విరుద్ధం. ఈ నేపథ్యంలో కొత్త నిబంధనను తీసుకురాబోతోంది. ఈమేరకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణను కోరే హోటళ్లు, ఈవెంట్ ఆర్గనైజర్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసే నిబంధనకు అథారిటీ ఆమోదం తెలిపిందని యూఐడీఏఐ సీఈవో భువనేష్ కుమార్ తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయడం లేదా ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఆధార్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వ్యక్తుల వెరిఫికేషన్‌కు ఆస్కారం ఉంటుందని చెప్పారు. నూతన ధ్రువీకరణ విధానం వినియోగదారుల గోప్యత రక్షణను పెంచుతుందని కుమార్ తెలిపారు.

రక్షణ ఉత్పత్తుల్లో ఘనమైన వృద్ధి

125 ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్

లేహ్, డిసెంబరు 7: దేశీయ రక్షణ ఉత్పత్తుల్లో భారత్ గణనీయమైన వృద్ధి సాధించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2014లో రూ.46 వేల కోట్లుగా ఉన్న భారత రక్షణ ఉత్పత్తి నేడు రికార్డు స్థాయిలో రూ.1.51లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. ఒకప్పుడు దిగుమతులపై ఆధారపడిన భారత్ నేడు.. ఎగుమతిదారుగా అవతరించిందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా కొన్ని కీలక ప్రాంతాల్లో బీఆర్‌వో రూ.5వేల కోట్లతో నిర్మించిన 125 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. లద్దాఖ్, జమ్ము కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాల్లో బీఆర్‌వో వ్యూహాత్మకంగా 28 రోడ్లు, 93 వంతెనలు, 4 ఇతర ప్రాజెక్టులను నిర్మించింది. ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా లేహ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.."పదేళ్ల క్రితం రూ.వెయ్యి కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు రూ.24వేల కోట్లకు పెరిగాయి" అన్నారు.

వందేమాతరంపై నేడు లోక్‌సభలో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తారు. ఎన్డీయే పక్షాలకు లోక్‌సభలో 3 గంటలు కేటాయించగా, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ ఉపనేత గౌరవ్ గగోయ్, ప్రియాంకా గాంధీ వాద్రా సహా 8 మంది నేతలు మాట్లాడనున్నారు. అలాగే, మంగళవారం రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై చర్చను ప్రారంభించే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు ప్రసంగిస్తారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఈ గీతాన్ని 1875 నవంబరు 7న తొలిసారిగా లిటరరీ జర్నల్ బంగదర్శన్‌లో ప్రచురించారు. అనంతరం 1882లో ప్రచురితమైన తన నవల ఆనందమఠ్‌లో బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని భాగం చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల ఉత్సవాన్ని ఏడాదిపాటు నిర్వహించుకునే కార్యక్రమాన్ని ప్రధానిమోదీ గతనెల 7న ఢిల్లీలో ప్రారంభించారు. ఏడాదిపాటు విద్యార్థులు, యువతలో జాతీయ గీతంపై అవగాహనను పెంపొందించనున్నారు. కాగా, 1937లో ఈ గీతం నుంచి కీలక చరణాలను కాంగ్రెస్ తొలగించిందని, తద్వారా దేశ విభజనకు బీజాలు నాటిందని మోదీ ఆరోపించారు. మరోవైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సహా ఎన్నికల సంస్కరణలపై మంగళవారం నుంచి పార్లమెంటులో చర్చించనున్నారు. లోక్‌సభలో మంగళ, బుధవారాలు, రాజ్యసభలో బుధ, గురువారాలు ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తారు. కాంగ్రెస్ నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడనున్నారు.

గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం.. 25 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)





మంటల్లో బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్

ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి, ఏమాత్రం భద్రతా చర్యలు తీసుకోకుండా క్లబ్‌ను నిర్వహించటమే ప్రమాదానికి కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లతోపాటు ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్న ఆరోపణలతో అర్పోరా-నగావ్ గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్రపతి దౌపది ముర్ము, ప్రధాని మోదీ, గోవా సీఎం ప్రమోద్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆనందం క్షణాల్లో ఆవిరై..

గోవా రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్.. రాత్రి ఒంటిగంట సమయంలో క్లబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డ్యాన్స్ హాల్‌లో ఉషారెక్కించే సంగీతం మారుమోగుతోంది.. దాదాపు వందమంది కేరింతలు కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. అప్పుడే వేదిక వెనుకవైపున పైకప్పు నుంచి చిన్నగా మంట మొదలై.. క్షణాల్లోనే హాలంతా మంటలు పాకాయి. క్లబ్‌లోనివారంతా ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇరుకు దారిలో వెళ్లలేక కొందరు బేస్‌మెంట్‌లో ఉన్న వంటగదిలోకి వెళ్లారు. వారంతా ఊపిరాడక మరణించారని పోలీసులు తెలిపారు. రాత్రిపూట వేడుకలకు ఉత్తర గోవా ప్రాంతంలో బిర్చ్ క్లబ్ చాలా ప్రసిద్ధి. నిత్యం వందలాది మంది క్లబ్‌కు వస్తారు. అయితే, ఈ క్లబ్ నిర్మాణంలోగానీ, నిర్వహణలోగానీ ఏమాత్రం నిబంధనలు పాటించలేదని పోలీసుల విచారణలో తేలింది. లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు దారులు చాలా ఇరుకుగా ఉన్నాయి. క్లబ్ భవనం జీవితకాలం ముగిసిపోవటంతో కూల్చివేయాలని గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసులు కూడా ఇచ్చింది. అయినా క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే ఉద్యోగుల్లో చాలామంది అర్పోరా గ్రామ వాసులు ఉండగా, కొందరు జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల వారు ఉన్నారు. మృతుల్లో కూడా వీరే అధికంగా ఉన్నారు. ప్రమాదంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

సిలిండర్లు పేలలేదు: గోవా డీజీపీ

మంటలు అంటుకోవటానికి ముందు క్లబ్‌లో భారీ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో వంటగదిలో గ్యాస్ సిలిండర్ పేలి ఉండొచ్చని పోలీసులు మొదట భావించారు. అయితే, వంటగదిని పరిశీలించగా సిలిండర్లన్నీ సురక్షితంగా ఉన్నాయని గోవా డీజీపీ అలోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. పేలుడుపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో క్లబ్ మొత్తం కాలిపోయింది. మంటలు క్షణాల్లోనే క్లబ్ మొత్తం వ్యాపించాయని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాద సమాచారం అందుకొని అగ్నిమాపక శకటాలు అక్కడికి వెళ్లినా.. దారి ఇరుకుగా ఉండటంతో క్లబ్‌కు 400 మీటర్ల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.


దౌత్య 'బ్యాలెన్సింగ్'లో భారత్!

▸ జనవరిలో భారత పర్యటనకు జెలెన్‌స్కీ?.. ఇటీవలే పుతిన్ పర్యటన పూర్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 7: దాదాపు గత నాలుగు సంవత్సరాలుగా యుద్ధభూమిలో కొట్లాడుకుంటున్న రష్యా, ఉక్రెయిన్ విషయంలో భారత్ దౌత్యపరంగా సమతుల్య చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చి వెళ్లారు. పుతిన్ శత్రు దేశమైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా త్వరలో మన దేశంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి జెలెన్‌స్కీ పర్యటన ఉండే అవకాశం ఉందని జాతీయ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. దీనిపై భారత్, ఉక్రెయిన్ అధికారుల మధ్య గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతున్నాయని, పుతిన్ భారత్ పర్యటనకు రాకముందు నుంచే కేంద్ర ప్రభుత్వం జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు చేస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో ఉన్న రష్యా, ఉక్రెయిన్ పక్షాలతోనూ సన్నిహితంగా ఉండేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. గత ఏడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లగా, ఆ తర్వాతి నెలలోనే ఆయన ఉక్రెయిన్‌కు వెళ్లి వచ్చారు. 2022 ఫిబ్రవరిలో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి భారత్ రెండు దేశాలతోనూ టచ్‌లో ఉంది. భారత్ తటస్థంగా లేదని, శాంతి వైపు ఉంటుందని చెబుతూ వస్తోంది. జెలెన్‌స్కీతో మోదీ ఇప్పటికే దాదాపు 8సార్లు ఫోన్‌లో మాట్లాడారు. 4సందర్భాల్లో ఇద్దరూ నేతలు వ్యక్తిగతంగానూ కలిశారు.

లద్దాఖ్‌లో గల్వాన్ యుద్ధ స్మారకం

▸ ఆవిష్కరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, డిసెంబరు 7: గల్వాన్‌లో చైనాతో ఘర్షణ జరిగిన ఐదేళ్ల తర్వాత భారత్.. లద్దాఖ్‌లోని దౌలత్ బేగ్ ఓల్డీ మార్గంలో అత్యంత ఎత్తైన ప్రదేశంలో యుద్ధస్మారకాన్ని నిర్మించింది. 2020 జూన్ 15 రాత్రి సమయంలో చైనా బలగాలతో వీరోచిత పోరాటం చేసి అమరులైన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించిన ఈ స్మారకాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించారు. భారత్ రణభూమి దర్శన్ కార్యక్రమం కింద.. త్యాగం, వీరత్వానికి ప్రతీకగా ఎరుపు-నలుపు రంగు గ్రానైట్ రాళ్లతో త్రిశూలం-ఢమరుకం ఆకారంలో ఈ యుద్ధ స్మారకాన్ని నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో మ్యూజియం, డిజిటల్ గ్యాలరీ, గల్వాన్ ఘటన వివరాలు, లడక్ సైనిక చరిత్రను తెలుసుకునే ఏర్పాట్లు చేశారు. ఆడిటోరియం కూడా నిర్మించారు. మరోవైపు చైనాలోని షాంఘైలో భారత్ కొత్త కాన్సులేట్ భవనాన్ని ప్రారంభించింది. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకుని చైనాలో భారత రాయబారి ప్రదీప్ రావత్ దీన్ని ప్రారంభించారు.

మంచు కొండల్లోన...!



పాడేరు మండలం వంజంగిలో మేఘాల కొండలు

పాడేరు/అరకులోయ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో నమోదు అవుతుండడంతో పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీంతో సహజసిద్ధ ప్రకృతి అందాలు మరింత శోభాయమానంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండ, అరకులోయ మండలంలోని మాడగడ వ్యూపాయింట్, చింతపల్లి మండలం లంబసింగి సమీపంలోని చెరువులవేనం మేఘాల కొండ పరిసరాల్లో దట్టంగా పరుచుకున్న మంచు మేఘాలను చూసి సందర్శకులు పరవశించిపోయారు.

పెరిగిన చలి

ఏజెన్సీలోని కిలగాడలో 7.7 డిగ్రీలు నమోదు

రాష్ట్రంలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. ఆదివారం రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలోని కిలగాడలో 7.7, డుంబ్రిగుడలో 8.2, మైదాన ప్రాంతంలోని కళింగపట్నంలో 15.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శ్రీవారి సేవలో జస్టిస్ సురేశ్ రెడ్డి



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ సురేశ్ రెడ్డి

తిరుమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి అందజేశారు.



మీడియా సమావేశంలో ఎస్పీ అమిత్, వెనుక లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

- ఒకరు ఎస్‌జడ్‌సీఎం, మరొకరు డీసీఎం

పాడేరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు (ఎస్‌జడ్‌సీఎం) దిరిదో విజ్జల్ అలియాస్ జైలాల్, అతని భార్య డివిజనల్ కమిటీ మెంబర్(డీసీఎం) మడివి గంగి అలియాస్ విమల అలియాస్ భీమేలు ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఎదుట లొంగిపోయారు. మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా గగనపల్లి పంచాయతీ బోడెగుబ్బల్ గ్రామానికి చెందిన విజ్జల్ 4 దశాబ్దాల క్రితం ఉద్యమబాట పట్టి వివిధ హోదాల్లో పని చేశాడని వివరించారు. 1994లో పశ్చిమ బస్తర్ ప్రాంత దళ సభ్యుడిగా, జాతీయ పార్క్ ప్రాంతం ఏసీఎం, పీపీసీఎం, ఎల్‌వోఎస్ కమాండర్‌గా, కుంటా ప్రాంత సెక్షన్ కమాండర్‌గా, తెలంగాణ డీవీసీఎం, సీవైపీసీగా, ఏవోబీ, దక్షిణ, పశ్చిమ బస్తర్, మాడ్, గడ్చిరోలి ప్రాంతాల్లో ఆపరేషన్ చేశాడని తెలిపారు. ఏడు మెరుపుదాడులు, ఏడు క్యాంప్ దాడులు, రెండు ఎదురు కాల్పులు, ఒక బ్యాంకు దోపిడీ, ఒక ఐఈడీ పేల్చిన ఘటనలో పాల్గొన్నాడని వివరించారు. ఇతని భార్య గంగి 20 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి, ఏడు ఎదురుకాల్పులతో పాటు అనేక హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి ఉద్యోగులకు ఊరట

పీఆర్ తరహాలోనే ఆర్డీ ఉద్యోగులకూ సంస్కరణలు.. 43 రకాల కేడర్ల సిబ్బందిని పది కేడర్లుగా కుదింపు

- గ్రేడ్ల ఫిక్సేషన్, వేతన సవరణ, పెంపునకు గ్రీన్‌సిగ్నల్!
- మూడేళ్లు పూర్తయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎఫ్‌టీఈ
- పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే యోచన..
- రెండు రోజుల్లో ఉపముఖ్యమంత్రికి అందనున్న నివేదిక
- కొత్త సంవత్సరంలో ఉపాధి సిబ్బందికి తీపి కబురు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



నెలల తరబడి వేతనాలు అందక.. ఉద్యోగ భద్రత లేక.. గ్రాట్యుటీ, హెల్త్ కార్డులు, ఇంక్రిమెంట్లు, పదోన్నతులు లేక... కొన్నాళ్లుగా నిర్వేదంలో కూరుకుపోయిన ఉపాధి హామీ పథకం సిబ్బంది కష్టాలకు త్వరలోనే తెరపడనుంది..! రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి కొత్త సంవత్సరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీపికబురు చెప్పనున్నారు. ఆగస్టు 30న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో "నిర్వేదంలో ఉపాధి సిబ్బంది" శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన.. పంచాయతీ రాజ్ (పీఆర్) ఉద్యోగుల మాదిరిగానే గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖలో పనిచేసే ఉద్యోగులకు కూడా వేతన సవరణ, వేతనాల పెంపుతోపాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ.. ఉన్నతాధికారులతో పలుమార్లు భేటీ అయ్యారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే పలు కేడర్ల సిబ్బందితో చర్చించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం.. చట్టపరంగా, నిధుల వెసులుబాటును బట్టి ప్రభుత్వం ఏం చేయవచ్చో అవన్నీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దానికి సంబంధించి సమగ్ర నివేదికను రూపొందించారు. దాన్ని ఒకటి, రెండు రోజుల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందించనున్నారు. కొత్త సంవత్సరంలో వారికి తీపికబురు అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ యోచిస్తోంది.

ఉపాధి సిబ్బందికీ పదోన్నతులు..

గతంలో నారా లోకేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉపాధి సిబ్బందికి పదోన్నతులు కల్పించి, జీతాలు పెంచారు. ఆ తర్వాత ఇప్పటివరకు వారి ఎదుగుదలకు తోడ్పడే నిర్ణయాలేమీ తీసుకోలేదు. తాజాగా పలు కేడర్ల సిబ్బందికి కెరీర్ అడ్వాన్స్ ప్రక్రియ ద్వారా పదోన్నతులు కల్పించేందుకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు సిబ్బంది సర్వీసు, అర్హత ఉన్నప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి పదోన్నతులు కల్పించే అవకాశం కనిపిస్తోంది. ముందుగా ఆర్థికేతర సమస్యలను పరిష్కరించి, ఆ తర్వాత వేతన సవరణ, పెంపుపై అధికారులు దృష్టి సారించనున్నారు. దీంతో పాటు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బందికి కూడా ఊరట కల్పించనున్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)గా గుర్తించనున్నారు. దీంతో వారికి కూడా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయి. అదే విధంగా ఏడేళ్ల అనుభవం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్‌టీఈలుగా గుర్తించి వారి వేతనాలు పెంచనున్నారు. ప్రస్తుతం ఉపాధి సిబ్బంది 43 కేడర్లుగా ఉన్నారు. దీంతో అడ్మినిస్ట్రేషన్ పరంగా పలు సందర్భాల్లో గందరగోళం నెలకొంటోంది. దీంతో వారిని పది కేడర్లకు కుదించనున్నారు. ఈ క్రమంలో పలు కేడర్ల ఉద్యోగాల పేర్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.

పలు సమస్యలకు పరిష్కారం..

ఫీల్డ్ అసిస్టెంట్లకు 2018 నుంచి జీతాలు పెరగలేదు. 2016లో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు పెంచినా... కొన్ని కేడర్ల సిబ్బందికి పెరగలేదు. 2023లో ఏపీవోలకు గ్రేడ్లు ఫిక్స్ చేసి మిగతా కేడర్లకు చేయలేదు. వారి విజ్ఞప్తినీ పరిగణనలోకి తీసుకోనున్నారు. సిబ్బంది హెల్త్ పాలసీ దారుణంగా ఉంది. ఈ సమస్యలను కూడా సర్కారు పరిష్కరించనుంది. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేశారు.

లక్ష కోట్లు దోచిన జగన్‌కు

పరకామణి కేసు చిన్నదే

- అబద్ధపు ప్రచారాలపై ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న

విజయవాడ (వన్‌టౌన్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష కోట్లు దోచుకున్న జగన్.. టీటీడీ పరకామణి కేసు వ్యవహారం చాలా చిన్నదేనని చెప్పటంలో ఆశ్చర్యం లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. విజయవాడలోని ఎంపీ కేశినేని చిన్ని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరాకామణి కేసును జగన్ చిన్న తప్పు అనడం కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని మండిపడ్డారు. రవికుమార్ నుంచి ఎవరు ఎంత ఆస్తులు రాయించుకున్నారో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో రవికుమార్‌ను ఎందుకు జగన్ వెనకేసుకు వస్తున్నాడో సమాధానం చెప్పాలన్నారు. చిన్న వ్యాపారం చేసే రవికుమార్‌కు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయో జగన్ సమాధానం చెప్పాలన్నారు. తాడేపల్లి ప్యాలెస్ వేదికగా సెటిల్‌మెంట్ జరిగిందన్నారు. పరాకామణి కేసులో నిజాలు బయటకు వస్తాయని రవికుమార్‌ను హత్య చేసే అవకాశం ఉందని బుద్ధా వెంకన్న అనుమానం వ్యక్తం చేశారు. అడ్డగోలుగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్న జగన్ మోకాళ్లపై కూర్చుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోసారి అబద్ధాలు ప్రచారం చేస్తే జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై పేర్ని నాని నోరు పారేసుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పిచ్చివాగుడు వాగితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బీసీలపై జగన్‌ది కపట ప్రేమ

- సివిల్ సర్వెంట్లపై దూషణలు జుగుప్సాకరం
- టీటీడీ బోర్డు సభ్యుడు జంగా తీవ్ర అభ్యంతరం

రెంటచింతల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ ప్రేమను ఒలకబోసే మాజీ సీఎం జగన్‌రెడ్డి.. ఓటమి బాధతో బీసీ వర్గానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్‌లను అరేయ్, ఒరేయ్ అంటూ సంబోధించడం జుగుప్సాకరమైన విషయమని, బీసీలంతా దీన్ని ఖండిస్తున్నామని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా రెంటచింతలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ కృష్ణయ్య, డీఐజీ గోపినాథ్ జెట్టిల పట్ల జగన్ అగౌరవంగా, చిన్నబుచ్చేలా మాట్లాడడం తగదన్నారు. బడుగు, బలహీన వర్గాలంటే జగన్‌కు ఉన్న కపట ప్రేమ అందరికీ అర్థమైందన్నారు. పరకామణి చోరీ వ్యవహారం చిన్న తప్పుగా జగన్ భావించడం భక్తుల మనోభావాలను దారుణంగా దెబ్బతీసినట్లేనని విమర్శించారు.

రోజుకో స్కీంతో టీచర్లపై ఒత్తిడి: యూటీఎఫ్

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెకేషన్ శాఖగా ఉన్న పాఠశాల విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చి టీచర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని యునైటెడ్ టీచర్స్ సమాఖ్య అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం విజయవాడలో జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దీనిపై తీర్మానం చేశారు. పాఠశాల విద్యాశాఖ వెకేషన్ శాఖగా ఉందని, దీనిని నాన్ వెకేషన్‌గా మార్చమని కోరితే ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. రోజుకో కొత్త స్కీమ్ పేరుతో టీచర్లను ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. పదో తరగతి బోధించే టీచర్లకు సెలవులు ఇవ్వడం లేదన్నారు. టెన్త్ ఉత్తీర్ణత 100శాతం చేయాలనే పేరుతో రోజూ సాయంత్ర పరీక్షలు నిర్వహించి మార్కులు అప్‌లోడ్ చేయించడం మానసికంగా వేధించడమే అవుతుందన్నారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కోరుతూ ఈనెల 9, 10 తేదీల్లో పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, 18న జిల్లా కేంద్రాల్లో నిరసలు చేపడుతున్నామని చెప్పారు.

మార్కెట్ యార్డులు బలోపేతం

- ఏఎంసీ చైర్మన్ల నిర్ణయం
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హరిబాబు ఎన్నిక



మార్కెట్ యార్డు చైర్మన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన హరిబాబును అభినందిస్తున్న పలువురు యార్డు చైర్మన్లు

అమరావతి/మంగళగిరి డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఏఎంసీ చైర్మన్లు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఏఎంసీ చైర్మన్ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంద్యాల యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఉపాధ్యక్షులుగా కె.సుజాత రామచంద్రరాజు(భీమవరం), వై.రమాదేవి(కనిగిరి), కోగంటి బాబు(కంచికచర్ల), జి.మునిరాజు(కుప్పం), ఎం.మంగతల్లి(పాడేరు), ప్రధాన కార్యదర్శులుగా జి. అమరనాథ్ యాదవ్(పులివెందుల), కె. ప్రవీణ్‌కుమార్ (ఉయ్యూరు), కోశాధికారిగా జి.వెంకటరమణ(నర్సీపట్నం), పలువురు అధికార ప్రతినిధులను, జిల్లా కోఆర్డినేటర్లను ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీల అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. జగన్ పాలనలో తెచ్చిన విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగా యార్డు చైర్మన్లకు చెక్‌పవర్ కల్పించాలని, యార్డులను ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లుగా వర్గీకరించినట్లే.. చైర్మన్లను కూడా గ్రేడ్‌ల వారీగా తగిన సౌకర్యాలు, ఆర్థిక భరోసా, స్వయం ప్రతిపత్తి కల్పించాలని.. పలు తీర్మానాలు చేశారు. సీఎం చంద్రబాబు నిర్దేశించిన 'పంచసూత్రాల' పథకం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదపడుతుందని చైర్మన్లు అభిప్రాయపడ్డారు.

బీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. గౌరవాధ్యక్షుడిగా కె.మోహనరావు, అధ్యక్షుడిగా భూపతి రామారావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టేటి రమేష్, కార్యదర్శిగా ఎంఆర్ చక్రవర్తి, మహిళా కార్యదర్శిగా వి.మేరీ స్టెల్లా, ఇతర కార్యవర్గం ఎన్నికైనట్లు వివరించింది.

ఫిట్‌నెస్ చార్జీలు తగ్గించండి..

లేదంటే రేపు అర్ధరాత్రి నుంచి వాహనాలు నిలిపేస్తాం

- ఏపీ లారీ యజమానుల సంఘం

విజయవాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదమూడేళ్లకు పైబడిన వాహనాలకు భారీగా పెంచిన ఫిట్‌నెస్ చార్జీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి లారీలను నిలిపివేస్తామని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు వెల్లడించారు. విజయవాడలోని బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఏపీ లారీ యజమానుల సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.1,340 ఉన్న ఫిట్‌నెస్ చార్జీని రూ.33,040కు పెంచుతూ గతనెల 11వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఓనర్ కమ్ డ్రైవర్‌గా స్వయం ఉపాధి పొందుతున్న లారీ యజమానులకు ఆర్థిక ఇబ్బందులను కలుగజేస్తాయని తెలిపారు. కేంద్రం ఇచ్చిన ఇలాంటి ఉత్తర్వులను యథాతథంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన అవసరం లేదని, గతంలో కేంద్రం ఇచ్చిన గ్రీన్‌ట్యాక్స్ ఉత్తర్వులను తమిళనాడు, కర్ణాటక అమలుచేయని విషయాన్ని ప్రస్తావించారు. ఫిట్‌నెస్ చార్జీల పెంపుతో 13 ఏళ్ల పైబడిన లారీ యజమానులపై భారం పడుతోందని, 20 ఏళ్ల పైబడిన లారీ యజమానులపై తీవ్రమైన భారం పడుతోందన్నారు. దీని కారణంగానే గతనెల 22 నుంచి రాష్ట్రంలో అనేక లారీలు నిలిచిపోయాయని.., విశాఖపట్నం, కాకినాడ, నిడదవోలు, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి సరుకు రవాణా ఆగిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే కొన్ని రోజుల తరువాత రాష్ట్రంలోని అన్ని లారీలను నిలిపివేసి సరుకు రవాణాను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

పక్కాగా ఓటరు జాబితాల మ్యాపింగ్

- బీఎల్‌ఓలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఆదేశం

అనంతగిరి (అల్లూరి జిల్లా), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో పర్యటించారు. కొత్తూరు పంచాయతీ శివలింగపురం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో 280, 281 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అంతకుముందు బీఎల్‌వోల విధులు, పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల మ్యాపింగ్‌ను ఏ విధంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. 2026 ప్రత్యేక ఓటరు ముసాయిదా సవరణలో భాగంగా పాత ఓటరు జాబితాలతో సరిపోల్చి కచ్చితమైన జాబితాలను మ్యాపింగ్ చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. 280, 281 పోలింగ్ కేంద్రాల పరిధిలో 60 శాతం మ్యాపింగ్ పూర్తికావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజకీయ పార్టీలకు చెందిన బూత్ ఏజెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.

కుందుర్తి పురస్కారం

ఫ్రీవర్స్ ఫ్రంట్ & హోరు ఆధ్వర్యంలో డిసెంబరు 13న ఉస్మానియా యూనివర్సిటీలో యంగ్ పోయెట్స్ వర్క్ షాప్ జరగనుంది. దియా విఘ్నేశ్‌కు కుందుర్తి పురస్కార ప్రదానం, 'ఆనవాళ్లు 2024' ఆవిష్కరణ ఉంటాయి. సీతారాం, శీలా సుభద్రాదేవి, కాశీం, శ్రీరాం, అనిల్ డ్యానీ, యాకూబ్, నందిని సిధారెడ్డి పేర్ల రాము, హాతీరాం పాల్గొంటారు.

కుందుర్తి కవిత, సమత

మాడభూషి స్మారక కమిటీ ద్విదశాబ్ది సభ

మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ ద్విదశాబ్ది సభ డిసెంబర్ 14 సా.5.30ని.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. డి.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నిఖిలేశ్వర్ 'స్మరణ' (కథా విమర్శ) గ్రంథావిష్కరణ చేస్తారు. సభలో ఏనుగు నరసింహారెడ్డి, సుధామ, నాళేశ్వరం శంకరం, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

శీలా సుభద్రాదేవి(అధ్యక్షులు)

కథా రచనపై అవగాహన శిబిరం

కళాశాల విద్యార్థులలో తెలుగు కథా రచన పట్ల అభిరుచిని పెంచేందుకు 'వేదిక' (హైదరాబాద్), శిఖర స్కూల్ (విజయవాడ) కలిసి విజయవాడ, శిఖర స్కూల్ క్యాంపస్‌లో 'తెలుగు కథా రచన అవగాహన శిబిరం'ను డిసెంబరు 14న నిర్వహిస్తున్నాయి. శిబిరంలో చిన్నకథల పరిచయం, సరైన తెలుగు భాషా వినియోగం, కథా నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు ఫోన్: 81426 42638 (అనిల్ అట్లూరి), 88976 23332 (బండ్ల మాధవరావు).

అనిల్ అట్లూరి

'సోమేపల్లి' పురస్కారాల ప్రదానం


చిన్న కథల పోటీలలో విజేతలకు సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం 'రమ్యభారతి' ఆధ్వర్యంలో డిసెంబర్ 14 ఉ.10.30గం.లకు అన్నమయ్య లైబ్రరీ మీటింగ్ హాల్, బృందావన్ గార్డెన్స్, గుంటూరులో జరుగుతుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), జి. రంగబాబు (అనకాపల్లి), జి.యస్.కె. కరీముల్లా (నరసరావుపేట) స్వీకరిస్తారు. వేముల హజరత్తయ్య గుప్త, ఆర్.డి. విల్సన్, చిల్లర భవానీదేవి, శ్రీకంఠస్ఫూర్తి తదితరులు పాల్గొంటారు.

చలపాక ప్రకాష్

సాహితీ వేదిక పురస్కారం

రాజమండ్రి సాహితీ వేదిక ఈ సంవత్సరం నుండి తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన, చేస్తున్న వారికి ప్రతి ఏటా ఇవ్వతలపెట్టిన సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను కవీ, కథకుడూ అద్దేపల్లి ప్రభు స్వీకరిస్తారు. డిసెంబరు 25న రాజమండ్రిలో జరిగే సాహితీ వేదిక వార్షిక సమావేశంలో అద్దేపల్లి ప్రభుకు రూ.20వేల నగదుతో పురస్కారం ప్రదానం జరుగుతుంది.

సాహితీ వేదిక



ప్రవాస టిబెటన్ల కవిత్వ ప్రతిఘటన

తల్లి గర్భం నుండి బయటకు రావడమే మొదటి వలస. ఇక ఆ తర్వాత జీవితంలో ఏదో ఒక రూపంలో వలస అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. అయితే అన్ని వలసలూ ఒకటి కావు. కొన్ని కోరి తెచ్చుకున్నవి అయితే, మరికొన్ని నెట్టబడ్డ వలసలు. రెండింటిలోనూ ఇబ్బందులున్నా, కోరి తెచ్చుకున్నాక భరించడం తప్ప మొర పెట్టుకునేందుకు ఆస్కారం లేదు. కానీ నెట్టబడ్డ వలసల్లో మొర పెట్టుకునేందుకు కూడా చాలనన్ని ఇబ్బందులు అడుగడుగునా ఎదురవుతూనే ఉంటాయి. ఇలాంటి సంఘర్షణామయ జీవితాలు మాతృభూమితో ఆ ప్రవాసుల బంధాన్ని మరింత బలపడేట్టు చేస్తాయి. ఎప్పటికైనా తిరిగి వెళ్ళే అవకాశం కోసం ఎదురుచూస్తూనే వారు జీవితాలను ఖర్చు పెట్టేస్తారు.

భారతదేశానికీ చైనాకూ మధ్యనున్న టిబెట్ 1950 దాకా పూర్తి స్వతంత్ర దేశం. 1950 నుండి టిబెట్‌ను చైనా ఆక్రమించింది. చైనా అణచివేతను భరించలేక 1959లో దలైలామా టిబెట్‌ని వదిలి భారతదేశం వచ్చి హిమాలయాల దిగువన ఉన్న ధర్మశాలలో తలదాచుకున్నారు. దలైలామాతో బాటు, వేలమంది టిబెట్ వాసులు దేశం నుండి పారిపోయి ప్రపంచంలో అనేకచోట్ల ప్రవాసంలో బతుకుతున్నారు. అధిక సంఖ్యలో భారతదేశంలోనే శరణార్థులుగా గడుపుతున్నారు. ధర్మశాలలో టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా టిబెట్ ప్రభుత్వాన్ని స్థాపించి దలైలామా నడిపిస్తున్నారు. తనతోబాటు టిబెట్ నుండి బయటకు వచ్చిన వారి బాగోగులను, చదువు సంధ్యలను ఆయనే చూసుకుంటున్నారు. ఇప్పుడు దలైలామా తొమ్మిది పదుల వయసుకు చేరుకున్నారు. తన తరువాత ఎలా అన్నది ఆయనకే కాదు, ఆయన మీద ఆధారపడి ప్రవాసం గడుపుతున్న టిబెట్ వాసులకు, వారికి ఆశ్రయమిచ్చిన భారతదేశానికీ ప్రశ్నార్థకమే! మరోపక్క చైనా ఇదే పరిణామం కోసం ఎదురుచూస్తున్నది. అటు చైనా ఇటు భారతదేశం, ఈ రెండు బలీయమైన దేశాల మధ్య టిబెట్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

టిబెట్ వాసులంటే టిబెట్‌లో ఉన్నవారే గాక, టిబెట్‌లోనే పుట్టి ప్రవాసంలో జీవితాలను గడుపుతున్నవారు, ప్రవాసంలో పుట్టి ప్రవాసంలోనే పెరుగుతున్నవారు కూడా. వారి హృదయాలు తెలియని మాతృభూమి కోసం తహతహలాడుతుండగానే, వారు తెలియని దేశాలలో జీవితాన్ని నిర్మించుకునే సవాలును ఎదుర్కొంటున్నారు. మతం ద్వారా పురాణాల ద్వారా మాత్రమే తెలిసిన భూమికి తిరిగి పోవాలని కోరుకుంటున్నారు. కానీ మాతృభూమిలోని పరిస్థితులు వారిని ఆపుతున్నాయి. అహింసను బోధించే బౌద్ధ సిద్ధాంతాలకు కట్టుబడి, ఆధ్యాత్మిక తండ్రిగా భావించే దలైలామా కోరికకు బద్ధులై, వారు క్రూరత్వాన్ని ఆశ్రయించటం లేదు. అందుకు బదులుగా కవిత్వాన్ని ఆశ్రయిస్తున్నారు.

టిబెటన్ల ప్రవాస అనుభవానికి స్పందనగా దలైలామా 'ఎప్పుడూ వదులుకోవద్దు' అంటూ ఇచ్చిన కవితా సందేశం ఇది: "ఏం జరిగినా/ హృదయాభివృద్ధిని ఎప్పుడూ వదులుకోవద్దు/ కరుణతో ఉండండి/ మీ స్నేహితులతో మాత్రమే కాదు/ అందరితో కరుణతో ఉండండి/ మీ హృదయంలో ప్రపంచంలో/ శాంతి కోసం పని చేయండి/ హృదయాభివృద్ధిని ఎప్పుడూ వదులుకోవద్దు/ మీ చుట్టూ ఏం జరుగుతున్నా సరే'.

టిబెటన్ ప్రవాసులకు కవిత్వం ఒక రకమైన సృజనాత్మక ప్రతిఘటన. రాజకీయ అణచివేతను ఎదుర్కొంటూ, తమ గుర్తింపును కాపాడుకోవడానికి కవిత్వం వారికి ఒక సాధనం. ప్రవాస టిబెటన్ల నుంచి మూడు తరాలుగా మాతృదేశ విముక్తి కోసం అనేక విధాల కవిత్వం వస్తూనే ఉంది. వారిలో ప్రముఖంగా రాస్తున్న వారు వందమంది కంటే ఎక్కువగానే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ కవిత్వంతో ప్రభావితమవుతున్నారు, దానిలో వ్యక్తీకరించబడిన వేదనలో పాలుపంచుకుంటున్నారు.

టిబెట్ సమకాలీన కవిత్వంలో టెన్జిన్ సుందు, భుచుంగ్ డుమా సోనమ్ లాంటి కవులు, తమ కవితలలో బౌద్ధ తాత్త్వికతను జోడించి, ప్రవాసం, ఆశ, నిరసన వంటి భావాలను వ్యక్తీకరిస్తున్నారు. ఈ కవిత్వం కేవలం మతపరమైన ఉపదేశాలను మాత్రమే ప్రతిబింబించడం లేదు, జీవన పోరాటాన్ని ఎదుర్కోవడంలో ఒక మానసిక సాధనంగా కవిత్వం ఉపయోగపడుతున్నది. తమ వ్యాసాలు, కథలు, కవితలు, వెలుగు చూడడానికి ఒక ప్రచురణ సంస్థని వెబ్‌సైట్లని, వారికి వారే నెలకొల్పుకున్నారు.

> **టిబెటన్ ప్రవాసులకు కవిత్వం ఒక రకమైన సృజనాత్మక ప్రతిఘటన. రాజకీయ అణచివేతను ఎదుర్కొంటూ, తమ గుర్తింపును కాపాడుకోవడానికి వారికి కవిత్వం ఒక సాధనం.**

"తెల్లని గులకరాళ్ళను ఏరుకో/ విచిత్ర వింత ఆకుల్నీ/ వంపుల్ని చుట్టూ కొండల్ని గుర్తుంచుకో/ నీకు అవసరం కావొచ్చు/ మళ్ళీ ఇంటికి రావడానికి," అని బహిష్కరించబడిన ప్రముఖ కవి రచయిత, టెన్జిన్ సుండూ ఆశపడుతూనే ఉంటాడు. "నేను టిబెటన్‌ని/ కానీ టిబెట్‌కు చెందినవాడిని కాదు/ ఎప్పుడూ అక్కడకు వెళ్లలేదు/ అయినా నేను కలలు కంటూనే ఉంటాను/ అక్కడే చనిపోదామని" అంటాడు.

"నా వెదురు వేణువు ధ్వని/ గాఢంగా ఉన్నపుడు/ ఆహ్వానం లేకుండా/ పక్షులు నా చుట్టూ తిరిగాయి/ ఇప్పుడు ఈ విరిగిన వేణువు నిస్సార ధ్వని/ సముద్రకాకుల దృష్టినైనా ఆకర్షించడం లేదు" అని వాపోతాడు దివంగత కవి న్గోడుప్ పాల్జోర్. టిబెట్, హిందీ, సంస్కృతం, పాలీ, థాయ్, ఇంగ్లీష్ భాషలలో నిష్ణాతుడైన న్గోడుప్ పాల్జోర్ హవాయి విశ్వవిద్యాలయంలో పనిచేసేవాడు.

"పాలుతాగే పసివాడిగా ఉన్నపుడు/ భూమ్యాకాశాల గురించి, నేనెప్పుడూ అనుకోలేదు/ కానీ నాకు ఒక అస్పష్ట అభిప్రాయం ఉండేది/ మాతృభూమి కౌగిలంత తీయదనం/ ప్రపంచంలో ఏదీ లేదని" – చైనా సైన్యంలో దుబాసిగా, అధ్యాపకుడిగా పనిచేసి, కవిత్వంతో అనేక ప్రయోగాలు చేసిన రబ్ గై భసంగ్ అంటాడు.

"జీవితాన్ని నేను నిర్వచించను/ మరణం నాకు తెలియదు/ రోజులు నేను చూడను/ రాత్రులు నేను తెలుసుకోను/ అస్పష్టత మాత్రమే రాజ్యమేలుతుంది/ ఒక వెర్రి బిందువు వరకూ గందరగోళం/ శాశ్వతంగా కరిగిపోతుంది/ శూన్యంలో మనసు మునిగిపోయింది/ చీకటి నన్ను గుల్ల చేస్తూ/ ఉదాత్తమైన కోలాహలపు లోతైన సొరంగం నుండి/ ఉన్మాద స్థితికి ఎదిగి/ సంపూర్ణ నిశ్శబ్దంలో శబ్దం చేస్తూ నేను బయటకొచ్చాను" అంటాడు ప్రముఖ టిబెట్ కవి, అనువాదకుడు, సంపాదకుడు భుచుంగ్ డుమా సోనమ్.

టిబెట్, ఇంగ్లీష్, హిందీ భాషలలో రాసే కవయిత్రి సోనమ్ త్సోమో చాఘట్సాంగ్. ఆమె అమెరికాలో ఉండగా తన తల్లి మరణించిన తర్వాత నలభై తొమ్మిది రోజుల 'బార్డో' గురించి కవిత్వం రాసుకున్నది ('బార్డో' అంటే మరణానికి పునర్జన్మానికి మధ్య ఉంటుందని బౌద్ధులు భావించే సమయం): "నేను ఈ అసౌకర్య/ తెలియని ప్రదేశంలో ఉన్నాను. అక్కడ నా తల్లి కుమార్తెగా నేను ఏమి చేయాలో నాకు తెలియదు. ఇక్కడ నేనూ, నా ఆలోచనలు మాత్రమే, నాకు తెలిసిన ఏకైక విషయం. నలభై తొమ్మిది రోజులు, రోజులు గడిచేకొద్దీ వాటిని కవితలుగా రాసుకున్నాను. నా జీవితంలో ఆ కష్ట సమయంలో నా భావాలు ఏమిటో కాగితం మీద చూసుకుందుకు" అని ఆమె చెప్పుకుంది.

"ఇసుకలో చెల్లాచెదురయిన విత్తనాలు/ వికసించాలన్న దాహంతో ఉంటాయి/ బృందగానంలో కోల్పోయిన పాటలు/ వినబడాలని ఆకాంక్షతో ఉంటాయి" – అని ఆశపడుతూనే ఉండేవాడు, దివంగత కె. ధోండప్ ప్రముఖ కవి, చరిత్రకారుడు, పాత్రికేయుడు.

టిబెటన్ల వర్తమానం గురించి, వారి మాతృభూమి పరిస్థితి గురించి, ప్రస్తుత దలైలామా తమ్ముడు టెన్జిన్ చోగ్యాల్ ఇలా చెప్పుకున్నాడు – "కాలిపోతున్న భవనంలోంచి బయటకు పరుగెత్తే పిల్లాడు, దానినుండి బయటపడడానికి శక్తిలేనివాడు, వాడు చేయగలిగినదల్లా, 'మంటలు, మంటలు' అని అరవగలగడమే. బలమైన వ్యక్తులు, పెద్దలెవరో వింటారని, ఎవరో ఒకరు పట్టించుకుంటారని, వాడిని రక్షించడానికి ఏదో ఒక చర్య తప్పకుండా తీసుకుంటారని ఆశపడతాడు. ఖచ్చితంగా అదే మనం టిబెట్ వాసులం చేస్తున్నాం. మన ఇల్లు శిథిలమైపోతోంది. మన బంధువులు అక్కడ ఉన్నారు. అది ఇప్పటి టిబెట్ పరిస్థితి. మనం ప్రపంచమంతటా నివసిస్తున్న నిర్వాసిత ప్రజలం అయిపోయాం. ప్రస్తుత చైనా ఆక్రమిత టిబెట్‌లో మన బంధువులను రక్షించుకుందుకు, మన ఇంటిని చేరుకుందుకు, మానవాళికి విన్నవించుకుందుకు మనం ఆ పిల్లడిలానే ఏడుస్తున్నాం." అని చెప్పుకున్నాడు. అది ఎంత వాస్తవమో కదా అనిపిస్తుంది టిబెట్ ప్రవాస కవిత్వాన్ని చదివినప్పుడు.

■ ముకుంద రామారావు
✆ 99083 47273



ప్రతీక్ష

గూడెం గుమ్మంలో మొలిచింది
అమ్మోరు దేవతలాంటి చెట్టు
దాని పచ్చని కాంతులు
దిక్కులకు రంగులు దిద్దాయి
ఆ నిప్పుల వేడిలోనే
రాత్రికి చకచకా పదును పెట్టారు
మెరుపు కళ్లకు గోరింటలు దిద్దారు
చివరాఖరకు, చీడ చెరబట్టింది
అడవిని కాలం ఎరుగని చీకటి కమ్మింది
చెట్టు శిశిరానికి తలవంచింది
పశ్చాత్తాపంతో పిట్టలన్నీ
రెక్కల్ని అవనతం చేశాయి
వేలాది చుంబానాల మధ్య
దగ్ధ జ్ఞాపకమైన మొద్దు
వసంతాన్ని ప్రాధేయపడుతోంది

■ దేశరాజు

ఈ పుస్తకం చదివాక క్వియర్ వ్యక్తులే తమ కథలు రాస్తారని ఆశ

స్త్రీ–పురుషుడు అనే జెండర్లు మాత్రమే ఉంటాయనీ, వారిరువురికీ మధ్య ఉన్న పరస్పర ఆకర్షణ మాత్రమే సహజమనీ సమాజం నమ్ముతుంది. ఇలాంటి అభిప్రాయాలకు లోబడని భావాలు, గుర్తింపులు లేదా అనుభవాలు ఉండే వారిని క్వియర్ వ్యక్తులు అంటారు. గే, లెస్బియన్, బై సెక్సువల్, ట్రాన్స్... లేదా ఫలానా అని ఏ లేబుల్ వేసుకోలేనివారిని కూడా క్వియర్ అంటారు. తెలుగులో ఈ థీమ్స్‌మీద ఇటీవలే ఎక్కువ సాహిత్యం రావటం మొదలైంది. ఇప్పుడు ఈ ఇతివృత్తంపై 1922 నుంచి 2025 దాకా తెలుగులో వచ్చిన కథలతో 'అదే ప్రేమ' కథా సంకలనం వెలువడింది. ఈ సందర్భంగా ఈ పుస్తకం ఎడిటర్ **అపర్ణతోట** తో వివిధ సంభాషణ:



'క్వియర్' (Queer) ఇతివృత్తాలు ఉన్న కథలతో ఈ సంకలనం తేవాలన్న ఆలోచన గురించి చెప్పండి? ఈ సంపుటి ద్వారా మీరు ఆశిస్తున్నది ఏమిటి?

అస్తిత్వ ఉద్యమాలకు ముందే ఆ అస్తిత్వానికి (ఐడెంటిటీకి) చెందని ఎందరో రచయితలు వివిధ అంశాలను స్వతహాగా పూనుకుని రాశారు. ఉదాహరణకు స్త్రీవాద ఉద్యమం రాక మునుపే చలం, కొ.కు, శ్రీపాద; అలానే దళిత ఉద్యమానికి ముందే జాషువా, రావి శాస్త్రి, ఉన్నవ, స్మైల్, కె.ఎన్.వై పతంజలి రాశారు. తరవాత ఉద్యమాలకు అనుసంధానంగా వచ్చిన సాహిత్యం కూడా మనకు తెలుసు. సాహిత్యం వలన సమాజం మారుతుందా మారదా అనే డిబేట్ లోకి నేను పోను. కానీ ఉద్యమ నేపథ్యం, ప్రాముఖ్యత పాఠకులకు లేదా సాధారణ ప్రజలకు చేరడానికి సాహిత్యం చాలా అవసరం. క్వియర్ ఉద్యమ సందర్భంలో తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా క్వియర్ అంశాలకు ఎంత చోటు ఇచ్చారో చూడాలన్న ఆసక్తితో ఈ పనిని తలకెత్తుకున్నాను.

ఒక చదువరిగా క్వియర్ సాహిత్యానికి తక్కువ స్థలమే కేటాయించి ఉంటారన్నది తెలుసు కాని, ఒకసారి ఈ విషయాన్నీ అందరి దృష్టికి తీసుకురావడానికి ఇది మంచి మార్గంగా అనిపించింది. పైగా, సమాజపు చూపులోని మార్పును ఈ కాలానుగుణంగా వచ్చిన ఈ కథలు ప్రతిబింబిస్తాయి. అసలు కారణమైతే, ఈ పుస్తకం చదివాక క్వియర్ వ్యక్తులే కథలు రాస్తారనీ, వారి జీవితాలను అందరికి అర్థమయేలా చేస్తారని.

మనుషుల మధ్య ఎన్ని పోటీలు, కక్షలు, కార్పణ్యాలు ఉన్నా, ప్రేమ కూడా ఏకసూత్రంగా అందరిని కలుపుతుంది. అటువంటి సమయాల్లో వారి పట్ల ప్రేమను, వారి మధ్య ప్రేమను వివక్షతో చూస్తామెందుకు? ఆ ఉద్దేశంతోనే, ఇదే సంకలనంలో మానస ఎండ్లూరి రాసిన 'అదే ప్రేమ' కథ శీర్షికనే ఎంచుకున్నాము.

కథల ఎంపికకు వేటిని ప్రమాణాలుగా అనుకున్నారు?

క్వియర్ పాత్రలే ప్రధాన పాత్రలు కావాలి అని, వారి జీవితంలో జరిగే ఘర్షణను మాత్రమే ప్రెజెంట్ చేసే కథలు తీసుకున్నాను. అయితే ఎంపికకు పెద్దగా కష్టపడలేదు. మన కథలలో రెప్రెసెంటేషన్ మీద ఇంకా పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కాబట్టి సపోర్టింగ్ కారెక్టర్లుగా ఏ కథలోనూ క్వియర్ వ్యక్తులు లేరు. అంటే రచయితలు రాయాలనుకుని రాసిన కథలే గాని, క్వియర్ వ్యక్తులను సమాజంలో bystandersగా తెలిపిన కథలు ఇంచుమించుగా లేవు.

తెలుగులో 'క్వియర్' అంశం చుట్టూ తిరగిన మొదటి కథగా దేన్ని చెప్పవచ్చు?

విశ్వనాథ సత్యనారాయణ గారు 1922లో సాహితి పత్రికలో 'ఇంకొకవిధము' అనే రెండు పేజీల చక్కని కథను రాశారు. నాటక రంగంలో ఉన్నవారు కొంచెం లిబరల్‌గా ఉన్న వాతావరణంలో ఉంటారనేమో, అటువంటి నేపథ్యాన్ని ఎంచుకున్నారు.



> **మన మెయిన్ స్ట్రీమ్ సాహిత్యంలో ఇప్పటికీ క్వియర్ వ్యక్తుల ప్రస్తావన లేదు. మన అసమానతలలో ఉన్న వైవిధ్యం వలన అనుభవాల ద్వారా లేదా కళ్ళకెదురుగా కనబడే అసమానతనే వెలుగులోకి తెచ్చాము. క్వియర్ జీవితాలు అంచున ఉండడమే కాక ప్రధాన స్రవంతిలో మనకు ఎదురయ్యే సందర్భాలు చాలా తక్కువ కాబట్టి సాహిత్యంలో ఈ వస్తువు నిర్లక్ష్యానికి గురైంది.**

ఒక పేరున్న నాటక కళాకారుడు, ఆయనను ఆరాధించే ఒక పిల్లవాడు– ఆ పిల్లవాడి ఆరాధన, ఆయన అనురక్తి గురించి చాలా సున్నితంగా చెప్పారు. ప్రేమకు ఇంకొక విధము కూడా ఉంటుందని చెప్పడం ఆయన ఉద్దేశం అనుకుంటాను. కానీ ఆ కథ వారి మధ్య ఉన్న ప్రేమను, కరుణను గురించి చెబుతుంది కానీ శారీరక అనుబంధం ఉన్నాదని ఎక్కడా చెప్పలేదు. ఇది ఒక Asexual bonding అన్నారట ఆయన తన మనవడితో. క్వియర్ ఉనికిలో Asexual – Romantic/ Aromantic సంబంధాలు ఉంటాయని చాలామందికి తెలీదు. ఎంతసేపు క్వియర్ సంబంధాలని సెక్సువల్ సంబంధాలుగానే చూస్తారు.

మీరు గమనించిన తెలుగు 'క్వియర్' కథలు బయటి దేశాల 'క్వియర్' కథలతో పోల్చినపుడు ఎలా భిన్నంగా ఉన్నాయి?

బయటి దేశాల క్వియర్ కథలు క్వియర్ వ్యక్తులే రాస్తారు. ఒకవేళ నాన్ క్వియర్ వ్యక్తులు రాస్తే చాలావరకు క్వియర్ పాత్రలను సహాయ పాత్రలుగా చూపించడమో లేక వారిని ప్రధాన పాత్రలుగా చూపిస్తే సరైన రీసర్చ్ చేసి చూపిస్తారు. వారి సాహిత్యంలో చాలా ముందే అంటే, ఇంచుమించుగా 60 ఏళ్ళ ముందే క్వియర్ క్యారెక్టర్ల ప్రస్తావన ఉంది. కానీ మన మెయిన్ స్ట్రీమ్ సాహిత్యంలో ఇప్పటికీ క్వియర్ వ్యక్తుల ప్రస్తావన లేదు. మన అసమానతలలో ఉన్న వైవిధ్యం వలన అనుభవాల ద్వారా లేదా కళ్ళకెదురుగా కనబడే అసమానతనే వెలుగులోకి తెచ్చాము. క్వియర్ జీవితాలు అంచున ఉండడమే కాక ప్రధాన స్రవంతిలో మనకు ఎదురయ్యే సందర్భాలు చాలా తక్కువ కాబట్టి సాహిత్యంలో ఈ వస్తువు నిర్లక్ష్యానికి గురైంది.

అంతేగాక, తెలుగు రచయితలు క్వియర్ కథలను రాసినా, అది బైనరీ (ఆడ–మగ) లెన్స్ తోనే రాసినది. దాని అర్థం: కొన్ని కథలలో పాత్రలను క్వియర్ పాత్రలుగా కాక ఇంకేదైనా వైవిధ్యంతో (కులం, శరీర వైకల్యం, వర్ణం) మార్చినా కథలో విపరీతమైన మార్పులేమీ కనిపించవు. దీనికి కారణం రచయితలు వారి ప్రాంతాలకు వెళ్ళకపోవడం, వారితో స్నేహం చేయకపోవడం, వారి జీవితాల గురించి కళ్ళకు కనపడినంతే చూసి రాసేయడం, కొన్నిసార్లు అపోహలతో కథలు రాయడం (ఇది అన్నిటికన్నా ప్రమాదం). దీనికి కారణం క్వియర్–నాన్ క్వియర్ జీవితాలు రెండు పారలల్ గీతాలలా సంబంధం లేకుండా నడుస్తాయి. కానీ క్వియర్ జీవితాలలో హింసను ప్రేరేపించేది నాన్ క్వియర్ సిద్ధాంతాలే. కాబట్టి నాణ్యమైన క్వియర్ కథలు రాయాలి అంటే వారితో సంభాషణ, స్నేహం పెరగాలి.

thota.aparna@gmail.com

'భూపతి చంద్ర' కథానికల పోటీ

'భూపతి చంద్ర' మెమోరియల్ ట్రస్ట్, ప్రజ్ఞాపురం, గజ్వేల్ నిర్వహిస్తున్న 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీకి ఆహ్వానం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.10వేలు, 8వేలు, 6వేలు. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కరికి రూ.2 వేలు. కథానికలను డిటిపిలో ఏ4 సైజు 4 పేజీలు మించకుండా జనవరి 1 లోపు ఈమెయిల్: bcmkantha@gmail.comకు, లేదా వాట్సాప్: 9959020513కు, లేదా చిరునామా: ఆనంద నిలయం, ఇం.నం.1–5–1020/4, బి.ఆర్. రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ – 500 010కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 99636 16999.

ఎమ్.ఎల్. కాంతారావు

తెలుగు కథల పోటీ


తిరుపతి– విశ్వశ్రీ సాహితీ సమాఖ్య, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ 2026 మార్చి 19 పరాభవ నామ ఉగాది సందర్భంగా తెలుగు కథల పోటీని నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5116, రూ.3116, రూ.2116, ఐదు ప్రోత్సాహక బహుమతులు రూ.1116. ఉత్తమ 25 కథలతో ఒక సంచిక ముద్రిస్తారు. ఏ4 సైజ్‌లో 3 పుటల లోపు కథలను డిసెంబరు 31 లోగా ఈమెయిల్: viswasrikadha2025@gmail.com కు పంపాలి.

గార్లపాటి దామోదర నాయుడు

నవలా రచన పోటీ

జొన్నలగడ్డ రాంభొట్లు–సరోజమ్మ స్మారక నవలా పోటీకి 'మారుతున్న విలువలు, చదువులు, తల్లిదండ్రుల బాధ్యత, యువత నేపథ్యం' అంశంపై నవలలు పంపాలి. ఉత్తమ నవలకు రూ.40వేల నగదు బహుమతి. ఎంపికైన ఇతర నవలలకు ప్రత్యేక పురస్కారాలు. నవలలను మార్చి 1, 2026లోపు వర్డ్ లేదా, పి.డి.ఎఫ్ ఫార్మాట్‌లో పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 99488 96984, ఈమెయిల్: subbujvr@gmail.com.

సిరికోన సాహితీ అకాడెమీ



గారడీ వెలుగులో మా పేట

అంతకుమునుపు....
ఊరవతల విసిరేసిన
మసిపాతల మూట లాంటి మాపేటలో
గురయ్య తాత సన్నాయి
పేటకి వేకువ పాటైయ్యేది
తంబురపై జమ్మయ్య తాత తత్వం
మానవ మహేతిహాసాన్ని గానం చేసేది
తెల్లారగట్ల చదువుతో తెలివబ్బుతుందని
బుడ్డీల వెలుగులో పేట వేకువ బడయ్యేది
నాటుమందుల కూరయ్య తాత దొడ్డి
పురిటికందుల కేరింతలతో ఘోషాసుపత్రయ్యేది

పొద్దుబోతే చాలు బురికెడు సారా సుక్కలేసి
పుచ్చాల పోతన్న పురాన్లతో పేట పూనకమయ్యేది
మమకారం ఆర మగ్గిన తుమ్మిక పండయ్యేది
ఎలక్కాయలా వగరు బారిన ఎటకారముండేది

తిల్లేల దాటితే....

మోషే నుండి యేసయ్య వరకూ
సారంగధర నుండి దువ్వన్నదొర వరకూ
పేట కతల పుట్టయ్యేది
మాలవారి మంగమ్మ, యలమల సత్యరావుల ప్రేమకావ్యం
రాయప్ప జముకుపై గానమవుతుంటే
కంటికి మింటికి కన్నీటి ధారయ్యేది పేట

జముకుగానో ఈర్నంగానో...
మా వారసత్వపు వాయిద్యమంతా
పేట సిలక్కొయ్యలపై కొలువు కూకుండేది
ఎన్ను పట్టికి ఏలబడ్డ ఎండు ఒరుగులు
వారం పూటకి ఇష్టమైన నీసుకోరయ్యేవి
కానికష్టమే ఇంటికొచ్చినా
కంటికిరెప్పై పేట కాపు కాసేది
మోతుబారితనం హద్దుమీరితే
పేట కన్నమనీడు కరవాలమయ్యేది

ఇప్పుడు! పేట పేటలా లేదు !

ఇరుకు వీధులు... ఎలుగేసి కట్టినట్టు ఎలివేషన్లు
గాలి వెలుతురు దూరని కాంక్రీట్ గదులు
కల్లాపికి వాకిలి లేదు
ముగ్గానించడానికి మూరెడు అరుగూ లేదు
ఏ బీరబడ్డో పాకడానికి పెణక లేదు
ఇంటి వెనకాల పెరడూ లేదు
సంబరమొస్తే చిందేసే డప్పు లేదు
చావొస్తే ఈర్నపు పురాగాన శోకమూ లేదు
పేటంతటినీ ఒక్కచోటికి చేర్చే కష్టసుఖాలబోతా లేదు

మేడిపండులా పైకి నవనవలాడుతున్నా
పేట బతుకు నిండా పురుగు దొలుస్తున్న పేదరికం
గారడీవోడి దీపాలాటలో నిగనిగా ఎలిగిపోతున్నా
మా పేట లోపట ఎడతెరిపిలేని చీకటి ముసురు...

■ కలమట దాసు బాబు
✆ 80967 03363

మహా.. రుద్రాభిషేకం

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 7: ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా జరిగాయి. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. పాతకోటేశ్వర స్వామి దేవాలయం వద్ద అర్ధరాత్రి కర్పూర జ్యోతి దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. ఉదయం యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. జ్యోతి దర్శనం అనంతరం మేధా దక్షిణామూర్తి స్వాములు దీక్ష విరమించారు.


పాలాభిషేకం


పెరుగుతో..


నెయ్యితో..


పసుపుతో..


కుంకుమతో..


విభూదితో..


గంధంతో..


చెక్కరతో..


అన్నాభిషేకం


శ్రీ పాత కోటేశ్వర స్వామి మూలవిరాట్‌కు విశేష అలంకారం

సమాజంలో మార్పు కోసం బొల్లిముంత కృషి

● జీవిత సాఫల్య పురస్కారం స్వీకరించిన బ్రహ్మానందం


సినీ హాస్యనటుడు బ్రహ్మనందంను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న బొల్లిముంత ఫౌండేషన్ సభ్యులు

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ తపన పడ్డారని సినీ హాస్యనటుడు బ్రహ్మానందం తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి బొల్లిముంత శివరామకృష్ణ జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో బ్రహ్మానందాన్ని సత్కరించి లక్ష నగదు అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ వైకుంఠపురం ఆలయంలో తన వివాహమైందని, ఆ దేవుడి ఆశీస్సులే తనకు ఇంత స్థాయిని తెచ్చిపెట్టాయని చెప్పారు. జేఎంజే కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేసిన బంధువు కోసం తరచూ తెనాలి వచ్చేవాడినని, పట్టణంలో శ్రీరామ నవమి పందిళ్లలో పానకం, వడపప్పు తిన్నానంటూ గుర్తు చేసుకున్నారు. తెలుగు సాహిత్యంలో గొప్ప కవి బమ్మెర పోతనమాత్యులని చెప్పారు. నాటకరంగ అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, బొల్లిముంత కృష్ణ, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సామాజిక కార్యకర్త చెరుకూరి రమేష్‌బాబు, శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష, నృత్య గురువులు నిర్మలారమేష్, బాలత్రిపురసుందరి, రంగనాయకి, వసంతదుర్గ, వెంకటలక్ష్మి, రామచంద్రమూర్తిలను సన్మానించారు.

రేషన్ మాఫియాకు సహకారం.. పొన్నూరులో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

పొన్నూరుటౌన్, గుంటూరు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాకు సహకరిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎం నాగార్జున(పీసీ 4080), వై మహేష్(పీసీ 4406) రేషన్ రవాణా చేసే వారికి సహకరిస్తున్నట్లు గుర్తించి వారిపై చర్యలు తీసుకున్నారు. రేషన్ అక్రమాలపై పోలీసుల నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అక్రమార్కులకు చేరవేస్తూ క్రమశిక్షణను ఉల్లంఘించినందున వారిని సస్పెండ్ చేసినట్లు ఎస్పీ ప్రకటించారు. ఇదే ఘటనలో ఇంకా ఎవరైనా బాధ్యులు ఉంటే విచారించి వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

● రెండు కిలోల గంజాయి స్వాధీనం 7

బీసీలపై జగన్‌ది కపట ప్రేమ

● టీటీడీ బోర్డు సభ్యుడు జంగా తీవ్ర అభ్యంతరం 3

హోర్డింగ్‌లతో.. హడల్

● ప్రమాదకరంగా ప్రకటనల బోర్డులు

పదుల అడుగుల ఎత్తులో వేలాడున్న హోర్డింగ్‌లు హడలెత్తిస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న బోర్డులు ఎప్పుడు ఎవరిపై పడతాయోనని ప్రజలు భీతిల్లిపోతున్నారు. విద్య, వ్యాపార కేంద్రాలైన గుంటూరు నగరంతో పాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో హోర్డింగ్‌లకు డిమాండ్ ఉంది. ఇదే అవకాశంగా పలువురు అనధికారికంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీల అనుమతి తీసుకుంటే ప్రత్యేకంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చార్జీలు చెల్లించకుండా అధికారులకు మామూళ్లు సమర్పించుకుని ఎక్కడంటే అక్కడ ఎలాగంటే అలాగ.. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేస్తున్న వ్యాపార ప్రకటనల బోర్డులు ప్రమాదాలకు నెలవుగా ఉంటున్నాయి. వర్షాలు, గాలుల సమయంలో బోర్డులు పడిపోయి పలువురు గాయపడుతున్నా అధికారులతో పాటు హోర్డింగ్‌ల నిర్వాహకులకు పట్టడంలేదు.

- పట్టణాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు
- ఆదాయాలు కోల్పోతున్నా పట్టని మున్సిపాల్టీలు
- నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడంటే అక్కడ ఏర్పాటు
- ప్రకటనలకే పరిమితమైన జరిమానా, చర్యల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాలు, గుంటూరు నగర పరిధిలో విద్య, వాణిజ్య ప్రకటనల బోర్డులకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో మున్సిపల్, ప్రభుత్వ స్థలాలతో పాటు రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించి విచ్చలవిడిగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్లపై, రోడ్ల మలుపుల్లో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులతో ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. కొందరు దళారులు సిండికేట్‌గా మారి అధికారులను మామూళ్లతో లోబరుచుకుని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేటు భవనాలపై అనధికార హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రకటనల బోర్డులతో యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు రూ.లక్షల్లో అక్రమంగా సంపాదిస్తుండగా అందులో టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లతో ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల మధ్య, జంక్షన్లలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నా ఎవరికీ (మిగతా 7లో)

ఆంధ్రజ్యోతి ఫోకస్

జేబులు నింపుతున్నాయి

హోర్డింగ్‌లు.. ప్రకటనల బోర్డులు.. స్థానిక సంస్థ ఖజానాలను నింపాలి. కానీ కొంతమంది అధికారుల జేబులు నింపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. ప్రమాదకరంగా.. ఎక్కడంటే అక్కడ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అధికారులకు పట్టడంలేదు. పదుల సంఖ్యలో అనుమతులు తీసుకుని వందల సంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అడిగే నాథుడు లేడు. రూపాయి కూడా చెల్లించకుండా రోడ్ల మార్జిన్లలో, షాపుల ముందు, డివైడర్ల మధ్యలో, జంక్షన్లలో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.





అబ్బురం.. నాట్య నీరాజనం

తెనాలి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల మంది చిన్నారుల మువ్వల రవళిలు సందడి చేయగా.. ఏకకాలంలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్ర ప్రాంగణం వేదికగా నాట్య నీరాజనం ఆవిష్కృతమైంది. చూపరులను కట్టిపడేసేలా చిన్నారులు కూచిపూడి నృత్యాభినయంతో అబ్బురపరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సహకారంతో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతుండగా బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.నృత్యగురువు నిర్మలారమేష్, వెంకటలక్ష్మి, రామచంద్రమూర్తి, యామిని, బాలత్రిపురసుందరి, రంగనాయకి, వసంత దుర్గల వద్ద శిక్షణ పొందుతున్న బాలికలు మహానాట్య నీరాజనం పేరుతో మూడు గంటల పాటు నృత్య ప్రదర్శన చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు చందు సుబ్బారావు, సభ్యులు పర్యవేక్షించారు.

ఎల్వీఆర్ క్లబ్ ఎన్నిక ఏకగ్రీవం

● ఫలించిన పెద్దల మంత్రాంగం

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలకవర్గం ఎన్నికల్లో పెద్దల మంత్రాంగం ఫలించింది. కీలక పదవులు ఏకగ్రీవమయ్యాయి. పాలకవర్గానికి సంబంధించిన 18 పదవులకు 108 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కమిటీకి ఎన్నికలు తప్పనిసరి అని భావించారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. పోటీలో నిలిచిన వారితో పెద్దలు సంప్రదింపులు జరిపారు. దీంతో కీలక పదవులైన అధ్యక్ష, కార్యదర్శులు సహా 16 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు పదవులకు మాత్రం ఎనిమిది మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో ఆ పదవులకు ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నెల 14న ఎన్నికలు జరగనున్నాయి.

అధ్యక్షుడిగా నూకవరపు..

ఎల్వీఆర్ అధ్యక్షుడిగా నూకవరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పతంగి జనార్దన్‌రావు, కార్యదర్శిగా యర్రమనేని రామకృష్ణ, కోశాధికారిగా వక్కలగడ్డ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కొండ్రగుంట బుచ్చిబాబు, టెన్నిస్ - కొమ్మినేని నాగేశ్వరరావు, బిలియర్డ్స్ - వట్టికూటి బాలాజీ ప్రసాద్, బఫెట్ - నెల్లూరు రోశయ్య, ఇండోర్ గేమ్స్ - వట్టిగుంట నాగిరెడ్డి, రీడింగ్ రూమ్, లైబ్రరీ - పాలడుగు సుబ్బారావు, కళలు, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు - డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, బార్ - కృష్ణమనేని లలిత బాబు, విశ్రాంతి గదులు - తిరువీధి వెంకటరమణయ్య, స్పోర్ట్స్, హౌస్ కీపింగ్ - వజ్రాల సాంబిరెడ్డి, జిమ్, సూపర్ బజార్ - కొలిపాకుల చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ, క్రీడా కార్యక్రమాలు - కుర్రా ఏసుబాబులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నార్నె బాబూజీరావు తెలిపారు. వైద్యశాలకు డాక్టర్ పెద్ది వెంకటరావు, కూనిశెట్టి వెంకటరమణ ప్రసాద్, క్యారమ్స్, చెస్ విభాగానికి నలుగురు బరిలో నిలిచారు.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

● పీజీఆర్ఎస్‌కు అధికంగా రెవెన్యూ సమస్యలు ● ఏళ్ల తరబడి తిరుగుతున్న బాధితులు ● పరిష్కారం చూపని అధికారులు

నల్లపాడు శివారులోని గొర్రెల మండి వెనక సర్వే నంబరు 554లో దుగ్గెంపూడి వెంకటప్పారెడ్డికి చెందిన రెండెకరాల భూమి ఉంది. అందులోని కొంతభాగం 15 ప్లాట్స్ వేసి విక్రయించారు. మిగిలిన భూమి సర్వే చేయమని అర్జీదారుడు కృష్ణారెడ్డి(వెంకటప్పారెడ్డి మనవడు) రెండేళ్లుగా పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇస్తున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు.



- ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరుకు చెందిన దాసరి లలితకుమారి ఉపాధి కోసం కువైట్ కు వెళ్లి.. తిరిగొచ్చేసరికి తన ఇంటిని బంధువులు ఆక్రమించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కొన్నేళ్లుగా ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి అర్జీ అందజేస్తున్నారు.
- ప్రత్తిపాడు మండలంలోని చినకొండ్రుపాడుకు చెందిన పంతగాని సంసోన్ అనే వ్యక్తి తన భూమిని ఒక రాజకీయ నాయకుడు ఆక్రమించుకొన్నాడని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.
- పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో కడప స్వర్ణకుమారి తన 498 చదరపు గజాల భూమిని రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమిగా మార్చి వేరే వాళ్లకు పట్టాలు ఇచ్చారని, దీనిపై తాను కొన్నేళ్ల నుంచి ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవియన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి అర్జీదారుల ఫిర్యాదులను పరిష్కరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే జిల్లాస్థాయిలో మాత్రం ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఒక మొక్కుబడి తంతులా మారింది. ప్రతి అర్జీ పరిష్కారానికి నిర్ణీత వ్యవధి ఉంది. నిబంధనల ప్రకారం పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించాలి. అవి మళ్లీ రీఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత విభాగాల అధికారులదే. గణాంకాల్లో అంతా సవ్యంగా ఉందని ప్రభుత్వానికి నివేదించడంపైనే అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్జీలను ఫిర్యాదిదారు సంతృప్తి మేరకు పరిష్కరించాలి. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అదే విషయాన్ని తెలియజేసి కంప్లయింట్‌ని సంబంధిత వ్యక్తి ఆమోదం తీసుకొని మూసేయాలి.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గ్రీవియన్స్ ఎక్కువగా (మిగతా 7లో)

డ్రగ్స్ వద్దు.. సైకిల్ తొక్కు బ్రో

● కలెక్టర్, ఈగల్ ఐజీ, ఎస్పీ అవగాహన ర్యాలీ

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వద్దు.. సైకిల్ తొక్కు బ్రో అంటూ ఆదివారం గుంటూరులో అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ నుంచి గుజ్జనగుండ్ల పట్టాభిపురం మీదగా పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు ఈ సైకిల్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు. యువశక్తిని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా దాయాది దేశాలు మాదక ద్రవ్య మహమ్మారిని ఉసిగొల్పుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ శారీరక దారుఢ్యంతో మనసు ప్రశాంతంగా ఉండి డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం సైకిల్ వ్యాయామంతో సాధ్యమన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఆకతాయి తనంగా, కిక్ కోసం తీసుకునే గంజాయి, మాదక ద్రవ్యాలు మరణానికి తీసుకెళ్తాయని తెలుసుకోవాలన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మాదక ద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రజలందరూ కలసికట్టుగా స్పందించాలన్నారు. సభ అనంతరం అధికారులు, విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు.



డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కుబ్రో ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న ఆకే రవి కృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఈగల్ ఎస్పీ నగేష్ తదితరులు

జగన్ హయాంలో మార్కెట్ కమిటీలు నిర్వీర్యం

- రైతుల సంక్షేమం, లింకు రోడ్ల అభివృద్ధి శూన్యం
- ఏఎంసీ చైర్మన్ల అధికారాలను రద్దు చేశారు
- రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన
- చైర్మన్లకు చెక్ పవర్, బి-గ్రేడ్ హోదా ఇవ్వాలి
- మంగళగిరిలో ఏఎంసీ చైర్మన్ల సదస్సు తీర్మానం


సదస్సులో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు

మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్వీర్యమయ్యాయని, ప్రభుత్వం ఉన్న అధికారాలను తొలగించి, చెక్ పవర్‌ను కూడా రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని రాష్ట్ర వ్యవసాయ కమిటీ చైర్మన్లు ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సదస్సు ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. పలువురు చైర్మన్లు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను దుయ్యబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో చైర్మన్లకు ఉన్న అధికారాలను జగన్ అధికారంలోకి వచ్చాక ఉద్దేశ్యపూర్వకంగానే తొలగించారని మండిపడ్డారు. మార్కెట్ యార్డుల పరిధిలో ఉన్న లింకు రోడ్ల అభివృద్ధిని విస్మరించారని, వ్యవసాయ రంగానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయలేదని విమర్శించారు. మార్కెట్ యార్డు చైర్మన్లకు జగన్ ప్రభుత్వం తెచ్చిన, ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను రద్దు చేయాలని, చైర్మన్లకు చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లను ఎ, బి గ్రేడ్లుగా విభజించినందున, ఏఎంసీ చైర్మన్లకు బి-గ్రేడ్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన రెండేళ్ల కాలపరిమితితో నియోజకవర్గ పరిధిలో రైతుల సంక్షేమం, అభివృద్ధి పనులు కార్యాచరణకు సమయం సరిపోదని, ఈ విధానాన్ని రద్దు చేసి ఏఎంసీ చైర్మన్ల కాలపరిమితిని మూడేళ్లకు పెంచాలని కోరారు. మార్కెట్ యార్డులకు ఆర్థిక భరోసాతో పాటు స్వయం ప్రతిపత్తిని కల్పించాలని, టీటీడీలో వారానికి ఒకరోజు చొప్పున నెలకు నాలుగు సార్లు వేంకటేశ్వరస్వామి దర్శనం సిఫారసు కోసం అవకాశం కల్పించాలని విన్నవించారు. రైతు బంధు పథకం పునరుద్ధరణతోపాటు ఉల్లి, మిర్చి, మొక్క జొన్న తదితర పంట ఉత్పత్తులను ఆరబెట్టడం, నిల్వ చేసుకోవడానికి గోదాములు, ప్లాట్‌ఫాం నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా నంద్యాల ఏఎంసీ చైర్మన్ గుంటుపల్లి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన చైర్మన్లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచాలి

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రకృతి సేంద్రియ వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంపొందించి ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సారథ్యంలోప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్లు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రాణం తీసిన కుటుంబాల ఘర్షణ


మృతుడు ఓర్సు పర్వతాలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతముక్కల అగ్రహారంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణలో నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన ఓర్సు పర్వతాలు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి ఓర్సు కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి విషమంగానే ఉంది. నరసరావుపేట రూరల్ సీఐ ఎం. సుబ్బారావు వివరాల మేరకు.. కేతముక్కల అగ్రహారానికి చెందిన ఓర్సు మునలయ్య, వేముల వెంకటేశ్వర్లు మధ్య స్థల వివాదం నడుస్తోంది. ఆదివారం ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అనంతరం మధ్యాహ్నం వేముల వెంకటేశ్వర్లు, కుమారుడు అంకమ్మరావు పొల పనుల్లో ఉండగా.. ఓర్సు కోటేశ్వరరావు, ఓర్సు రమణయ్య, ఓర్సు హనుమంతరావు, ఓర్సు పర్వతాలు అక్కడ వెళ్లి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో ఓర్సు పర్వతాలు (55) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఓర్సు కోటేశ్వరరావును నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. వేముల వెంకటేశ్వర్లు, అతని కుమారుడు అంకమ్మరావు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కూచినపల్లిలో స్క్రబ్ టైఫస్

ఈపూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ మండలంలో కూచినపల్లిలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్క్రబ్ టైఫస్ జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో తలనొప్పితో పాటు కళ్లు కనిపించకుండా పోవడంతో వినుకొండ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచడంతోపాటు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నేడు అమరావతిలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ బృందం పర్యటన

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరాతిలో సోమవారం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు పర్యటించనున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఏపీసీఆర్డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాయింట్ టెక్నికల్ మిషన్‌లో భాగంగా ఈ పర్యటన జరగనుంది. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో మూడు సంస్థల ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. ఎన్జీవో ఉద్యోగుల అపార్టుమెంటు, సీడ్ యాక్సిస్ రోడ్డు(ఈ 3) రోడ్డు నిర్మాణ పనులు, తుళ్లూరులోని మరో నిర్మాణ సంస్థ క్యాంపు కార్యాలయం, ఈ-9 రోడ్డు పనులు, పెనుమాకలో వరదనీటి పనులను పరిశీలిస్తారు. నిర్మాణాల పురోగతి, ప్రమాదాల నివారణ, లేబర్‌క్యాంపులు తదితర అంశాలపై చర్చిస్తారు.

టెక్నాలజీ, ఇన్నోవేషన్‌పై నేడు వర్క్‌షాప్

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈలకు టెక్నాలజీ, ఇన్నోవేషన్, మేధో సంపత్తి హక్కులపై సోమవారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ(ఎన్ఆర్‌డీసీ), ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ దీనిని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లలో ఆవిష్కరణ సామర్థ్యం, సాంకేతిక స్వీకరణ, మేధో సంపత్తిని పెంచే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

న్యూకేటగిరిలో విజేత బాపట్ల ఎడ్లు


పందెపు బండను లాగుతున్న ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరిపారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత పందెపు బండను నిర్ణీత సమయంలో 4,422 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచింది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రెండోస్థానం, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్లజత మూడోస్థానం, గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పాలడుకు చెందిన శాఖమూర్తి విజయ్ పవన్‌కుమార్ సంయుక్త ఎడ్ల జత నాలుగోస్థానం, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజశ్వి మురళి, పిడుగురాళ్లకు చెందిన కూనల రామకోటయ్య సన్స్ ఎడ్ల జత ఐదోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలేనికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన సుఖవాసి సతీష్‌బాబు సంయుక్త ఎడ్లజత ఆరోస్థానం దక్కించుకున్నాయి.

నేడు శబరిమలకు స్పెషల్ ట్రైన్

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాత్రికుల రద్దీ దృష్ట్యా సోమవారం గుంటూరు మీదగా శబరిమలకు ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07085 హైదరాబాద్ - కొట్టాయం స్పెషల్ రాత్రి 9.50కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా బుధవారం వేకువజామున 5.30కి కొట్టాయం చేరుకొంటుంది. 07086 కొట్టాయం - హైదరాబాద్ స్పెషల్ ఈ నెల 10న బుధవారం ఉదయం 7.45కి బయలుదేరి చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి మీదగా గురువారం మధ్యాహ్నం 1.35కి హైదరాబాద్ చేరుకొంటుందన్నారు.

హోర్డింగ్‌లతో.. హడల్

(5వ పేజీ తరువాయి)

పట్టడంలేదు. గుంటూరు నగరంతో పాటు పలు మున్సిపల్ పట్టణాల్లో ఎక్కడ చూసినా అనధికార హోర్డింగ్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

చర్యలపై స్పందన శూన్యం

అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న అక్రమ హోర్డింగ్‌లపై కౌన్సిల్ సమావేశాల్లో తరచూ చర్చలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ప్రకటనల బోర్డులు ఉంటున్నా ఆ మేరకు ఆదాయం లేకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నా అధికారుల నుంచి సరైన స్పందన ఉండటంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అనధికార, ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లను తొలగిస్తామని, జరిమానా వసూలు చేస్తున్నామని సమాధానాలు చెప్పే అధికారులు ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడంలేదు. బోర్డుల ఏర్పాటు చేసే సంస్థల నుంచి మామూళ్లే అధికారుల మౌనానికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అనధికార హోర్డింగ్‌లకు రోజుకు 50 వేల చెప్పునా జరిమానా విధించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ అదేశాలను అధికారులు అమలు చేస్తారా అన్న విషయంపై సందేహం నెలకొంది. అనుమతులు తీసుకున్న హోర్డింగ్‌లు మాత్రమే లెక్కల్లో చూపించి మిగిలిన వాటి గురించి తమకేమి తెలియదన్నట్లు అధికారులు చోద్యం చూస్తుండటంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. గుంటూరులో అధికారకంగా 6,250 ఉండగా అనధికారికంగా 2500 పైగా హోర్డింగ్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిపై నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాపట్లలో 52 ప్రాంతాల్లో హోర్డింగ్‌ల ఏర్పాటుకు 21 సంస్థలు అనుమతి పొందినా అనేకమంది పన్నులు చెల్లించడంలేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. వీరికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. సూర్యలంక పరిసరప్రాంతాల్లో ఎక్కువగా అనధికార హోర్డింగ్‌లు ఉన్నట్లు తెలిసింది. రేపల్లె పట్టణంలో అనుమతి పొందిన హోర్డింగ్‌లు 20 ఉండగా అనధికార హోర్డింగ్‌లు పెద్దసంఖ్యలో ఉన్నాయి.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

(5వ పేజీ తరువాయి)

వస్తోన్న జిల్లాల్లో గుంటూరు కూడా ఒకటిగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 57 మండలాలున్నప్పుడు ఎన్ని ఫిర్యాదులైతే వచ్చేవో విభజన జరిగిన తర్వాత కూడా అంతే స్థాయిలో వస్తున్నాయి. రెవెన్యూకి సంబంధించి మ్యుటేషన్లు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు, రెవెన్యూ రికార్డులలో ఎంట్రీల కరెక్షన్స్, ల్యాండ్ పార్శిల్స్ విభజన, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో జాప్యం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించడం వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. వీటిపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురై నాన్చుతున్నారు. కొన్ని ఫిర్యాదులను పరిష్కరించకుండానే క్లోజ్ చేసేస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 20 వేలకు పైగా అర్జీలు అందాయి. దీని వలన పబ్లిక్ ఫీడ్ బ్యాక్‌లో సంతృప్తి శాతం 50 నుంచి 60 శాతం మధ్యనే ఉంటోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీజీఆర్ఎస్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. వాటి ఫలితాలు ఎలా ఉంటాయో కొద్ది రోజుల్లో తెలుస్తుంది.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) మెసర్స్ ఆర్.బి ఎంటర్‌ప్రైజెస్, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, చిలకలూరిపేట, గుంటూరు-522616. నం.2) శ్రీ మేడికొండూరి రాంబాబు, తండ్రి మేడికొండూరి రాఘవయ్య, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట, గుంటూరు-522616 నం.3)శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హరీష, భర్త మేడికొండూరి రాంబాబు, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట, గుంటూరు-522616 వారి నుండి 03.10.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 02.10.2025 నాటికి రూ.34,24,338/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ఇరవై నాలుగు వేల మూడు వందల ముప్పై ఎనిమిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తి
(శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హరీష, భర్త మేడికొండూరి రాంబాబుకు చెందిన ఆస్తి)

గుంటూరు జిల్లా, చిలకలూరిపేట సబ్ జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట మున్సిపల్ ఏరియాలో గల బ్లాక్ నం.16, పురుషోత్తమ పట్నం గ్రామ డి.నం.56/1లోని పాత డోర్ నం.16-54, కొత్త డోర్ నం.16-81గల ఆర్‌సిసి దాబా ఇల్లు మరియు స్థలం 82.50 చ.గ.ల ఆస్తి యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** చల్లగుండ్ల రామసుబ్బయ్య - 66 అడుగుల ఆస్తి మరియు ఈ ఆస్తి మధ్య ఉమ్మడిగోడ, దక్షిణం : బోడపాటి సీతామహాలక్ష్మి - 11.3 అడుగల ఆస్తి మరియు ఈ ఆస్తి యెక్క గోడ, పశ్చిమం: మలినేని నారాయణ బాబు - 66 అడుగుల ఆస్తి మరియు ఈ ఆస్తి మధ్య ఉమ్మడి గోడ, **ఉత్తరం:** మున్సిపల్ బజార్-11.3 అడుగులు.

రిజర్వు ధర: రూ. 60,00,000/-
(రూపాయలు అరవై లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
29-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, నం.7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616, టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148,8925876329

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, నం.7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148, 8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికేట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం: కుంబకోణం, తేది: 06.12.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN-L65110TN1904PLC001287. టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ- టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం.1) మెసర్స్ భవనం స్పిన్నింగ్ మిల్స్ (ప్రై) లిమిటెడ్, డి.నం.4-5-29/143, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్ కాలనీ, గుంటూరు-522007 మరియు మెసర్స్ భవనం స్పిన్నింగ్ మిల్స్ (ప్రై) లిమిటెడ్, భీమినేని వారి పాలెం, సిరిపురం రోడ్, గుంటూరు జిల్లా-522438, నం.2) శ్రీ భవనం వెంకటప్ప రెడ్డి, తండ్రి కొండా రెడ్డి, ఫ్లాట్ నం.4ఎ, టెంపుల్ టవర్ అపార్ట్‌మెంట్, 5వ లైన్, గుంటూరు-522006 మరియు శ్రీ భవనం వెంకటప్ప రెడ్డి, తండ్రి కొండా రెడ్డి, డి.నం.1-1-773, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ కాలనీ, రింగ్ రోడ్, గుంటూరు-522007, నం.3) శ్రీమతి భవనం బుల్లమ్మ, భర్త కొండా రెడ్డి, డి.నం.1-1-773, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ కాలనీ, రింగ్ రోడ్, గుంటూరు-522007 మరియు శ్రీమతి భవనం బుల్లమ్మ, భర్త కొండా రెడ్డి, డి.నం.1-2, నల్లపాడు, గుంటూరు-522005, నం.4) శ్రీమతి భవనం శివ కుమారి, భర్త భవనం వెంకటప్ప రెడ్డి, డి.నం.1-1-773, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ కాలనీ, రింగ్ రోడ్, గుంటూరు-522007 మరియు శ్రీమతి భవనం శివ కుమారి, భర్త భవనం వెంకటప్ప రెడ్డి, ఫ్లాట్ నం.4ఎ, టెంపుల్ టవర్ అపార్ట్‌మెంట్, 5వ లైన్, గుంటూరు-522006, నం.5) శ్రీ భవనం కొండా రెడ్డి, తండ్రి వెంకట రెడ్డి, డి.నం.1-1-773, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ కాలనీ, రింగ్ రోడ్, గుంటూరు-522007, మరియు శ్రీ భవనం కొండా రెడ్డి, తండ్రి వెంకట రెడ్డి, డి.నం.1-2, నల్లపాడు, గుంటూరు-522005, నం.6) శ్రీమతి భవనం ఆదిలక్ష్మి, భర్త రామకోటి రెడ్డి డి.నం. 1-1- 773, ఇంటి నం.27, 2/2, విద్యా నగర్, ఎస్‌బిఐ ఆఫీసర్ కాలనీ, రింగ్ రోడ్, గుంటూరు -522005 వారి నుండి 21.05.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 20.05.2025 నాటికి రూ.63,36,13,319/- (రూపాయలు అరవై మూడు కోట్ల ముప్పై ఆరు లక్షల పదమూడు వేల మూడు వందల పంతొమ్మిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూల్ - ఎ : (మెసర్స్ భవనం స్పిన్నింగ్ మిల్స్ (ప్రై) లిమిటెడ్‌కు చెందిన ఆస్తి)

ఐటమ్ నం.1: గుంటూరు జిల్లా, నర్సరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం ఉపజిల్లా, వేమవరం గ్రామ పంచాయితీ ప్రాంతం, అస్సెస్‌మెంట్ నం.525, 526, వేమవరం గ్రామ డి.నం.33,35/1, విస్తీర్ణం ఎ.11.37 సెంట్లు (లేదా) 55030.80 చ.గజాల విస్తీర్ణం వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం (స్పిన్నింగ్‌మిల్ యూనిట్, గోడౌన్లు, మిషనరీ హాల్, స్టాఫ్ క్వార్టర్లు & ఇతరులు) యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పొట్లపల్లి కృష్ణారెడ్డి & ఇతరుల నుండి విక్రేత ద్వారా కొనుగోలు చేసిన ఆస్తి, దక్షిణం : పొట్లపల్లి కోటిరెడ్డి & ఇతరుల నుండి విక్రేత ద్వారా కొనుగోలు చేసిన ఆస్తి, పశ్చిమం:బత్తుల అంజిరెడ్డి & ఇతరుల భూమి, ఉత్తరం: ఎన్ఎస్‌పి బోదే కాలువ & ఇతరభూములు.

ఐటమ్ నం.2: గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం ఉపజిల్లా, వేమవరం గ్రామ పంచాయితీ ప్రాంతం, వేమవరం గ్రామ డి.నం.33,44,45/డి వద్ద 1271 చ.గజాల విస్తీర్ణం వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భవనం ఐటం నం.1 ఆస్తికి చేరుకొను మార్గం/ భూమి యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పంచాయితీ రోడ్, దక్షిణం: పంచాయితీరోడ్, పశ్చిమం:చేజెటి రామిరెడ్డి భూమి, ఉత్తరం: ఐటం నం.1 ఆస్తి. మిషనరీల మినహా.

రిజర్వు ధర: రూ. 19,90,00,000/-
(రూపాయలు పంతొమ్మిది కోట్ల తొంభై లక్షలు మాత్రమే)

షెడ్యూల్ - బి : (మెసర్స్ భవనం స్పిన్నింగ్ మిల్స్ (ప్రై) లిమిటెడ్‌కు చెందిన ఆస్తి)

(ఎ) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.లు:211/2బి/2ఎ1 మరియు 2ఎ3 వద్ద ఎ.1.00 విస్తీర్ణం పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పాటిబండ్ల శ్రీనివాసరావు భూమి, దక్షిణం: పాటిబండ్ల కోటేశ్వరరావు భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: భవనం కొండారెడ్డి భూమి.

(బి) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.211/2ఎ/2ఎ1బి, 211/2సి/2డి, డి.నం.లు :210/2బి/1బి మరియు 210/2బి/3సి2 వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **కొలతలు:** ఎ.0.60 సెంట్ల విస్తీర్ణ భూమి **సరిహద్దులు:** తూర్పు: P.W.D. కాలువ, దక్షిణం: స్పిన్నింగ్‌మిల్‌కు అమ్మిన భూమి, పశ్చిమం: స్పిన్నింగ్‌మిల్ భూమి, ఉత్తరం: శనగవరపు వెంకటేశ్వర్లు భూమి.

(సి) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.211/1బి/1సి3 వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **కొలతలు:** ఎ.1.16 సెంట్ల విస్తీర్ణ భూమి **సరిహద్దులు:** తూర్పు: P.W.D. కాలువ, దక్షిణం: స్పిన్నింగ్‌మిల్ భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: పాటిబండ్ల కోటేశ్వరరావు భూమి.

(డి1) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.211/1బి/1సి3 వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **కొలతలు:** ఎ.1.30 సెంట్ల విస్తీర్ణ భూమి **సరిహద్దులు:** తూర్పు: P.W.D. కాలువ, దక్షిణం: భవనం రామకోటి రెడ్డి భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: భవనం కొండారెడ్డి భూమి.

(డి2) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.211/1 వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **కొలతలు:** ఎ.1.19 సెంట్ల విస్తీర్ణ భూమి **సరిహద్దులు:** తూర్పు: P.W.D. కాలువ, దక్షిణం: షేక్ బాబు సాహేబ్ కుమారుల భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: స్పిన్నింగ్‌మిల్ భూమి.

(ఇ) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామ పంచాయితీ పరిధులలో గల డి.నం.లు 211/2ఎ/2ఎ1, 211/2ఎ/2ఎ3, 211/2బి/2ఎ1, 211/2ఎ/2సి1 మరియు 211/2బి/2సి3 వద్ద భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **కొలతలు:** ఎ.1.66 సెంట్ల విస్తీర్ణ భూమి **సరిహద్దులు:** తూర్పు: P.W.D. కాలువ, దక్షిణం: స్పిన్నింగ్‌మిల్ భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: స్పిన్నింగ్‌మిల్ భూమి.

షెడ్యూల్ - ఎఫ్ : (శ్రీ భవనం వెంకటప్పరెడ్డి తండ్రి కొండారెడ్డికి చెందిన ఆస్తి)

ఎ) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామం, వెలవర్తిపాడు గ్రామపంచాయితీ పరిధులలోని, డి.నం. 211/2ఎ/2ఎ1 వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం ఎ.2.00 సెంట్ల భూమి. **సరిహద్దులు:** తూర్పు: శనగవరపు వీరస్వామి భూమి వగైరా. దక్షిణం: భవనం కొండారెడ్డి భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: వెలవర్తిపాడుకు వెళ్లే డొంక.

షెడ్యూల్ - జి : (శ్రీ భవనం కొండారెడ్డి తండ్రి వెంకట రెడ్డికి చెందిన ఆస్తి)

బి) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, పొట్లపాడు గ్రామం, జంగంగుంట్లపాలెం గ్రామపంచాయితీ పరిధులలోని, డి.నం. 211/2ఎ/2ఎ1 వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం ఎ.1.06 సెంట్ల భూమి. **సరిహద్దులు:** తూర్పు: శనగవరపు వీరస్వామి భూమి వగైరా. దక్షిణం: పాటిబండ్ల కోటేశ్వరరావు భూమి, పశ్చిమం: సిరిపురం రోడ్, ఉత్తరం: భవనం వెంకటప్పరెడ్డి భూమి. మిషనరీల మినహా.

రిజర్వు ధర: రూ. 23,90,00,000/-
(రూపాయలు ఇరవై మూడు కోట్ల తొంభై లక్షలు మాత్రమే) (షెడ్యూల్ - బి, ఎఫ్ & జి కొరకు)

షెడ్యూల్ - సి : (శ్రీ భవనం కొండారెడ్డి, తండ్రి వెంకటరెడ్డికి చెందిన ఆస్తి)

(ఎ) గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయతీ పరిధులలో డి.నం.1-1 వద్ద భూమి విస్తీర్ణం 376 చ.గజాల పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **సరిహద్దులు (డి.నం.418):** తూర్పు: దుగ్గెంపుడి సీతారామిరెడ్డి వగైరాల స్థలం. దక్షిణం:దుగ్గెంపుడి సీతారామిరెడ్డి వగైరాల స్థలం. పశ్చిమం: దుగ్గెంపుడి సీతారామిరెడ్డి గోడ కొంత విస్తీర్ణం మరియు చల్లా రామిరెడ్డి గోడ కొంత విస్తీర్ణం, ఉత్తరం: పంట కాలువ.

(బి) గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయతీ పరిధులలో డి.నం.1-1 వద్ద భూమి విస్తీర్ణం 24 చ.గజాల పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **సరిహద్దులు (డి.నం.418):** తూర్పు: దుగ్గెంపుడి సీతారామిరెడ్డి వగైరాల స్థలం. దక్షిణం: పంచాయితీ బజార్, పశ్చిమం: ప్రహరి గోడ ఉత్తరం: ఐటం నం.1 ఆస్తి.

(సి) గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయతీ పరిధులలో డి.నం.1-1 వద్ద భూమి విస్తీర్ణం 76½ చ.గజాల పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **సరిహద్దులు (డి.నం.418):** తూర్పు: గంటా వెంకట సుబ్బారెడ్డికు అమ్మిన స్థలం.దక్షిణం: మొదల కొండా అంకిరెడ్డి మరియు భవనం కొండారెడ్డికు అమ్మిన స్థలం, పశ్చిమం: భవనం కొండారెడ్డి స్థలం. ఉత్తరం:కాలువ.

(డి) గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయతీ పరిధులలో డి.నం.1-1 వద్ద భూమి విస్తీర్ణం 67 2/3 చ.గజాల పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోయేవి మరియు ప్రస్తుతమున్న భూమి & భవనం యావత్తు. **సరిహద్దులు (డి.నం.418):** తూర్పు: కాలువ మరియు బజార్ దక్షిణం: గంటా వెంకటసుబ్బారెడ్డికి అమ్మిన స్థలం.పశ్చిమం: ఐటం నం.1 స్థలం. ఉత్తరం:కాలువ.

(ఇ) గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయతీ పరిధులలో డి.నం.1-1 వద్ద భూమి విస్తీర్ణం 251 చ.గజాల పై భవిష్యత్తులో దానిపై నిర్మించబోవు మరియు ప్రస్తుతమున్న భూమి మరియు భవనము యావత్తు. **సరిహద్దులు (డి.నం.418):** తూర్పు: ముదెల అంకిరెడ్డి స్థలం. దక్షిణం: పంచాయితీ బజార్, పశ్చిమం: భవనం కొండారెడ్డి స్థలం, ఉత్తరం: భవనం కొండారెడ్డి స్థలం.

రిజర్వు ధర: రూ 2,25,00,000/-
(రూపాయలు రెండు కోట్ల ఇరవై ఐదు లక్షలు మాత్రమే)

షెడ్యూల్ - జె : (శ్రీ భవనం కొండారెడ్డి తండ్రి వెంకటరెడ్డికి చెందిన ఆస్తి)

ఎ) గుంటూరు, విద్యానగర్ 2/2, SBI ఆఫీసర్స్ కాలనీ వద్ద గల అసెస్‌మెంట్ నం.5845, డోర్ నం.4-5-29/143 వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం 240 చ.గజాలు స్థలం మరియు నిర్మించబడిన డాబా ఇల్లు. **సరిహద్దులు:** (డి.నం.18/ఎ) తూర్పు : ఉమ్మడి గోడ, దక్షిణం: రోడ్, పశ్చిమం : నాగిరెడ్డి ప్రహరీగోడ (ఫ్లాట్ నం.28), ఉత్తరం: కె.సాంబశివరావు ఇల్లు (ఫ్లాట్ నం.20).

బి) గుంటూరు, విద్యానగర్ 2/2, ఎస్బీఐ ఆఫీసర్స్ కాలనీ వద్ద గల అసెస్‌మెంట్ నం.5845, డోర్ నం.4-5-29-143 వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం 240 చ.గజాలు స్థలం మరియు నిర్మించబడిన డాబా ఇల్లు. **సరిహద్దులు:** (డి.నం.18/ఎ) తూర్పు: తోట రత్తయ్య ప్రహరీ గోడ (ఫ్లాట్ నం.26), దక్షిణం: రోడ్, పశ్చిమం :ఉమ్మడి గోడ, ఉత్తరం: కూరగల్లు సాంబశివరావు ప్రహరీగోడ (ఫ్లాట్ నం.20).

రిజర్వు ధర: రూ 5,75,00,000/-
(రూపాయలు ఐదు కోట్ల డెబ్బై ఐదు లక్షలు మాత్రమే)

షెడ్యూల్ - కె : (శ్రీ భవనం కొండారెడ్డి తండ్రి వెంకట రెడ్డికి చెందిన ఆస్తి)

ఎ) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, పొట్లపాడు గ్రామం, జంగంగుంట్లపాలెం గ్రామపంచాయితీ పరిధులలోని, డి.నం. 75/2సి వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం ఎ.1.27 సెంట్లు గల భూమి. **సరిహద్దులు:** తూర్పు: సిరిపురంకు వెళ్లే రోడ్. దక్షిణం: డి.నం.101/4సి కలిగిన భూమి, పశ్చిమం:పి.డబ్ల్యూ.డి. కెనాల్, ఉత్తరం: ఈదర మహాలక్ష్మికి చెందిన భూమి.

బి) గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, పొట్లపాడు గ్రామం, జంగంగుంట్లపాలెం గ్రామపంచాయితీ పరిధులలోని, డి.నం. 101/4సి వద్ద ఇప్పుడు ఉన్న భూమి మరియు భవనం మరియు భవిష్యత్‌లో దానిపై నిర్మించబోయే నిర్మాణాల ఆస్తి యావత్తు. విస్తీర్ణం ఎ.1.05 సెంట్లు గల భూమి. **సరిహద్దులు:** తూర్పు: సిరిపురంకు వెళ్లే రోడ్. దక్షిణం: కొత్త వెంకటరామయ్య భూమి వగైరా, పశ్చిమం: పి.డబ్ల్యూ.డి. కెనాల్, ఉత్తరం: డి.నం.75/2సి కలిగిన భూమి.

రిజర్వు ధర: రూ 8,00,00,000/-
(రూపాయలు ఎనిమిది కోట్లు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
29-12-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - పట్నంబజారు శాఖ, డి.నం. 23-6-122, రామ ఎన్‌క్లేవ్, పట్నం బజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003, టెలిఫోన్ నం. 08632-222005, సెల్ నం.లు:9390735612 / 8925876329

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు-పట్నంబజారు శాఖ, డి.నం. 23-6-122, రామ ఎన్‌క్లేవ్, పట్నం బజార్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం. 08632-222005, సెల్ నం.లు:9390735612 / 8925876329లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరిచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికేట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 05.12.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287 టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

హజ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందని తూర్పు ఎమ్మె ల్యే నసీర్ అన్నారు. అంజుమన్ షాదీఖానాలో హజ్ సొసైటీ ఆధ్వర్యంలో యాత్రికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది హజ్ యాత్రికుల కోసం విజయవాడలో ప్రత్యేక భవనం సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రతి హాజీకి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు అందించనుందని తెలిపారు. హజ్ యాత్రికులకు ఎటువంటి సదుపాయాలు కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముస్లిం మైనారిటీలకు సంక్షేమ పథకాలు, విరివిగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఉపాధి రంగాల్లోనూ శిక్షణ అందించి ఆర్థికాభి వృద్ధికి చేయూతగా నిలుస్తున్నామన్నారు. హజ్ కమిటీ చైర్మన్ హుస్సేన్ బాషా, సొసైటీ సభ్యులు ముఫ్తి కబీర్, సయ్యద్ అలీం, రఫీ, షేక్ మున్నాన్, ఎండీ షౌకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యసాధనలో భాగంగా కూటమి నాయకులు ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌లో భాగస్వాములు కావడం అభినందనీయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బాలాజీ నగర్‌లో టీడీపీ నేత ఐలా శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జేవీఎం ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రం లో కూటమి ఆధ్వర్యంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తూర్పు నియో జకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటి వరకు రూ.7 కోట్లు అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

ఆయుర్వేద చికిత్సలతో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

గుంటూరు మెడికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారతీయ వైద్య విధాన మైన ఆయుర్వేదంతో పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం లభిస్తుందని భాష్యం స్కూల్ డీన్ హరిబాబు తెలిపారు. ఆదివారం మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్‌లో గల ఎన్ఏబీహెచ్ గుర్తింపు కలిగిన అతి పెద్ద ఆయుర్వేదిక్ వైద్యశాల.. శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆసుపత్రి అధినేత, కేరళ పంచ కర్మ వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో కలసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు ఆయుర్వేద వైద్యనిపుణుల బృందం రోగులకు నాడీ పరీక్షలు, బీపీ, పరీక్షలు నిర్వహించింది. శిబిరంలో సుమారు 100 మంది రోగులు పాల్గొనగా, వీరికి రూ.90 వేలు విలువైన ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మోనిక, భవానీ, లోకేష్, మేనేజర్ మల్లీశ్వరి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే హిందూ సమాజ పరిరక్షణ

● స్వామీజీ మేళ్ల చెరువు సుబ్రహ్మణ్య శర్మ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా ఐక్యంగా ఉండి తమ ధర్మం, హక్కుల కోసం పోరాడినప్పుడే హిందూ పరిరక్షణ సాధ్యమవుతుందని శ్రీలలితాదేవి ఆశ్రమ నిర్వాహకులు స్వామీజీ మేళ్ల చెరువు సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. స్థానిక ఎన్జీవో కాలనీ, మెట్టు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ముఖ్య వక్తగా స్వామీజీ హాజరై ప్రసంగించారు. కులాలు, ప్రాంతాలు, వృత్తులు వేరైన మనమంతా హిందువులం అనే భావన కలిగి ఉండాలన్నారు. కలిసి జీవించినప్పుడే మన దేశాన్ని, ధర్మాన్ని, ఆలయాలను, ఆడబిడ్డలను రక్షించుకోగలుగుతామన్నారు. మరో వక్త బీజేపీ రాష్ట్ర నాయకురాలు యామిని శర్మ మాట్లాడుతూ సమాజంలో వివక్షలను తొలగించి సమానత, సమరసతతో జీవించాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ మీడియా విభాగ ఇన్‌చార్జి అవ్వారు శ్రీనివాసు మాట్లాడుతూ కులవృత్తుల్లోకి ప్రవేశిస్తున్న బయటివారి కారణంగా హిందూ జీవన విధానం పై వస్తున్న ప్రభావాలను వివరించారు. విభాగ్ బౌద్ధిక ప్రముఖ్ కలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందు శాఖలు బలంగా ఉన్నచోట హిందువులు రక్షితంగా ఉన్నారని, శాఖలు లేని ప్రాంతాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. విజేత స్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి, ఆడకా శ్రీను, మహేశ్వరా నంద, బాలస్వామి, శైల జమ్మ, చావల కోటేశ్వరరావు, అడప శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.



సమ్మేళనంలో పాల్గొన్న మేళ్ల చెరువు సుబ్రహ్మణ్యశర్మ, కలగా శ్రీనివాసరావు, యామిని శర్మ తదితరులు

బ్యూటిపార్లర్, టైలరింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతులకు బ్యూటీ పార్లర్ మేనేజమెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 22 నుంచి టైలరింగ్ కోర్సులో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 10వ తరగతి మార్కుల జాబితాతో కొత్తపేటలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, డోర్‌నంబరు 14-1-14, ఓల్డ్‌బ్యాంకు స్ట్రీట్, గుంటూరు(0863-2336912, 9700687696) అనే చిరునామాలో సంప్రదించాలని సూచించారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(గుంటూరు)లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్నకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ జువాలజీ, ఎంఏ ఎకనామిక్స్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 8వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ వివరాల కోసం డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి(9985904415)ని సంప్రదించాలని సూచించారు.

వైభవంగా గౌరి విశ్వేశ్వర స్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీగౌరీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కు మార్ శర్మ, మల్లికార్జున శర్మ, చక్రపాణి, వాసు, కల్యాణ్‌లు పర్యవేక్షించారు.

ఏటీ అగ్రహారం సెంట్రల్ డివైడర్‌లో నాసిరకం మట్టి

● ఆ మట్టితో మొక్కలు నాటితే బతుకుతాయా?

● తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



సెంట్రల్ డివైడర్‌లో నాసిరకం మట్టిని నింపుతున్న కాంట్రాక్టర్

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డులో నిర్మించిన సెంట్రల్ డివైడర్‌లో నింపుతోన్న మట్టి అత్యంత నాసిరకంగా ఉన్నది. సాధారణంగా డివైడర్లలో నింపే మట్టి అందులో నాటే మొక్కలకు జీవం పోసేదిలా ఉండాలి. అయితే ఎక్కడి నుంచి తీసుకొచ్చారో ప్రస్తుతం నింపిన మట్టి చిన్నచిన్న రాళ్లతో నిండి ఉన్నది. ఈ మట్టిలో మొక్కలు నాటితే ఎట్టి పరిస్థితుల్లో అవి చిగురించవు కదా కొద్ది రోజుల్లోనే ఎండిపోయే ప్రమాదం ఉన్నది. ఈ రోడ్డులోనే నగరపాలకసంస్థ సచివాలయం, వాటర్‌వర్క్సు ఉన్నాయి. వాటి వద్దకు నిత్యం ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల సిబ్బంది వస్తుంటారు. అయినప్పటికీ పని చేస్తున్న కాంట్రాక్టర్‌ని నిలువరించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోన్నది. అధికారులకు తెలిసే డివైడర్‌లో నాసిరకం మట్టిని నింపుతున్నారా అని స్థానికులు సందేహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు సెంట్రల్ డివైడర్లలో ఏ మట్టి పడితే అది వినియోగించరాదు. ప్రధానంగా లేటరైట్, మూరమ్, ఇసుక మిశ్రమం అయి ఉన్న మట్టిని వినియోగిస్తారు. లోమి రకం మట్టి మొక్కలు నాటేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. ఇది మొక్క పెరగడానికి దోహదపడటమే కాకుండా మంచి డ్రైనేజీని కూడా కలిగి ఉంటుంది. ఇందుకు కారణంగా ఈ రకం మట్టి తేమ శాతాన్ని ఎక్కువ సమయం ఉండేలా చూస్తుంది. లేటరైట్ మట్టి అయితే పటిష్టంగా ఉంటుంది. మూరమ్ మట్టి ఎరుపు/గోధుమరంగులో ఉండి మొక్కలు పెరగడానికి దోహదపడుతుంది. ఇసుక, వండ్రు, మట్టి కలిపి ఉండే అల్యూవియల్ రకం కూడా మొక్కలకు ఎక్కువగా వినియోగిస్తారు. ఇలా శాస్త్రీయమైన పద్ధతులు పాటించకుండా గ్రావెల్ క్వారీల నుంచి తీసుకొచ్చి శుద్ధ మట్టిని నింపుతున్నారు. వీటిల్లో లవణ శాతం ఎక్కువగా ఉండటం వలన మొక్కలు నాటినా చిగురించవు.



పురస్కార గ్రహీతలతో సాహితీవేత్తలు, నిర్వాహకులు

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజిక, కళా రంగాల్లో చేస్తున్న బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు కవులు, సాహితీవేత్తలు కొనియాడారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఫౌండేషన్ వార్షికోత్సవం, పురస్కారాల ప్రదానం కార్యక్రమం జరిగింది. సభకు ప్రముఖ కవి పుప్పాల శ్రీరామ్ అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బండికల్లు జమదగ్ని, ప్రముఖ రచయిత తాపీ ధర్మారావునాయుడు పేరిట ఏర్పాటు చేసిన స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు అందజేశారు. తాపీ ధర్మారావు సాహిత్య ప్రతిభను గంటేడ గౌరునాయుడు సాహిత్య ప్రస్థానాన్ని సాహితీవేత్తలు భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ఎం సుభానీలు వివరించారు. అనంతరం కథల పోటీ విజేతలు నందిరాజు పద్మలతా జయరాం, వాడపల్లి పూర్ణ కామేశ్వరి, కైకాల సుమలతలను నగదు పురస్కారాలతో సత్కరించారు. అనంతరం యర్రంశెట్టి శ్రావణ సంధ్య వందన సమర్పణ చేశారు.

హైకోర్టు బస్ సమయాలు మార్పులు

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) గుంటూరు-1 డిపో నుంచి హైకోర్టుకు తుళ్లూరు మీదగా నడిచే బస్ సర్వీసు సమయాన్ని కొంత సవరించినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉదయం 8.00 గంటలకు గుంటూరు బస్టాండ్ నుంచి బయలుదేరుతున్న ఈ జనరల్ బస్ టైమింగ్‌ను 7.45 నిమిషాలకు మార్చామన్నారు. సోమవారం నుంచి మార్చిన సమయపట్టిక అమలులోకి వస్తుందన్నారు. పాత సమయం కంటే 15 నిమిషాలు ముందుగా బయలుదేరుతుందన్నారు. మిగతా బస్సు సర్వీసులు యథాతథంగా ప్రయాణిస్తాయన్నారు.



నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ విస్తృత స్థాయి, కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు నాగసాయి అధ్యక్షత వహించారు. నూతన జిల్లా అధ్యక్షుడుగా టీవీ రామిరెడ్డి, కార్యదర్శిగా వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వి.పెద్ద రత్తయ్య, గుంటూరు నగర శాఖ అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా షాఖాదరి, కార్యదర్శిగా బి.కోటేశ్వర రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడతామని అన్నారు. తొలుత ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష పదవికి సయ్యద్ చాంద్ బాషా రాజీనామాను ఆమోదించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీరామ కోటి మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్ శ్రీరామ నామక్షేత్రంలో 99వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅ తిథిగా రామకృష్ణ మిషన్, సీతానగరం కార్యదర్శి స్వామి వినిశ్చలానంద విచ్చేసి శ్రీరామ పతాకావిష్కరణ చేసి అనుగ్రహ భాషణం చేశారు. అనం తరం శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణమా చార్యులు వారి బృందం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంకురా రోపణ, అగ్నిస్థాపనం, అఖండ జ్యోతి స్థాపన చేశారు. కార్యక్రమాన్ని రామనామ క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మానస సరోవరం సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ ఎస్ నిర్మాణ పనుల కారణంగా నందివెలుగురోడ్డులోని పలు కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీరు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివెలుగురోడ్డు, జామియానగర్, జియావుద్దీన్ నగర్, రాహుల్ గాంధీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అవసరం : అంబటి

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అత్యంత అవసరమని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం పాత గుంటూరు యాదవ హైస్కూల్లో ఏలికా సీతా రామమ్మ సంక్షేమ సేవా సంస్థ ఆధ్వర్యంలో, అమృత హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను అంబటి రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ నగర అధ్య క్షురాలు షేక్ నూరి ఫాతిమా, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జమ్ముల దుర్గాప్రసాద్, సోమవరపు మిధున గణేష్, మొగిలి ప్రసాద్, భూపతి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ నాయకుడికి సత్కారం

గుంటూరు (విద్య) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన తాడిబోయిన చిరంజీవిని లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాష్, లయన్స్ జిల్లా నాయకులు సుబ్బయ్య, కొంజేటి వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన ప్రతీక.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం రచించడమే గాక దేశం లోని సమస్త జీవన రంగాల్లో అభివృద్ధి నిలిపిన గొప్పవ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కొనియాడారు. స్థానిక బ్రాడీపేట, యూటీఎఫ్ హాల్లో అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ జరిగింది. సభకు అధ్యక్షత కేఎస్ లక్ష్మణరావు వహించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ విద్యారంగంలో అరుదైన గుర్తింపు అంబేడ్కర్ సొంతం చేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కైలా జయసుధ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పక్కన సీఐ, ఎస్ఐలు

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధజ్యోతి): గంజాయి విక్రయిస్తు న్న ఆరుగురుని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. సంపత్ నగర్‌కు చెందిన గొర్ల కోటేష్ అలియాస్ ఈశ్వర్, వసంతరాయ పురంనకు చెందిన కాకర్ల శ్రీకాంత్, నల్లచెరువుకు చెందిన బిశెట్టి కిరణ్ అలియాస్ సాయి, పాత గుంటూరు వినోబానగర్‌కు చెం దిన షేక్ నాగుల్ షరీఫ్ అలియాస్ షరీఫ్, ఏటీ అగ్రహారంనకు చెందిన అర్దల అశోక్, నల్లచెరువుకు చెందిన షేక్ అబ్దుల్ ఖయ్యూంలను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి డీఎస్పీ అరవింద్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 6న రాత్రి సుమారు పది గంట ల సమయంలో నగరంపాలెం సీఐ సత్యనారాయణకు వీఐపీ రోడ్డులోని లాలుపురం వెళ్లే డొంక సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యే శ్వర స్వామి గుడి పక్కన ఖాళీ స్థలంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. ఎస్ఐ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుళ్ళు ప్రసాద్‌బాబు, దాసు, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, ఉదయ్, నాగేశ్వరరావు తదితరులు ఆ ప్రాంతంపై దాడి చేసి అక్కడ గంజాయి విక్రయిస్తున్న ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకడైన కాకర్ల శ్రీకాంత్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పటికీ గంజాయికి బానిసగా మారాడు అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలో తమ విద్యా ర్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎస్పీ చెప్పారు. కాగా ఈ కేసులో మరికొందరు నిందితుల ఉన్నారని త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

రౌడీషీటర్లు బాధ్యతాయుత జీవనం సాగించాలి

● రోడ్డు మార్చ్ నిర్వహించిన ఈస్ట్ డీఎస్పీ అజీజ్

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం వలన చట్టపరమైన శిక్షలు, వ్యక్తిగత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈస్ట్ డివిజన్ పరిధిలోని లాలాపేట, పాతగుంటూరు, కొత్తపేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న సుమారు 150 మంది రౌడీషీటర్లకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం, వారిలో చట్టబద్ధ జీవన విధానాన్ని అలవర్చేందుకు అవగాహన కల్పించేందుకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, జిల్లా పోలీస్ కార్యాలయం, ఎస్‌బిఐ సెంటర్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ మార్గంలో ప్రత్యేక మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రౌడీషీటర్లు జీవితాల్లో మార్పుకు అవకాశాన్ని ఉపయోగించుకుని, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. లాలాపేట సీఐ ఏవి శివప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో గౌరవం పొందాలంటే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పాతగుంటూరు సీఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ... రౌడీ షీటర్లపై నిత్య పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. పాత గుంటూరు ఎస్సై రెహమాన్ కౌన్సెలింగ్‌కి హాజరైన రౌడీషీటర్లతో నేర ప్రవర్తనకు దూరంగా ఉండటం, సత్ప్రవర్తన పాటించడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎస్సైలు రమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్స్‌తో కలసి రోడ్ మార్చ్‌లో పాల్గొన్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలాపేట సీఐ శివప్రసాద్

తిరుపతి వ్యక్తి అనుమానాస్పద మృతి



నరసింహస్వామి మృతదేహం

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీపార్క్ వద్ద తిరుపతి ప్రాంతానికి చెందిన వ్యక్తి (49) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తపేట ఎస్సై రెహమాన్ చుట్టుపక్కల విచారించగా మృతుడు పేరు ఏలూరి నరసింహ స్వామి, తండ్రి పేరు సత్యనారాయణ, ఎంఆర్ పల్లి వెస్ట్ చర్చి, తిరుపతి అర్బన్, చిత్తూరు జిల్లా అని మృతుని ఆధార్ కార్డు ప్రకారం తెలిసింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసిందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్ స్టేషన్ 9493924373 నెంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.



కరాటే పోటీల నిర్వాహకులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ, ఆత్మరక్షణ

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ విద్యలైన మార్షల్ ఆర్ట్స్ సాధనతో ఆత్మరక్షణ, క్రమశిక్షణ వస్తుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 'నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్- 2025' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మ రక్షణ ఎంతో అవసరమని అన్నారు. 25 సంవత్సరాలుగా పిల్లలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించి నేషనల్ స్థాయికి తీసుకెళ్తున్నందుకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ సురేష్‌ను, నిర్వాహక బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా గుంటూరు పిల్లలు దేశవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకునే అవకాశాలు లభిస్తున్నాయ ని, కార్యక్రమంలో చింతకాయల శివ, బైరీ కల్యాణ్, లలిత శాస్త్రి, బాలబాలికలు, ట్రెయిన ర్లు, నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రగిరి బాబు తండ్రి మరణంపై ఎమ్మెల్యే సంతాపం

టీడీపీ బీసీ సెల్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రగిరి బాబు తండ్రి గోవిందు అకాల మరణంపై ఎమ్మెల్యే మాధవి సంతాపం ప్రకటించారు. ఆదివారం ఏటు కూరులోని వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

104 ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అరబిందో సంస్థ నుంచి 104 సిబ్బందికి రావాల్సిన బకాయిలు, గ్రాట్యుటీ, ఎర్న్ లీవ్‌లు తక్షణమే చెల్లించాలని 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంజీవనిగా పేరు తెచుకున్న 104సిబ్బంది మాత్రం సమస్యలు వలలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత భవ్య యాజమాన్యం కూడా ఇప్పటివరకు నియామక పత్రాలు, పే స్లిప్స్ ఉద్యోగులకు అందజేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై చర్చలు జరపాలని కోరారు. 104 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల రాంబాబుకు ఇచ్చిన షోకాజ్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీహర్ష, ఐ నాగులు, సత్యరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

● శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు మంగాదేవి

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, క్రీడల్లో విజయం ఓటమి రెండు గురువులేనని శ్రీవెంకటేశ్వర బాల కుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి అన్నారు. చౌడవరంలోని పాఠశాల లో ఆదివారం మెగా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మా ట్లాడారు. క్రీడల్లో రాణిస్తేనే విద్యార్థులు చదువులో మెరుగ్గా ఉంటారని అన్నారు. సంస్థ సీఈవో దుర్గా రఘురామ్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మనోబలాన్ని పెంచుతాయని చెప్పారు. చేతన కార్యనిర్వాహకులు మరుద్వతి మాట్లాడుతూ శారీరక వికాసానికి క్రీడలు ఎంతో దూరం చేస్తాయన్నారు. పోటీల్లో బ్రాడీపేట, శ్యామలనగర్, బ్రాంచీలోని విద్యార్థు లు, చేతన ఉషోదయ నందన పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థు లకు త్రోబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, కోకో తదితర పోటీలు నిర్వహించారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

పికిల్ బాల్‌కు పెరుగుతున్న ఆదరణ

గుంటూరు (తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశంలో పికిల్‌బాల్ క్రీడకు ఆదరణ పెరిగిందని, దీనిని సద్వినియోగించుకోవాలని ఆర్థోపెడిక్ సర్జన్, జిల్లా పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు ఎం శివకుమార్ అన్నారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్ హబ్‌లో రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ ఆధ్వర్యంలో గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యా యి. తొలుత ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆదర్శ్ అధ్యక్షురాలు ఎం అనురాధ అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ పోటీలు అండర్ 14, 16 బాల, బాలిక లు సీనియర్ మహిళలు, పురుషులు విభాగాల్లో మిక్స్‌డ్, సింగిల్, డబుల్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గౌరవఅతిథిగా డాక్టర్ సుజాత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పికిల్ బాల్ సంఘం చైర్మన్ టి.అరుణ్‌కుమార్, వాణికుమారి, జయశ్రీ అశోకా, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, జీవీఎస్ ప్రసాద్ కార్యదర్శి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జానపదం.. ఝల్లుమంది...



జానపద, కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు, కళాకారులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా నాట్య గురు ఎస్కే ఖలీల్ ఆధ్వర్యంలో జరిగిన నాట్య నెలవంక సంబరంలో భాగంగా రెండోరోజు న ప్రదర్శించిన జానపద, కూచిపూడి ప్రదర్శనలు ఆలరించాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు, కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. పోటీల నిర్వాహకులు గురు ఎస్కే ఖలీల్ మాట్లాడుతూ ఆదివారం సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ సోలో విభాగాల్లో బృంద, జంట, కుచిపూడి, జానపద నృత్య పోటీలు నిర్వహించామని చెప్పారు. అనంతరం హిందు కళా శాల విశ్రాంత అధ్యాపకుడు కేవీఎస్ దుర్గాప్రసాదుకు సేవారత్నం పురస్కారాన్ని అందజేశారు.

సాహిత్య సరస్వతి.. కోగంటి సీతారామాచార్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉభయ వేదాంత ప్రవక్తకుడిగా, ప్రాకృతిక సాహిత్యాన్ని అవపోసన పట్టిన సాహిత్య సరస్వతి కోగంటి సీతారామాచార్యు లని త్రిదండి రామచంద్ర జీయర్ స్వామీజీ అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై కోగంటి సీతారామాచార్యుల వారి శత జయంతి వారోత్సవాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి సహాయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామానుజ జీయర్ స్వామీజీ, గుది మెళ్ళ కూర్మనాథ స్వామి, తిరుప్పావై కోగంటి వెంకట శ్రీరంగనాయకిలతో కలిసి 'పాంచ రాత్ర పారమ్యం' గ్రంథావిష్కరణ గావించారు.

పారా మిలటరీ పిలుస్తోంది



ఎస్ఎస్‌సీ భారీ నోటిఫికేషన్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) - పారా మిలటరీలో 25,487 ఉద్యోగాలతో భారీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టుల వివరాలు: కానిస్టేబుల్(జీడీ), రైఫిల్‌మన్(జీడీ), సెక్రటేరియట్

ఖాళీల వివరాలు: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) - 616, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) - 14,595, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్): 5,490, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) - 1,764. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) - 1,293, అస్సాం రైఫిల్స్(ఏఆర్) - 1,706, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్) - 23

అర్హత: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి వయస్సు 18-23 సంవత్సరాల మధ్య ఉండాలి(2003 జనవరి 2కి ముందు 2008 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు). రిజర్వుడు వర్గాలకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్ట్, వైద్య పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఉంటుంది.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష: జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మేథమెటిక్స్, ఇంగ్లీష్/ హిందీ నుంచి మల్టిపుల్ ఛాయిస్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో టాపిక్ నుంచి 20 చొప్పున మొత్తం 80 ప్రశ్నలు అడుగుతారు. కరెక్ట్‌గా గుర్తించిన ప్రతి సమాధానానికి రెండు మార్కులు కేటాయిస్తారు. తప్పుగా గుర్తిస్తే ఒక్కోదానికి పావు శాతం అంటే అర మార్కు కట్ చేస్తారు. తెలుగు సహా పలు ప్రాంతీయ భాషల్లో కూడా ఈ ప్రశ్నపత్రం ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 31

వెబ్‌సైట్: https://ssc.gov.in

దిక్సూచి

కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్స్

భారత ప్రభుత్వానికి చెందిన 250 గ్రూప్-బి(నాన్ గెజిటెడ్) డెప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్) పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2003/2004/2005లో సాధించిన గేట్ స్కోర్ ఆధారంగా ఈ భర్తీ జరుగనుంది.

పోస్టులు: 250(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-124, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-10, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్-95, సివిల్ ఇంజనీరింగ్-2, మెకానికల్ ఇంజనీరింగ్-2, ఫిజిక్స్-6, కెమిస్ట్రీ-4, మేథ్స్-2, స్టాటిస్టిక్స్-2, జియాలజీ-3)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ/ సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గేట్ స్కోర్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 14(పోస్టులో)

చిరునామా: పోస్ట్ బ్యాగ్ నెం.001, లోధీ రోడ్ హెడ్ పోస్టాఫీస్, న్యూఢిల్లీ - 110 003.

ఓరియెంటల్ ఇన్సూరెన్స్‌లో ఏఓ

ద ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: జనరలిస్ట్ ఆఫీసర్ 285. హిందీ ఆఫీసర్(రాజభాష) 15


అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణత

వయస్సు: ఈ ఏడాది నవంబర్ 30 నాటికి 30 సంవత్సరాలకు మించకూడదు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 15

వెబ్‌సైట్: orientalinsurance.org.in

జాబ్ కార్నర్



ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) - 996 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టులు: వీపీ వెల్త్ - 506, ఏవీపీ వెల్త్ - 206, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ 284

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి

వయస్సు: ఈ ఏడాది మే 1 నాటికి 20-42 మధ్య వయస్సులై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 23.

వెబ్‌సైట్: https://sbi.bank.in/

హెచ్‌సీఎల్‌లో 64 జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ - టెక్నికల్ నుంచి అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్, లా వరకు వివిధ విభాగాల్లో ఉన్న 64 జూనియర్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంబీఏ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్షకు తోడు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ అధారంగా. హైదరాబాద్ సహా దేశంలోని వివిధ నగరాల్లో రాత పరీక్ష జరుగుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ కూడా ఉంటుంది.

ఆఖరు తేదీ: డిసెంబర్ 17

వెబ్‌సైట్: www.hindustancopper.com

రైట్స్‌లో 400 అసిస్టెంట్ మేనేజర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)కు చెందిన నాలుగు జోన్లలో 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీకి తోడు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా(రాత పరీక్ష వచ్చే ఏడాది జనవరి 11న జరుగుతుంది.)

పరీక్ష కేంద్రం: హైదరాబాద్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 25

వెబ్‌సైట్: www.rites.com

ప్రామాణిక మెటీరియల్‌తో ప్రాక్టీస్ ప్రధానం

జేఈఈ మెయిన్ గణితం



జేఈఈ మెయిన్‌లో ఉండే మూడు సబ్జెక్టుల్లో గణితానికి సమ ప్రాధాన్యం ఉన్నప్పటికీ 2022 నుంచి ఈ సబ్జెక్టు అంటే విద్యార్థులకు వెన్నులో నుంచి చలి పుడుతోంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 23 వరకు ప్రశ్నలు సాల్వ్ చేయగలిగిన విద్యార్థులకు గణితంలో నాలుగైదు చేయడం గగనమవుతోంది. ఈ నేపథ్యంలో అలాంటి విద్యార్థులకు కొన్ని సూచనలు.

- ముందుగా ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తి చేయండి
- మెయిన్, అడ్వాన్స్‌డ్ కోసం మంచి మెటీరియల్‌ను ఉపయోగించడం చాలా అవసరం. సమీర్ బన్సల్ కాలక్యులస్, వికాస్ గుప్తా కోఆర్డినేట్ జామెట్రీ, ఎ.దాస్ గుప్తా - ప్రాబ్లమ్ ప్లస్, ఐఐటీ మ్యాథ్స్.... ఇవి కాకుండా మీ టీచర్ క్లాస్ నోట్స్‌ను కచ్చితంగా ఫాలో అవ్వాలి.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ కోసం చాట్‌జీపీటీ, ఇతర ఏఐ టూల్స్‌ను ఉపయోగించవద్దు.
- ప్రతి రోజూ కనీసం 20 నుంచి 30 లెక్కలు సాల్వ్ చేయాలి.
- చివరి నిమిషంలో ఆన్‌లైన్ క్లాసులకు హాజరుకావద్దు.
- గడచిన సంవత్సరాల్లో ఇచ్చిన ప్రశ్నలను సాల్వ్ చేసే క్రమంలో, ముందుగా మీరు పూర్తి చేసిన చాప్టర్స్‌లోని ప్రశ్నలు అటెంప్ట్ చేయాలి.
- 2022 నుంచి పేపర్స్ చేస్తే సరిపోతుంది.
- సిలబస్‌లోని ప్రతి చాప్టర్‌ను చేయడం మంచిది.
- స్టాటిస్టిక్స్, సెట్స్ అండ్ రిలేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీ, కాంప్లెక్స్ నంబర్స్, వెక్టర్ 3డి, మెట్రిసిస్ అండ్ డిటర్మినెంట్స్ చాప్టర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

పేపర్ అటెంప్ట్ వ్యూహం

- పరీక్షను లెక్కలతో మొదలుపెట్టకండి. పేపర్‌పై కొంత సమయం కేటాయించి, ఆన్సర్ చేయదగ్గ ప్రశ్నలను గుర్తించండి.
- గతంలో మాదిరిగా గణితంలో అడిగిన ప్రశ్నలు కఠినంగా ఉంటే 12 నుంచి 15 సులువుగా అనిపించినవి మాత్రమే ఆన్సర్ చేయండి
- నిడివి ఎక్కువ(లెంగ్తీ) ఉన్న ప్రశ్నలను చేయకపోవడమే మంచిది. కోర్ కాన్సెప్ట్ ప్రశ్నలు చేయగలిగితే, సమయం ఆదా అవుతుంది.
- ప్రశ్నపత్రంలో లెక్కలు కఠినంగా ఉన్నప్పటికీ ఆందోళన చెందవద్దు.
- చివరిగా, ప్రతిసారిలా కాకుండా ఈ సారి ఫిజిక్స్, కెమిస్ట్రీ కఠినంగా వచ్చినప్పటికీ అందుకు కూడా సన్నద్ధంగా ఉండండి.

- చంద్రశేఖర్ జోస్యుల
సీనియర్ ఐఐటీ మ్యాథ్స్ ఫ్యాకల్టీ

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) రిఫైనరీల్లో 2757 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. గువాహటి, బరౌనీ, గుజరాత్, హల్దియా, మధుర, పానిపట్, దిగ్బోయ్, బంగాయిగావ్, పారదీప్ రిఫైనరీల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

అర్హత: పదోతరగతికి తోడు సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ డిగ్రీ ఉత్తీర్ణత

వయస్సు: 18-24 సంవత్సరాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 18

వెబ్‌సైట్: http://iocl.com/apprenticeships

పాటియాల లోకోమోటివ్ వర్క్స్



ఇండియన్ రైల్వేస్ - పంజాబ్‌లోని పాటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో 225 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: ఎలక్ట్రీషియన్ 120, మెకానికల్(డీజిల్) 25, మెషినిస్ట్ 12, ఫిట్టర్ 50, వెల్డర్(జీ అండ్ ఈ) 18

అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతకుతోడు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 22

వెబ్‌సైట్: www.plw.indianrailways.gov.in

డీఆర్‌డీఓ

డీఆర్‌డీఓ(చండీగఢ్) - ఇంజనీరింగ్/సైన్స్ - యూజీ, పీజీ విద్యార్థులకు పెయిడ్ ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 2, సివిల్ ఇంజనీరింగ్‌లో 1, రిమోట్ సెన్సింగ్/ జియోఇన్ఫర్మాటిక్స్‌లో 2 ఉన్నాయి. ఆరు నెలల గడువు కాగా నెలకు రూ.5000 చెల్లిస్తారు. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదంటే సైన్స్‌లో యూజీ/పీజీ ఫుల్‌టైమ్ కోర్సును యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌లో చేస్తున్న విద్యార్థులు డిసెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: director.dgree@gov.in,https://www.drdo.gov.in/drdo/sites/default/files/vacancy/advtDGRE25112025.pdf

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



డ్రాగన్ దిగుతున్నాడు

ఎన్టీఆర్ సరికొత్త లుక్‌లోకి మారారు. ఆయన ఒక సోఫాలో స్టైలిష్‌గా కూర్చొని, దట్టమైన గడ్డంతో, నల్లకళ్లద్దాలు పెట్టుకొని కనిపిస్తున్న ఫొటో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎన్టీఆర్ సన్నబడి ఫిట్‌గా కనిపించడంతో ఆయన కొత్త లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న సినిమా కోసమే ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపించారని తెలుస్తోంది. ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలవనున్న కొత్త షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు.



శశిరేఖ వచ్చేసింది

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. షైన్ స్ర్కీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'మీసాల పిల్ల' సూపర్ హిట్ అయి సినిమాపై అంచనాలను పెంచింది. తాజాగా 'శశిరేఖా...ఓ మాటే చెప్పాలి..' అంటూ సాగే మరో ప్రేమ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను స్వీయ సంగీత దర్శకత్వంలో భీమ్స్ మధు ప్రియతో కలసి ఆలపించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అదిరిపోయింది. చిరంజీవి, నయనతార ఇద్దరూ తమ అభినయంతో స్ర్కీన్‌ని షేమరపించారు.



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం నుంచి ఆదివారం క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మంగళవారం ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్‌లో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు.



రొమాంటిక్ డ్రామా

మాథ్యో అరుళనందు ఆధ్వర్యంలో విజన్ సినిమా హౌస్ సంస్థ నిర్మిస్తున్న రొమాంటిక్ డ్రామా 'హైకు'. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ఏగన్ హీరోగా నటిస్తున్నారు. శ్రీదేవి అపల్ల, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'యువతీయువకుల్లోని అమాయకత్వంతో కూడిన ప్రేమ, విద్యార్థి జీవితంలో ఆశలు, వారు కనే కలల నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ స్టోరీ ఇది. ప్రేమలోని పవిత్రత, అందమైన స్నేహం గురించి చెబుతూ హృదయానికి హత్తుకొనే సన్నివేశాలతో సినిమా ఉంటుంది' అని దర్శకుడు యువరాజ్ చిన్నసామి చెప్పారు. 'బేబి', 'కోర్టు' చిత్రాలకు సంగీతాన్ని అందించిన విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు.

మలయాళ దర్శకుడితో



తమిళ హీరో సూర్య కథానాయకుడిగా నటిస్తున్న 47వ చిత్రం (సూర్య 47-వర్కింగ్ టైటిల్) ఆదివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సూర్య, జ్యోతిక, కార్తీ, శివకుమార్ హాజరయ్యారు. 'రోమాంచమ్', ఆవేశం' లాంటి సూపర్‌హిట్స్ అందించిన మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. నజ్రీయా నజీమ్ సూర్యకుజోడీగా నటిస్తున్నారు. జఘరమ్ స్టూడియోస్‌తో కలసి జ్యోతిక నిర్మిస్తున్నారు.

సందేశంతో అలరించే చిత్రం



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్య ఇతివృత్తంగా తెరకెక్కిన చిత్రం 'కామ అండ్ ది డిజిటల్ సూత్రాస్'. ఎన్‌హెచ్ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. వినయ్ వర్మ, చంద్రకళ జంటగా నటించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్‌హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ 'టైటిల్ బోల్డ్‌గా ఉన్నా సినిమాలో అసభ్యత ఉండదు. సున్నితమైన విషయాన్ని చర్చిస్తూ, కుటుంబంతో కలసి చూసేలా మా సినిమాను తెరకెక్కించాం. సందేశంతో పాటు వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

గురువా నా మాటే వినరా..



కార్తి, కృతి శెట్టి జంటగా నలన్ కుమార స్వామి తెరకెక్కించిన చిత్రం 'అన్నగారు వస్తారు'. స్టూడియో గ్రీన్ బేనర్‌పై కె.ఇ.జ్ఞాన్‌వేల్ రాజా నిర్మించారు. సినిమా ఈనెల 12న విడుదలవుతోంది. తాజాగా 'అలాపిక్కే ఉమ్మక్' అనే పాటను చిత్రబృందం విడుదల చేసింది. సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు. రాకేందు మౌళి పాటను రాసి ఆలపించారు. 'వలయ అహ్ కలయ, గోలయ్య, జై బాలయ్య, కలలే వలరా, గురువా నా మాటే వినరా..' అంటూ సాగే పాటకు కార్తి అదిరిపోయే స్టెప్‌లు వేశారు.

కొత్త కోణంలో కర్మ సిద్ధాంతం



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ మేగోటి రూపొందిస్తోన్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిల్మ్స్ బేనర్‌పై బాలకృష్ణ మహరాణా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరలక్ష్మి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. 'సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా సాగుతున్నాయి' అని నిర్మాతలు తెలిపారు. చిత్ర దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకు ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించబోతున్నాం' అని తెలిపారు.

పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో



'నాకు ఇప్పుడు 60 ఏళ్లు. రెండు పెళ్లిళ్లు విఫలమయ్యాక, ఈ వయసులో నేను మళ్లీ ప్రేమలో పడతాననీ, నాకో తోడు దొరుకుతుందనీ నేను ఊహించలేదు. ఒంటరిగానే ఉండిపోతాననుకున్నాను. కానీ గౌరీ నా జీవితంలోకి వచ్చింది. ప్రస్తుతం మేమిద్దరం చాలా సంతోషంగా ఉన్నాం. ఆమె నాకు ఎంతో ప్రశాంతతను ఇస్తోంది' అని ఆమిర్‌ఖాన్ చెప్పారు. గౌరీ స్ప్రాట్‌తో తన ప్రేమాయణం గురించి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీరు మూడో పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడగ్గా, 'అధికారికంగా పెళ్లి చేసుకోవడం అనేది కేవలం ఒక తంతు మాత్రమే. మా మనసులో మేము ఎప్పుడో పెళ్లి చేసుకున్నాం. అయినా 60 ఏళ్ల వయసులో పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో' అని సరదాగా స్పందించారు. రీనా దత్తా, కిరణ్‌రావులతో విడిపోయిన తర్వాత ఆమిర్, గౌరీతో రిలేషన్‌లో ఉన్నారు.

'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే



సాయిచరణ్, ఉషశ్రీ జంటగా నటించిన చిత్రం 'ఇట్స్ ఓకే గురూ'. మణికంఠ దర్శకత్వంలో క్రాంతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'జీవితం బాగుండాలంటే 'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే. ఎన్ని సమస్యలు వచ్చినా 'ఇట్స్ ఒకే గురు' అనుకుంటూ ముందుకెళ్లిపోతే జీవితం చాలా బావుంటుంది అనే తాత్వికతతో ఈ చిత్రాన్ని రూపొందించాం' అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతికూల భావోద్వేగాలను ఎలా అధిగమించాలనేది ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. మా హీరో హీరోయిన్లు, దర్శకుడు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు.' అని తెలిపారు. మంచి ప్రేమకథతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న చిత్రమిదని సాయిచరణ్ తెలిపారు.

బిజినెస్

గుంటూరు ● సోమవారం 8 డిసెంబరు 2025

ఈ ఏడాది 14% రుణ వృద్ధి

రూ.25 లక్షల కోట్లకు పైగా ఆర్‌ఏఎం రుణాలు ● రూ.9 లక్షల కోట్లకు గృహ రుణాల పోర్ట్‌ఫోలియో



ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధి గాడిలో పడడంతో పరపతి వృద్ధి రేటూ ఊపందుకుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరాని(2025-26)కి తమ రుణాల వృద్ధి రేటు అంచనాను 12 శాతం నుంచి 14 శాతానికి పెంచినట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ(ఆర్‌ఏఎం) రుణాలు ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈల రుణ గిరాకీ 17 నుంచి 18 శాతం చొప్పున పెరుగుతుంటే, వ్యవసాయ, రిటైల్ రుణాల వృద్ధి రేటు 14 శాతం చొప్పున పెరుగుతున్నట్టు తెలిపారు. తమ మొత్తం రుణాల్లో 67 శాతం వాటా ఉన్న ఆర్‌ఏఎం రుణాలు ఈ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికే రూ.25 లక్షల కోట్లు మించి పోయినట్టు చెప్పారు. ఇందులో గృహ రుణాలే రూ.9 లక్షల కోట్ల వరకు ఉన్నట్టు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పసిడి రుణాలకూ గిరాకీ: ప్రస్తుతం పసిడి రుణాల వృద్ధి రేటు కూడా రెండు అంకెల్లో ఉందని ఎస్‌బీఐ చైర్మన్ వెల్లడించారు. ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికం వరకు అంతంత మాత్రంగానే ఉన్న ఎస్‌బీఐ కార్పొరేట్ రుణాల వృద్ధి రేటు కూడా సెప్టెంబరు త్రైమాసికంలో కొద్దిగా కోలుకుని 7.1 శాతానికి చేరింది. ఆర్‌బీఐ రెపో రేటును మరో పావు శాతం తగ్గించడంతో రుణాలకు గిరాకీ మరింత పెరగనుందని ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. దీని వల్ల ఈ ఆర్థిక సంవత్సరం మూడు శాతం నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) సాధించాలన్న తమ లక్ష్యానికీ ఎలాంటి ఇబ్బంది ఉండక పోవచ్చన్నారు. మరో ఐదారు సంవత్సరాల వరకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరించాల్సిన అవసరం ఎస్‌బీఐకి లేదని శెట్టి తెలిపారు.

ఈ వారం మరో 13 ఐపీఓలు

- ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఆఫరింగ్(ఐపీఓ)ల జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించిన నిధులు దాదాపు రూ.85,000 కోట్లకు చేరాయి. ఈ వారం మరో 13 కంపెనీలు (మెయిన్‌బోర్డ్, ఎస్ఎంఈ కలిపి) రూ.13,807 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ రూ.1,289 కోట్ల ఐపీఓ సోమవారం ప్రారంభమవుతోంది. ఇందుకోసం ఒక్కో షేరును రూ.185-195 ప్రైస్ బ్యాండ్‌లో జారీ చేస్తోంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సైతం ఈవారంలోనే ఆఫర్‌ను ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.10,603 కోట్లు సమీకరించనుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.2,061-2,165గా నిర్ణయించింది. ఈ ఐపీఓ 12న ప్రారంభమై16న ముగుస్తుంది.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	125
కర్నూలు	129	నెల్లూరు	130
విశాఖపట్నం	126	అనంతపురం	130
గోదావరి	130		

వడ్డీ రేట్లను తగ్గించిన పీఎన్‌బీ, బీఓఎమ్



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎమ్) కూడా తమ రుణరేట్లను పావు శాతం తగ్గించాయి. సవరించిన వడ్డీ రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని బ్యాంకులు వెల్లడించాయి. పీఎన్‌బీ రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 8.35 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎమ్‌సీఎల్ఆర్), బేస్ రేటులో మాత్రం ఎటువంటి మార్పు చేయలేదని పీఎన్‌బీ స్పష్టం చేసింది. తాజా సవరణతో తమ బ్యాంకులో గృహ రుణంపై వడ్డీ 7.10 శాతం, కార్ లోన్ రేటు 7.45 శాతం నుంచి ప్రారంభమవుతాయని బీఓఎమ్ తెలిపింది.

యూబీఎస్‌లో 10,000 ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ 2027 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరో 10,000 మంది ఉద్యోగులను తొలగించే ఆలోచనలో ఉందని సమాచారం. బ్యాంక్ మొత్తం సిబ్బందిలో దాదాపు 9 శాతానికి సమానమిది. గత ఏడాది చివరినాటికి ఈ బ్యాంక్‌లో 1.10 లక్షల మంది పనిచేస్తున్నారు. 2023లో క్రెడిట్ స్విస్‌ను కొనుగోలు చేసి తనలో విలీనం చేసుకున్న యూబీఎస్.. వ్యాపార పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ఉద్యోగులను క్రమంగా తగ్గించుకుంటూ వస్తోంది.

26500 ఎగువన బుల్లిష్

(8-12 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో నిఫ్టీ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,328- 25,933 పాయింట్ల మధ్యన కదలాడి స్వల్ప లాభంతో 26,186 వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో 26,500 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 26,500 బ్రేక్‌డౌన్ స్థాయి : 25,800

నిరోధ స్థాయిలు: 26,500, 26,700, 26,800 (26,286 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 26,000, 25,900, 25,800 (26,086 దిగువన బేరిష్)

ఎఫ్‌పీఐలు పీఛేముడ్!

ఈ ఏడాదిలో రూ.1.55 లక్షల కోట్లకు చేరిన అమ్మకాలు

గతవారంలో రూ.11,820 కోట్లు వెనక్కి.

న్యూఢిల్లీ: మన స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు(ఎఫ్‌పీఐ) పెద్ద ఎత్తున తరలిపోతున్నాయి. ఈ నెల తొలి వారంలో నికరంగా రూ.11,820 కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. గతనెలలోనూ రూ.3,765 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ సంవత్సరంలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐల నికర అమ్మకాలు రూ.1.55 లక్షల కోట్లకు చేరాయి. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం ఎఫ్‌పీఐల అమ్మకాలకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మన మార్కెట్‌లో అమ్మగా వచ్చిన నిధులను ఎఫ్‌పీఐలు చైనా, దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్‌లకు మళ్లిస్తున్నట్టు తెలుస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 8వ తేదీ			
		విజయవాడ	670
హైదరాబాద్	651	గోదావరి	650
వరంగల్	653	విశాఖపట్నం	640
చిత్తూరు	663	డజను గుడ్లు రూ. 90	

26,300 వద్ద మరోసారి గట్టి పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,300 నుంచి దిగువకు చేరినప్పటికీ ఆ తర్వాత 26,000 వద్ద రికవరీ సాధించి సానుకూల ట్రెండ్‌ను సూచించింది. చివరకు 150 పాయింట్లు రికవరీ సాధించి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 26,185 పాయింట్ల వద్ద క్లోజైంది. మార్కెట్ గత మూడు వారాలుగా 26,000 స్థాయిల వద్ద సైడ్‌వేస్, ఆటుపోట్ల ట్రెండ్‌లో సాగుతూ వస్తోంది. ప్రస్తుతం నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,300 దిగువనే ఉంది. టెక్నికల్‌గా నిఫ్టీ ఈ స్థాయిల వద్ద స్వల్పకాల నిరోధాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ మార్కెట్లో ఇంకా పాజిటివ్ ట్రెండ్ కనిపిస్తోంది. నిఫ్టీ ఈ నిరోధ స్థాయిలను బ్రేకౌట్ చేస్తే తదుపరి అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుంది. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా వారం ప్రాతిపదికన 450 పాయింట్ల కరెక్షన్‌ను కనబరిచింది. గత నాలుగు వారాలుగా ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 61,000 వద్ద కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా గత వారం 320 పాయింట్ల మేర కరెక్షన్‌ను కనబరిచింది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయిలైన 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. వచ్చే కొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకుంటే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. అప్పుడు మార్కెట్ కొత్త శిఖరాల వైపు అడుగులు వేస్తుంది. తదుపరి మానసిక అవధి 26,600.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదేనీ బలహీనతను సూచిస్తే 26,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ఇది గత వారం బాటమ్‌లో ఏర్పడిన స్థాయి. సానుకూల ట్రెండ్, రక్షణ కోసం ఈ స్థాయిలకు ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 60,000 రియాక్షన్‌ను కనబరిచి చివరకు బలంగా రికవరీ సాధించింది. వారాంతంలో నిలకడగా 59,970 వద్ద ముగిసి నిలకడను ప్రదర్శించింది. ఈ వారంలో సూచీ ప్రస్తుత నిరోధ స్థాయిలైన, గరిష్ఠ స్థాయిలైన 60,100 వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఏదేనీ బలహీనతను సూచిస్తే మాత్రం తదుపరి మద్దతు స్థాయిలు 59,500 దిగువన ఉంటాయి. ఇక్కడ మరింత బలహీనతకు ఆస్కారం ఉంది. తదుపరి మద్దతు స్థాయి 58,900.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిలదొక్కుకోవాలి. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. నిఫ్టీ గతవారం 26,000 స్థాయిల వద్ద 25 రోజుల స్వల్పకాలిక చలన సగటు వద్ద రికవరీ సాధించింది.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం, శుక్రవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,240, 26,300
మద్దతు	26,150, 26,000

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లపై కన్నేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. ఆర్‌బీఐ రెపోరేటు తగ్గించటం, భారత ఆర్థిక వృద్ధి రేటు బాగున్నప్పటికీ ఎఫ్ఐఐలు క్రమంగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండటం, రూపాయి పతనం కీలకంగా ఉండనున్నాయి. అమెరికా పరిస్థితి, జాబ్ మార్కెట్ నానాటికి క్షీణిస్తుండటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారి తీస్తోంది. గత వారం ఐటీ, మెటల్, ఆటో రంగాల షేర్లు జోరు ప్రదర్శించాయి. ఈ వారం ఈ రంగాలతో పాటు బ్యాంకింగ్, ఫార్మా షేర్లు మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

ఎస్‌బీఐ కార్డ్స్: ప్రస్తుతం ఈ షేరు కీలక జోన్‌లో ఉంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించటంతో వీటిపై ఆసక్తి నెలకొంది. ఈ షేరు స్వల్పకాల నిరోధ స్థాయికి చేరే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.885 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.955/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.865.

ఇండస్ టవర్: సెప్టెంబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు కొంతకాలంగా సైడ్‌వేస్‌లో చలిస్తూ కన్సాలిడేట్ అయ్యింది. స్వల్పకాల నిరోధాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధమైంది. పైగా నిఫ్టీతో పోలిస్తే జోరును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.415 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 శ్రేణిలో ప్రవేశించి రూ.450/480 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.400 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చోళ ఫైనాన్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. రెపో రేటు తగ్గింపు నేపథ్యంలో ఈ కౌంటర్‌పై ఆసక్తి నెలకొంది. 52 వారాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన తర్వాత కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.1,730 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,720 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,780-1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,700.

ఆర్‌బీఎల్ బ్యాంక్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రూ.340 స్థాయిని తాకిన తర్వాత కొంత బలహీనత కనిపిస్తోంది. అయితే వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటం గమనార్హం. గత శుక్రవారం రూ.305 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.300 పై స్థాయిలో ప్రవేశించి రూ.375 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.285.

పీఎన్‌బీ హౌసింగ్: ఆగస్టులో డివిడెండ్ ఇచ్చిన తర్వాత ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం మీడియం టర్మ్ అప్ ట్రెండ్‌లో ఉంది. రూ.954 వద్ద సమీప నిరోధాన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నది. గత శుక్రవారం రూ.903 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.890 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.955 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.875 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

కుర్రాళ్ల ఆశలు ఆవిరి

- సెమీస్‌లో యువ భారత్ ఓటమి
- ఫైనల్లో జర్మనీ, స్పెయిన్ ఢీ
- అర్జెంటీనాకు నిరాశ

జూనియర్ హాకీ వరల్డ్‌కప్

చెన్నై: జూనియర్ వరల్డ్‌కప్‌లో భారత హాకీ కుర్రాళ్ల కథ ముగిసింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 1-5తో డిఫెండింగ్ చాంప్ జర్మనీ చేతిలో చిత్తుగా ఓడింది. భారత్ తరఫున అన్‌మోల్ ఎక్కా (51వ నిమిషం) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. జర్మనీ నుంచి లూకాస్ కోజెల్ (14వ, 30వ) డబుల్ ధమాకాతోపాటు టిటైస్ వెక్స్ (15వ), జొనాస్ జర్గమ్ (40వ), బెన్ హాస్‌బాచ్ (49వ) గోల్స్ సాధించారు. బుధవారం జరిగే కాంస్య పోరులో అర్జెంటీనాతో భారత్ తలపడనుంది. అదేరోజు జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో జర్మనీ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో స్పెయిన్ 2-1తో రెండుసార్లు విజేత అర్జెం టీనాకు షాకిచ్చి తొలిసారి టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. స్పెయిన్‌కు మారియో మెనా (7వ), అల్బర్ట్ సెరాహిమా (43వ).. అర్జెంటీనాకు జువాన్ ఫెర్నాండెజ్ జువాన్ (21వ) గోల్స్ అందించారు. 5,6 స్థానాల కోసం జరిగే పోరులో నెదర్లాండ్స్‌తో బెల్జియం తలపడనుంది.



సిమ్రన్‌ప్రీత్‌కు స్వర్ణం

- ప్రతాప్ సింగ్, అనీష్‌కు రజతాలు
- ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్

దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్లో భారత షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ స్వర్ణం సాధించగా.. అనీష్‌తోపాటు ఈ ఈవెంట్ బరిలోకి దిగిన తొలిసారే ఐశ్వరీ ప్రతాప్ సింగ్ రజతాలతో మెరిశారు. ఆదివారం జరిగిన మహిళల 25 మీ. పిస్టల్ తుదిపోరులో సిమ్రన్‌ప్రీత్ 41 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకొంది. మరో భారత షూటర్ ఇషా సింగ్ 15 పాయింట్లతో ఏడో స్థానానికి పరిమితమైంది. పురుషుల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో ప్రతాప్ సింగ్ 413.3 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో షూటింగ్ క్రీడలోని వరల్డ్, కాంటినెంటల్ చాంపియన్‌షిప్స్‌లో సింగ్ పతకాలు నెగ్గిన ఆటగాడిగా అరుదైన ఘనతను దక్కించుకొన్నాడు. అర్హత రౌండ్‌లో కూడా సింగ్ 595 పాయింట్లతో పతక రౌండ్‌కు క్వాలిఫై అయ్యాడు. పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్లో అనీష్ 16 పాయింట్లతో రెండో స్థానంతో రజతం అందుకొన్నాడు. కాగా, విజయ్‌వీర్ సిద్ధు త్రుటిలో కాంస్యం చేజార్చుకొని నాలుగో స్థానంలో నిలిచాడు.



రో-కో అనుభవం జట్టుకు అవసరం

కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అయిన భారత క్రికెట్ జట్టు వన్డే సిరీస్‌లో మాత్రం ఆధిపత్యం చూపింది. ఇందుకు విరాట్ కోహ్లీ సూపర్ ఫామ్ ప్రధాన కారణం. రెండు శతకాలు, ఓ అర్ధసెంచరీతో 302 రన్స్ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. అటు సహచర ఆటగాడు రోహిత్ శర్మ సైతం సత్తా చూపాడు. దీనికి ముందు ఆస్ట్రేలియా పర్యటనలో హిట్‌మ్యాన్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలవడం విశేషం. ఈ వెటరన్ల ప్రదర్శనపై ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ప్రశంసలు కురిపించాడు. 'రోహిత్, విరాట్ నైపుణ్యం కలిగిన ఆటగాళ్లే కాకుండా.. వన్డే ఫార్మాట్‌లో ప్రపంచ అగ్రశ్రేణి క్రికెటర్లు. వారి అనుభవం డ్రెస్సింగ్ రూమ్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తాము ఎలా ఆడితే జట్టుకు ప్రయోజనమో వారికి తెలుసు. కొన్నేళ్లుగా భారత క్రికెట్ తరఫున అలాంటి ప్రదర్శననే కొనసాగిస్తున్నారు. మున్ముందు కూడా ఇదే జోరును చూపాలని కోరుకుంటున్నా' అన్నాడు.. అయితే 2027 వన్డే వరల్డ్‌కప్‌లో రోహిత్-కోహ్లీలు ఆడతారా అన్న విషయాన్ని మాత్రం గంభీర్ దాటేశాడు. 'ఇంకా రెండేళ్లున్న వరల్డ్‌కప్ గురించి ఇప్పుడే మాట్లాడడం తొందరపాటే అవుతుంది. వర్తమానంలో ఉండడం ముఖ్యం. రుతురాజ్, జైస్వాల్ లాంటి యువ ఆటగాళ్లు తమకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు' అని గంభీర్ వివరించాడు. ఇదిలావుండగా ఇతరులకన్నా రోహిత్, విరాట్‌లను భిన్నంగా చూడాలని మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ సూచించాడు. యువ ప్లేయర్ల వలె ఈ జోడీకి ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం లేదన్నాడు.



సురేఖ కంచు మోత

న్యూఢిల్లీ: చైనీస్ తైపీలో జరిగిన తైపీ ఆర్చరీ ఓపెన్‌లో వెన్నం జ్యోతి సురేఖ కంచు పతకం సాధించింది. ఇండోర్ కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో సురేఖ 149-143తో సో చెవాన్‌పై గెలిచింది. అంతకు ముందు సెమీస్‌లో జ్యోతి 144-145తో మ్లినారిచ్ (క్రొయేషియా) చేతిలో ఓడింది. ఇక, అండర్-21 కేటగిరిలో చికితరావు, జూనియర్ విభాగంలో గణేష్ పసిడి పతకాలు నెగ్గారు.

కిర్‌స్టెన్..నమీబియా సలహాదారు

న్యూఢిల్లీ: గ్యారీ కిర్‌స్టెన్ (దక్షిణాఫ్రికా) నమీబియా జట్టు సలహాదారుగా నియమితుడయ్యాడు. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికలుగా జరిగే టీ20 వరల్డ్ కప్‌నకు నమీబియాను సంసిద్ధం చేసేందుకు జట్టు ప్రధాన కోచ్ క్రెగ్ విలియమ్స్‌తో కలిసి అతడు పని చేస్తాడు.

అప్పన్నను దర్శించుకున్న విరాట్ కోహ్లీ



వాషింగ్టన్ సుందర్



సింహాచలం (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, వాషింగ్టన్ సుందర్ దర్శించుకున్నారు. ఆదివారం సింహగిరికి చేరుకున్న వీరిద్దరికి దేవస్థానం ఏఈవో కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత బేడా మండప ప్రదక్షిణలు చేసి అంతరాలయంలోకి ప్రవేశించిన క్రికెటర్ల గోత్రనామాలతో ప్రధానార్చకులు స్వామికి అష్టోత్తర శతనామార్చన చేశారు. గోదాదేవి సన్నిధిలో కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఏఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారుల అభ్యర్థన మేరకు విజిటర్స్ బుక్‌లో కోహ్లీ సంతకం చేశారు. స్వామి అనుగ్రహంతో విజయం సాధించామని లిఖితపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వహ్వా..ఆస్ట్రేలియా

రెండో టెస్ట్‌లోనూ ఘన విజయం

ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్



నేసర్ (5/42)

బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జోరు అలా.. ఇలా లేదు. తొలి టెస్ట్‌లో కేవలం రెండు రోజుల్లో, ఎనిమిది వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన కంగారూలు..రెండో టెస్ట్‌లోనూ అంతే తేడాతో ఘన విజయం సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (50), విల్ జాక్స్ (41) ఇంగ్లండ్ ఓటమిని తప్పించేందుకు తీవ్రంగా పోరాడారు. సగం రోజు, 37 ఓవర్లపాటు ఆసీస్ బౌలర్లకు ఎదురొడ్డి నిలిచిన ఆ జోడీ ఏడో వికెట్‌కు విలువైన 96 పరుగులు జోడించింది. కానీ నేసర్ (5/42) వీరిద్దరి వికెట్లను తీయడంతో ఆస్ట్రేలియా విజయం ఖాయమైంది. ఓవర్‌నైట్ 134/6 స్కోరుతో ఆదివారం, నాలుగో రోజు, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 241 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్మిత్, కీపర్ కేరీ అద్భుతమైన క్యాచ్‌లు అందుకొని జాక్స్, స్టోక్స్ అవుట్‌లో తమవంతు పాత్ర పోషించారు. సూపర్ ఫీల్డింగ్ ఆసీస్ విజయంలో కీలక భూమిక పోషించగా, ఇంగ్లండ్ ఆటగాళ్లు ఏకంగా ఐదు క్యాచ్‌లను మిస్ చేయడం గమనార్హం. ఇక..65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 10 ఓవర్లలో 69/2 స్కోరుతో ఛేదించి ఆస్ట్రేలియా విజయం కేతనం ఎగురవేసింది. స్మిత్ (9 బంతుల్లో 23 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 334, ఆస్ట్రేలియా 511 పరుగులు చేశాయి. ఈ టెస్ట్‌లోనూ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం విశేషం.



అవును.. మా పెళ్లి రద్దయ్యింది

ప్రకటించిన మంధాన, పలాష్

ముంబై: ఊహించిందే జరిగింది. భారత మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌ల వివాహం రద్దయ్యింది. ఈమేరకు ఆదివారం వీరిద్దరూ వేర్వేరుగా తమ సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించారు. ఈ ప్రకటనలు వెలువడ్డ కాసేపటికే ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం గమనార్హం. అయితే అసలు కారణాన్ని మాత్రం వివరించలేదు. కొన్నేళ్లుగా ఈ జంట మధ్య ప్రేమాయణం సాగుతుండగా.. గత నెల 23న వివాహ బంధంతో ఒక్కటి కావాలనుకున్నారు. అయితే పెళ్లి రోజు ఉదయమే మంధాన తండ్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. దీంతో వివాహాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే అటు పలాష్ కూడా అనారోగ్యానికి గురైనట్టు కథనాలు వినిపించాయి. ఇంతలోనే మంధాన తన ఇన్‌స్టాగ్రామ్‌లో పలాష్‌తో దిగిన ఫొటోలన్నీ తొలగించడం చర్చనీయాంశమైంది. అలాగే పలాష్‌కు గతంలోనే ఓ కొరియోగ్రాఫర్‌తో సంబంధం ఉన్నట్టుగా వార్తలు వినిపించాయి.


స్మృతి ఏమందంటే..

'గత కొద్దివారాలుగా నా జీవితం చుట్టూ ఎన్నో ఊహాగానాలు సాగుతున్నాయి. దీనిపై ఓ స్పష్టత ఇవ్వాల్సిన సమయం వచ్చింది. అవును.. నా వివాహం రద్దయ్యింది. ఇక ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలనుకుంటున్నా. మీరు కూడా వదిలేస్తారని భావిస్తున్నా. దయచేసి మా రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి.. ముందుకు సాగేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా. వీలైనంత కాలం భారత్ తరఫున క్రికెట్ ఆడి ట్రోఫీలు గెలవాలని కోరుకుంటున్నా. ఈ సమయంలో నాకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలు' అని మంధాన పేర్కొంది.

ముచ్చల్ ప్రకటన..

పలాష్ ముచ్చల్ సైతం పెళ్లి రద్దు నిర్ణయాన్ని ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించాడు. తన వ్యక్తిగత సంబంధం నుంచి బయటికి వచ్చి జీవితంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పాడు. 'ఏ మాత్రం ఆధారాల్లేని వదంతులను నమ్మేస్తున్న వారిని చూస్తే బాధేస్తోంది. ఇది నా జీవితంలో ఎంతో కష్టకాలం. ఎప్పటికీ నిర్ధారించుకోలేని పుకార్లను నమ్మి అవతలి వ్యక్తులను అంచనావేసే ముందు, మన మాటలు వారిని ఎంత బాధపెడతాయో ఆలోచించుకోవాలి. నాకు పరువు నష్టం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా. ఈ కష్ట సమయంలో నాకు నా పక్షాన నిలిచినవారందరికీ ధన్యవాదాలు' అని ముచ్చల్ పేర్కొన్నాడు.

బెంగళూరులోనే ఐపీఎల్ మ్యాచ్‌లు: డీకే శివకుమార్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియంలోనే ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయని, వేదిక మార్చే అవకాశం ఇవ్వబోమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉద్ఘాటించారు. ఆదివారం కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను మరోచోటికి మార్చేందుకు అంగీకరించేది లేదన్నారు. కాగా, కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షునిగా టీమిండియా మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్, కార్యదర్శిగా సంతోష్ మీనన్ ఎన్నికయ్యారు.



సింపుల్‌గా ఉన్నా ఎంతో స్పెషల్!

బాలీవుడ్‌లో కొత్తతరం తారల సందడి మొదలైంది. తమ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న సెలబ్రిటీలు ఇప్పుడు తల్లిదండ్రులుగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలకు వారు పెడుతున్న పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పాతకాలంలా కాకుండా చాలా సింపుల్‌గా ఉంటూనే ఎంతో లోతైన, అందమైన అర్థాలున్న పేర్లను ఎంచుకుంటున్నారు. ఇటీవల కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు తమ ముద్దుల కుమార్తె పేరును ప్రకటించడంతో ఈ ఒరవడి మరోసారి చర్చనీయాంశమైంది.

- **సారాయా :** కియారా-సిద్ధార్థ్ దంపతులు తమ కుమార్తెకు 'సారాయా' అని నామకరణం చేశారు. ఇది హిబ్రూ పదం 'సారాయ్' నుంచి వచ్చింది. దీనికి అర్థం 'యువరాణి' అని. ఈ పేరుకు తమదైన ప్రత్యేకతను జోడిస్తూ కియారా, సిద్ధార్థ్ స్పెల్లింగ్‌లో చిన్న మార్పు చేసి 'సారాయా'గా మార్చారు.
- **దువా :** దీపిక పదుకొణె-రణ్‌వీర్‌సింగ్ దంపతులు తమ కుమార్తెకు 'దువా పదుకొణె సింగ్' అని పేరు పెట్టారు. దువా అంటే 'ప్రార్థన' అని అర్థం. 'మా ప్రార్థనకు సమాధానంగా తను వచ్చింది' అంటూ వారు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో ఈ పేరును పంచుకున్నారు.
- **రహా :** అలియా భట్, రణ్‌బీర్ కపూర్ కూతురి పేరు 'రహా'. ఈ పేరుకు ఎన్నో అందమైన అర్థాలున్నాయి. స్వాహిలి భాషలో 'ఆనందం', సంస్కృతంలో 'వంశం', అరబిక్‌లో 'శాంతి, స్వేచ్ఛ, సుఖం' వంటి విభిన్న అర్థాలున్నాయి. ఈ పేరును వాళ్ల నాయనమ్మ ఎంచుకున్నారని అలియా చెప్పుకొచ్చారు.
- **లారా :** వరుణ్ ధావన్-నటాషా దలాల్ జంట తమ కుమార్తెకు 'లారా' అని పేరు పెట్టారు. పలు సంస్కృతులలో దీనికి వేర్వేరు అర్థాలున్నాయి. లాటిన్‌లో 'ఇంటిని, పొలాలను కాపాడే దేవత' అని, గ్రీకు పురాణాల్లో 'దేవతల దూత' అని అర్థం. స్పానిష్‌లో 'లారెల్ చెట్టు' అనే అర్థం కూడా ఉంది. మొత్తంమీద నేటితరం బాలీవుడ్ తారలు తమ పిల్లల పేర్ల విషయంలో సంప్రదాయాన్ని, ఆధునికతను మేళవిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందమైన అర్థాలను అన్వేషిస్తూ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు.

సంస్కృతి



చందూరు చేనేతకు సరికొత్త హంగులు

ఎర్రంచు తెల్లచీర... పద్మాంజలి పట్టు... మారుతున్న కాలానికి అనుగుణంగా... ఆధునికతను ఆవాహన చేసుకొని... సంప్రదాయ వస్త్రానికి సరికొత్త డిజైన్లు జోడిస్తున్నారు చందూరు చేనేత కళాకారులు. వినియోగదారుల అభిరుచికి తగిన పట్టు చీరలు నేస్తూ... సినీ, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులను ఆకర్షిస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో తమ ప్రత్యేకత చాటుతూ... ప్రతిష్ఠాత్మక అవార్డులు సైతం పొందుతున్న నల్లగొండ జిల్లా చందూరు చేనేతపై 'నవ్య' కథనం.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు'లకు తెలంగాణలోని మునుగోడు నియోజకవర్గానికి చెందిన ఎంతోమంది చేనేత కళాకారులు ఎంపికయ్యారు. ఇక్కత్ చీరల తయారీలో వీరు సిద్ధహస్తులు. వీరి చేతుల్లో రూపుదిద్దుకున్న వస్త్రశ్రేణులు భారత్‌లోనే కాకుండా... రష్యా, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ ప్రాచుర్యం పొందాయి. ఆర్డర్లపై ఎగుమతి అవుతుంటాయి. రసాయన రంగులతోపాటు చెట్లు, వాటి బెరడు, ఆకులను ఉపయోగించి రంగులు తయారు చేస్తున్నారు.

పద్మాంజలి పట్టు కేరాఫ్ చందూరు...

చేనేత పట్టు చీర ఆధునికత హంగులు అద్దుకొని తెలంగాణ పద్మాంజలిగా వెలుగొందుతోంది. కంచి పట్టు చీరలకు మించి మార్కెట్లో డిమాండ్ అందుకుంటున్న ఈ మోడల్ పుట్టినిల్లు మన చందూరు. గౌరంగ్‌షా డిజైన్లు, గజం అంజయ్య ఆలోచనల మేళవింపుతో రూపొందించిందే పద్మాంజలి పట్టు చీర. కంచి పట్టు చీరలకు దీటుగా చందూరు చేనేత కార్మికులు తయారు చేస్తున్న ఈ చీరలకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రముఖ మాస్టర్ వీవర్ గజం అంజయ్య వద్ద మెలకువలు నేర్చుకున్న కొంతమంది నేత కార్మికులు ప్రత్యేకమైన జకార్డు మిషన్ల ద్వారా ఇక్కత్ టెక్నాలజీని ఉపయోగించి వీటిని రూపొందిస్తున్నారు.

నాటి పెద్దంచు చీరే...

ఒకప్పుడు పెద్దంచు పట్టు చీరలంటే ప్రజల్లో మంచి ఆదరణ ఉండేది. అవి నేతన్నలకు మంచి ఉపాధి మార్గం అయ్యాయి. మగ్గాల స్థానంలో మిషన్లు రావడంతో నేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ దశలో చేనేత కార్మికులు తమ ఆలోచనలకు పదును పెట్టి పెద్దంచు పట్టు చీరకు ఆధునిక పరిజ్ఞానంతో విభిన్న డిజైన్లు జోడించారు. తమదైన శైలిలో పద్మాంజలి పట్టు చీరలుగా మార్కెట్లోకి తీసుకు వచ్చారు. దీనికి వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించడంతో, నేతన్నలకు ఇది ఒక వరమయింది. ఈ చీరల తయారీలో మాస్టర్ వీవర్లు ప్రత్యేక పట్టును... స్వచ్ఛమైన వెండి జరీని ఉపయోగించి నేస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి డిమాండ్ వస్తోంది.

ఎర్రంచు తెల్ల చీర...

బెంగాల్ మహిళల ఆహార్యంలో ప్రత్యేక భాగమైన ఎర్రంచు తెల్ల చీర... లాల్‌పాడ్ సఫేద్ చీర గురించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. సాధారణంగా ఇక్కత్ కాటన్ చీరలు ధరించే మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి అప్పట్లో బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు... లాల్‌పాడ్ సఫేద్ చీరలో ఆకట్టుకున్నారు. ఈ డిజైన్ చీరలు నల్లగొండ జిల్లా చందూరులో తయారవుతున్నాయి. చందూరుకు చెందిన చిలుకూరి శ్రీనివాసులు స్థానికంగా చేనేత కళాకారులతో నేయించి హైదరాబాద్‌కు చెందిన మార్కెటింగ్ మాస్టర్ వీవర్ గజం భగవాన్‌కు విక్రయిస్తున్నట్టు ఇక్కడి మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు. టస్సర్ సిల్క్‌తో చీర తయారవుతుందని, అంచు బ్లెడ్ రెడ్, కొన అంచు గ్రీన్, మధ్యన హాఫ్ వైట్ కలర్‌లో ఉండటం ప్రత్యేకతని చెప్పారు. వీటి ధర రూ.25 వేలు ఉంటుంది. మాస్టర్ వీవర్ల ద్వారా కోల్‌కతా, ముంబయి నగరాలతో పాటు గుజరాత్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వీటికి మంచి ఆదరణ ఉంది. అంతేకాదు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. పిల్ల, పెద్ద... అన్ని వయసులవారికీ నప్పేలా ఇక్కడ వస్త్రశ్రేణులు సిద్ధమవుతాయి. పాన్ పఠాన్, నార్‌కుండి, రాజస్థాన్, నవరత్నం వంటి డిజైన్లతో పాటు జరీ బోర్డర్లతో వినియోగదారుడి అభిరుచికి అనుగుణంగా, అందుబాటు ధరల్లో అందిస్తున్నారు. వీటితో పాటు ఏనుగు పిట్ట, జరీ చెక్స్, ఫుల్ జరీ చీరలు కూడా ప్రత్యేకత సంతరించుకున్నాయి. నియోజకవర్గ పరిధిలో వందల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి.

ప్రోత్సహిస్తే మరింతమంది

గతంలో మాదిరిగా నూలు రంగుల సబ్సిడీ పథకాలను కొనసాగిస్తే ఈ రంగంపై పెట్టుబడి పెట్టేందుకు చాలా మంది ఆసక్తితో ముందుకు వస్తారు. దీనివల్ల నేతన్నలకు ఉపాధి లభిస్తుంది. గ్రామం నుంచి చేనేత కార్మికుల వలసలు తగ్గుతాయి. యువత కూడా ఈ రంగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

- చిలుకూరి శ్రీనివాసులు

మద్రాస్ ఇక్కత్ చీర...

చందూరుకు చెందిన చేనేత కళాకారుల మరో వినూత్న డిజైన్... మద్రాస్ ఇక్కత్ చీర. వీటి తయారీతో ఇక్కడి కళాకారులు ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏడాదిపాటు కష్టపడి 234 కొయ్యలు, రిపీట్ లేకుండా ఆరు వరుసల్లో, వైట్ బేస్ చీరల్లో పకృతి అందాలతో పరవశించి నాట్యం చేసే అంబారీ నెమలిని రూపొందించారు. మధ్య మధ్యన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ, పద్మాల డిజైన్లు వేశారు. డిజైన్లను రూపొందించడం, వాటిని గ్రాఫ్‌పై గీయడం, మగ్గంపై నేయడానికి మూడు నెలలు కష్టపడ్డారు. వీరి పనితనానికి ప్రభుత్వం గుర్తింపు కూడా దక్కడం విశేషం.

అన్నదమ్ములకు అవార్డులు...

చందూరుకు చెందిన చిలుకూరి శ్రీనివాసులు సహజసిద్ధమైన రంగులతో డబల్ ఇక్కత్ దుపట్టాను తయారు చేశారు. దీనికిగాను 'కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు'కు ఎంపికయ్యారు. శ్రీనివాసులు అన్న చిలుకూరి కృష్ణయ్య 2023లో, తమ్ముడు చిలుకూరి ధనుంజయ 2024లో ఈ అవార్డులు సొంతం చేసుకున్నారు. దాదాపు 35 సంవత్సరాలుగా ముగ్గురు అన్నదమ్ములు డబుల్ ఇక్కత్‌పైనే ప్రయోగాలు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం వరకు రసాయన రంగులతో డబుల్ ఇక్కత్ వస్త్రాలు నేసినా, ఆ తర్వాత నుంచి సహజ సిద్ధమైన రంగులకు మారి మంచి ఆదరణ పొందుతున్నారు. దుపట్టా తయారు చేసేందుకు రెండు నెలల సమయం పట్టిందంటారు శ్రీనివాసులు.

● **బరిగెల శ్రీనివాస్**, చందూరు

పిల్లల మేధస్సుకు...

పిల్లలు చురుకుగా తెలివితేటలతో పెరగాలంటే తల్లిదండ్రులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నప్పటినుంచే పిల్లలకు మంచి దినచర్యను అలవాటు చేయాలి.

- పిల్లలు రాత్రిపూట త్వరగా పడుకొని ఉదయాన్నే నిద్రలేచేలా చూడాలి. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి పిల్లలు మానసికంగా ప్రశాంతంగా ఉంటారు. మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది.



- పిల్లలకు తరచూ మంచినీళ్లు తాగడం అలవాటు చేయాలి. దీనివల్ల శరీరం తేమతో నిండుతుంది. నీరసం, నిస్సత్తువ ఆవహించకుండా తక్షణ శక్తి లభిస్తుంది. వీటితోపాటు శరీరమంతా రక్త ప్రసరణ సజావుగా జరగడం వల్ల మెదడు వేగంగా స్పందించగల్గుతుంది.
- పిల్లలకు రోజూ వ్యాయామం చేయాలని చెప్పాలి. రోజూ నిద్రలేవగానే పిల్లలు వ్యాయామం చేస్తూ ఉంటే శరీరంలో ఎండార్ఫిన్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో పిల్లలు చురుకుగా ఆలోచించగల్గుతారు.
- రోజూ పిల్లలను ఉదయం పూట కాసేపు చదివించాలి. ఇలాచేయడం వల్ల పిల్లల్లో గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- పిల్లలు అల్పాహారం మానేయకుండా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, కోడిగుడ్లు, పాలు, పెరుగును రోజూ ఆహారంలో చేర్చాలి. వీటివల్ల పోషణ అంది మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- సాయంత్రం పూట పిల్లలచేత మెమరీ గేమ్స్, చదరంగం, సుడోకు, పజిల్ గేమ్స్ లాంటివి ఆడించాలి. వీటివల్ల పిల్లల్లో ఆలోచనా సామర్థ్యం, తెలివితేటలు పెరుగుతాయి.
- పిల్లలకు యోగా, ధ్యానం లాంటివి అలవాటు చేయాలి. వీటివల్ల మెదడు ప్రశాంతంగా ఉల్లాసంగా మారుతుంది. జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది.

వీటితో పొట్ట క్లీన్

పొట్ట శుభ్రంగా ఉన్నప్పుడే జీవక్రియలు సజావుగా జరుగుతాయి. లేదంటే కడుపు ఉబ్బరించడం, ఎసిడిటీ, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలతోపాటు పలు అనారోగ్య పరిస్థితులు ఎదురవుతాయి. ఏ పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటే పొట్ట సహజ రీతిలో శుభ్రపడుతుందో తెలుసుకుందాం...

- రాత్రి పడుకునేముందు కొద్దిగా ఉసిరి రసం తాగితే జీర్ణాశయ వ్యవస్థ వేగంగా పనిచేస్తుంది. ఉదయానికల్లా పొట్టలోని మలినాలన్నీ పూర్తిగా విసర్జితమవుతాయి.
- ఉదయాన్నే అల్లం టీ లేదా ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల అల్లం రసం కలుపుకుని తాగితే జీర్ణ సమస్యలన్నీ తొలగిపోతాయి. పేగులు పూర్తిగా శుభ్రపడతాయి. కడుపులో తేలికగా ఉన్న భావన కలుగుతుంది.
- ఒక గ్లాసు నీళ్లలో ఒక చెంచా వాము వేసి బాగా మరిగించి రాత్రి పడుకునేముందు తాగితే ఉదయానికల్లా కడుపులో పేరుకున్న వ్యర్థాలన్నీ విసర్జితమవుతాయి. వాములో ఉండే పీచు పదార్థాలు పొట్టని, పేగులను శుభ్రం చేస్తాయి.
- ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా తేనె, ఒక చెంచా నిమ్మరసం కలుపుకుని తాగినా పొట్ట శుభ్రమవుతుంది.



- తాజా కూరగాయలు, పండ్లు, శనగలు, ఓట్స్‌ను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- మజ్జిగలో ప్రో బయోటిక్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణాశయంలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలను వృద్ధి పరుస్తాయి. తరచూ పలుచని మజ్జిగ తాగడం వల్ల పొట్టలో పేరుకున్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- తరచూ జీలకర్ర నీటిని తాగుతూ ఉంటే కడుపు ఉబ్బరం తగ్గుతుంది. జీలకర్రలోని యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. దీనివల్ల ఎప్పటికప్పుడు పొట్ట శుభ్రపడుతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలు లేదా నీళ్లలో అరచెంచా త్రిఫల చూర్ణాన్ని కలుపుకుని తాగితే పొట్టలోని మలినాలు, టాక్సిన్లు తేలికగా తొలగిపోతాయి.

స్ఫూర్తి

చిన్నప్పటి నుంచీ ఎన్నో కలలు. డాక్టర్ కావాలని. రచయితగా రాణించాలని. తెరపై కనిపించాలని. కానీ చివరకు న్యాయవాదిగా స్థిరపడ్డారు ప్రియాంకా ఖిమాని. సొంతంగా ఒక లా ఫర్మ్ నెలకొల్పి... బాలీవుడ్ సెలబ్రిటీల కేసులతో బిజీ అయ్యారు. ఎంతోమంది యువ లాయర్లకు మార్గదర్శకత్వం చేస్తూ... మరెంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రియాంక కథ ఇది.





సెలబ్రిటీ లాయర్

"జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో... ఏ మలుపు తిరుగుతుందో ఊహించలేం. పరిస్థితులకు అనుగుణంగా సాగిపోతుండాలి" అంటారు ప్రియాంకా ఖిమాని. బడికి వెళ్లే రోజుల్లోనే తనలోని సృజనకు రెక్కలు తొడిగారు. రచయితగా పలు టీవీ షోలకు పని చేశారు. రంగస్థల కళాకారిణిగా, మోడల్‌గా... విభిన్న రంగాల వైపు అడుగులు వేశారు. కానీ విధి మరోలా తలచింది. జీవితం అనుకోని మలుపు తీసుకుంది. "ముంబయిలో పుట్టాను. తరచూ వెళ్లిరావడంవల్ల ఢిల్లీతోనూ అనుబంధం ఏర్పడింది. పదిహేనేళ్ల వయసులో తొలిసారి 'తమన్నా హౌస్' అనే టెలివిజన్‌కు రచయితగా పని చేశాను. ముఖానికి రంగు వేసుకొని రంగస్థలంపై ప్రధాన పాత్ర పోషించాను. చదువు కొంటూనే ఇవన్నీ కొనసాగిస్తూ వచ్చాను. ముంబయి... ఢిల్లీ నగరాల మధ్య తీరిక లేకుండా రోజులు గడిచిపోయేవి. ఆ సమయంలో మా నాన్న మరణించారు. వెళుతూ వెళుతూ మాపై పెద్దఎత్తున అప్పుల భారం మోపారు. అప్పుడు నేను మెడిసిన్ కోసం సన్నద్ధమవుతున్నా. డాక్టర్ కావాలన్నది నా కల. కానీ మా ఇంటి పరిస్థితుల నేపథ్యంలో అటువైపు వెళ్లలేని పరిస్థితి. దాంతో నా కల కలగానే మిగిలిపోయింది" అంటూ ఓ సందర్భంలో తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న ప్రియాంక... డిగ్రీలో కోరిమరీ బయోటెక్నాలజీ తీసుకున్నారు. "2009లో... ముంబయి జైహింద్ కాలేజీలో చేరాను. తరగతి గదిలో ఉన్నంతసేపూ పాఠ్యాంశాలు. దాని నుంచి బయటకు వస్తే నేనో రచయితను. అలా చాలా టీవీ షోలకు స్క్రిప్ట్స్ రాశాను. అర్చనా పూరన్ సింగ్ లాంటి ప్రముఖుల షోలకు కూడా పని చేశాను" అని చెప్పారామె.

స్నేహితులను చూసి...

అందరూ కాలేజీ జీవితాన్ని ఆస్వాదిస్తుంటే, ప్రియాంక మాత్రం జీవిత పోరాటంలో బిజీగా ఉండేవారు. అయితే ఎంతకాలం ఇలా? డిగ్రీతోనే ఆగిపోతే భవిష్యత్తుకు తగిన భరోసా దొరకదు. చదువు కొనసాగించాలంటే ఏంచేయాలి? కెరీర్‌ను అర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఎలా ముందుకు వెళ్లాలి? "ఈ ఆలోచనలు నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. నా స్నేహితులు కొందరు బయోటెక్నాలజీకి జతగా పేటెంట్ లా కూడా చదువుతున్నారు. దానివల్ల మంచి అవకాశాలు ఉంటాయని తెలుసుకున్నాను. నేను కూడా అదే దారిలో నడిచాను. ప్రభుత్వ లా కళాశాలలో చేరాను. తోటి విద్యార్థులందరికీ లా ఫర్మ్‌లో అప్రంటీస్‌షిప్స్ లభించాయి. నేను నా రైటింగ్స్ కొనసాగించాను. ఎందుకంటే ఇందులో మంచి ఆదాయం వస్తుందని" అని తన కాలేజీ రోజులను ఆమె గుర్తు చేసుకున్నారు.

అలా ఉపయోగపడింది...

చేతి నిండా పని... దానికి తగ్గ ఆదాయం. సాఫీగానే సాగిపోతున్నా ఆమెలో ఏదో ఆందోళన. "టెలివిజన్ రంగం నాలాంటి యువతులకు సరైన వేదిక కాదనిపించింది. ఎందుకంటే నేను ఎంత నిజాయతీగా, ప్రభావవంతంగా పని చేసినా... వాళ్లు నన్ను ఏ రోజూ ఒక పూర్తిస్థాయి రచయితగా గుర్తించలేదు. అందుకే 2012లో ఎల్ఎల్‌బీ అయ్యాక ఇక న్యాయ వృత్తిలోనే నా కెరీర్ నిర్మించుకోవాలని నిశ్చయించుకున్నా. తోటి విద్యార్థుల్లా నాకు అనుభవం లేదు. ఎలాగని ఆలోచిస్తుంటే ప్రముఖ లా ఫర్మ్ 'ముల్లా అండ్ ముల్లా'లో అవకాశం వచ్చింది. అందుకు ప్రధాన కారణం... సృజనాత్మకంగా రూపొందించిన నా సీవీ వారిని బాగా ఆకర్షించింది. నాలోని రచయిత్రి అనుకోకుండా అలా ఉపయోగపడింది" అంటారు ప్రియాంక.

సొంతంగా లా ఫర్మ్...

ఉద్యోగ బాధ్యతల్లో కొద్ది కాలంలోనే మంచి అనుభవం గడించిన ప్రియాంక వృత్తిగత జీవితాన్ని ఒక ఫోన్ కాల్ మలుపు తిప్పింది. "గతంలో నేను అసిస్టెంట్‌గా పని చేసిన ఓ టీవీ షో రైటర్ నుంచి ఫోన్ వచ్చింది. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కేసు తీసుకోవాలని తను కోరారు. నాకు మాటలు రాలేదు"... అంటూ ఎంతో ఉద్వేగంగా నాటి ఘట్టాన్ని నెమరేసుకున్న ఆమెకు ఇక వెనక్కి తిరిగి చూసుకొనే అవసరం రాలేదు. సోనూ నిగమ్, అలీషా చినాయ్, అనురాగ్ కశ్యప్, రాజేష్ రోషన్ తదితర బాలీవుడ్ ప్రముఖుల కేసులు ఆమె వాదించారు. కీలక కేసులు గెలిచారు. ఇది ఆమెలో ఆత్మవిశ్వాసం పెంచింది. దీంతో ప్రియాంక 2014లో 'ఖిమాని అండ్ అసోసియేట్స్'ను ప్రారంభించారు.

ఢిల్లీలో మరొకటి...

ప్రియాంక పేరు పరిశ్రమలో బాగా పరిచయమైంది. కేసులు పెరుగుతూ వచ్చాయి. ఈ క్రమంలో రెండేళ్ల కిందట ఢిల్లీలో కూడా తమ సంస్థ సేవలు ప్రారంభించారు. 'ఉమెన్ ఆఫ్ మ్యాజిక్' పేరిట ఒక స్వచ్ఛంద సంస్థ కూడా నెలకొల్పారు. వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహించి, వారు సాధించిన విజయాలను గుర్తించి, సాధికారత వైపు నడిపించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. కెరీర్ పరంగానూ ఎన్నో మైలురాళ్లను అందుకున్న ప్రియాంక... విదేశాల్లో సైతం న్యాయ సహాయం అందిస్తున్నారు. "మా లా ఫర్మ్ నెలకొల్పి దశాబ్దం దాటింది. రాబోయే పదేళ్లలో అంతర్జాతీయంగానూ మా సేవలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాం" అంటున్న ప్రియాంక ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజిక్ లైసెన్సింగ్ ప్లాట్‌ఫామ్ అయిన 'సాంగ్‌ట్రేడర్'తో పాటు 'బీట్‌డాప్'కు బోర్డ్ మెంబర్‌గా ఉన్నారు.

వయసు పెరిగినా ఫిట్‌గా...

సాధారణంగా వయసు పెరిగేకొద్దీ శరీరంలో మార్పులు సంభవిస్తూ ఉంటాయి. జీవక్రియలు మందగించడం, కండరాల పటుత్వం తగ్గడం, ఎముకలు బలహీనమవడం లాంటివి ఎదురవుతూ ఉంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో శరీరాన్ని ఫిట్‌గా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం...

- రోజూ ఉదయం నిద్రలేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగాలి. దీంతో కడుపు, పేగులు శుభ్రపడతాయి. కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు తొలగిపోయి శరీరం తేలికగా అనిపిస్తుంది. హెర్బల్ టీ లేదా గ్రీన్ టీ తాగినా కూడా శరీరంలోని టాక్సిన్లు విసర్జితమవుతాయి. రోజంతా కూడా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- అధికంగా కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోకూడదు. తీపి పదార్థాలు, నూనె పదార్థాలతోపాటు ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం మంచిది. కాలానుగుణంగా లభించే పండ్లు, ఉడికించిన కూరగాయలు, మొలకలను రోజూ ఆహారంలో చేర్చుకోవాలి.
- ఉదయం లేదా సాయంత్రం వేళల్లో కనీసం పావుగంటసేపు శరీరానికి ఎండ తగిలేలా చూసుకోవాలి. దీనివల్ల శరీరానికి తగినంత డి విటమిన్ లభించి ఎముకలు, కండరాలు బలోపేతమవుతాయి.
- రోజూ తేలికపాటి వ్యాయామం చేయడం, పార్కులో నడవడం, ఇంట్లో తోటపని చేయడం, సైకిల్ తొక్కడం లాంటివి అలవాటు చేసుకోవాలి. వీటివల్ల శరీరం బరువు పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.
- రోజూ కనీసం ఆరుగంటలు హాయిగా నిద్రపోవాలి. అప్పుడే ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. శరీరంలో కణాలు వృద్ధి పొందుతాయి. హార్మోన్లు సమతౌల్యంలో ఉంటాయి.
- సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా గడపడం, స్మోకింగ్, ఆల్కహాల్ లాంటి అలవాట్లను మానుకోవాలి.
- కనీసం ఆర్నెల్లకోసారి వైద్యుని సంప్రదించి అవసరమైన చికిత్స తీసుకోవాలి.



మాతమార్పిడులపై విచారణ జరపాలి: విజయసాయి



అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందూ మతంపై కుట్రలను సహించేది లేదని, డబ్బు ఆశ చూపి మతం మార్చాలని ప్రయత్నించే వారికి తగిన గుణపాఠం చెబుదామని రాష్ట్ర ప్రజలకు మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఎక్స్‌లో చేసిన ట్వీట్‌లో.. గత రెండు దశాబ్దాలుగా హిందూమత మార్పిడులపై ప్రభుత్వం కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం హిందువులలో ఉన్న అన్ని సామాజికవర్గాలు ఒక్కటవ్వాలని సూచించారు. అదే దేశానికి ఆత్మరక్ష, శ్రీరామరక్షగా పేర్కొన్నారు.

ఏడాదిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

▸▸ రాయ్‌పూర్-విశాఖల మధ్య వడివడిగా పూర్తి: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ.. రాయ్‌పూర్-విశాఖపట్నం మధ్య నిర్మిస్తున్న ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఏడాదిలో అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఆదివారం వెల్లడించింది. మొత్తం రూ.16,482 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మిస్తున్నారు. దీన్ని ప్రస్తుత 26వ నంబరు జాతీయ రహదారితో అనుసంధానం చేయడం ద్వారా మొత్తం ప్రయాణ దూరాన్ని 597కి.మీ. నుంచి 465 కి.మీ.కు తగ్గించనుంది. ఈ కారిడార్ నిర్మాణం ద్వారా 132కి.మీ. దూరం... దాదాపు ఏడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుందని కేంద్రం వివరించింది.

విశాఖలో పది ఇండిగో సర్వీసులు రద్దు

గోపాలపట్నం(విశాఖపట్నం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విశాఖ విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన పది ఇండిగో విమాన సర్వీసులను ఆదివారం సాంకేతిక కారణాలతో రద్దుచేశారు. వీటిలో విశాఖ-హైదరాబాద్(4), విశాఖ-బెంగళూరు(2), విశాఖ-ముంబై (2), విశాఖ-చెన్నై, విశాఖ-కోల్‌కతా సర్వీసులు ఉన్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

17న గవర్నర్‌తో జగన్ భేటీ

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ ఈ నెల 17న సాయంత్రం 4 గంటలకు పార్టీ నాయకులతో కలసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కానున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సేకరించిన కోటి సంతకాలతో కూడిన వినతిని గవర్నర్ నజీర్‌కు సమర్పించనున్నారు.

25న వాజపేయి శత జయంత్యుత్సవాలు: మాధవ్

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీని ప్రగతి పథంలో నడిపించేందుకు కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలో ఆయన 'అటల్ సందేశ్ యాత్ర' వార్ రూమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పాయి శత జయంతి సందర్భంగా రాష్ట్ర బీజేపీ చేపట్టిన బస్సుయాత్ర ఈ నెల 11న ధర్మవరంలో ప్రారంభమవుతుందన్నారు. 25న అమరావతిలో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

పీజీ మెడికల్ అభ్యర్థులకు అన్యాయం జరగదు

అమరావతి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో ఆలిండియా కోటా, రాష్ట్ర కోటాలో రెండు చోట్లా సీటు పొందిన అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. సమస్యపై మెడికల్ కౌన్సెలింగ్ కమిటీకి వర్సిటీ తరపున లేఖ రాశామని స్పష్టం చేశారు.

17న 'బ్లాక్2 బ్లూబర్డ్' ప్రయోగం

సూళ్లూరుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మరో వాణిజ్య ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. ఈ నెల 17న అమెరికాకు చెందిన బ్లాక్2 బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తోంది. షార్ నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది.

చంద్రబాబు వయసు 75 ఏళ్లు.. ఇప్పటికీ 20 ఏళ్ల కుర్రాడిలా పరిగెడుతున్నారు. ఆయన స్పీడ్‌ను ఇంకా అందుకోలేకపోతున్నాను. ఏదో ఒకరోజు ఆయన వేగానికి దరిదాపుల్లోకి వస్తానని భావిస్తున్నా.

వైసీపీ వేధింపులను చూసి ఈ రాజకీయాలు మనకు అవసరమా అని అప్పట్లో నా భార్య బ్రాహ్మణి నన్నడిగింది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో మీరంతా అండగా నిలిచారు. ఈ రోజు డల్లాస్ వేదికపై నిల్చొని మాట్లాడుతున్నానంటే అది ఆనాడు మీరు అండగా నిలవడం వల్లే.

- ప్రవాసాంధ్రులతో లోకేశ్

15 ఏళ్లు కూటమే!

(మొదటి పేజీ తరువాయి)

ఉండవు.. మిస్‌ఫైర్‌లు ఉండవు.. క్రాస్ ఫైర్‌లు ఉండవు' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అమెరికాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం డాలస్‌లోని కర్టిస్ కల్ వెల్ సెంటర్‌లో నిర్వహించిన ప్రవాసాంధ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీహరిహర పీఠం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. దేశంలో అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్నాయని.. ఒక్క ఏపీలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉందని తెలిపారు. 'ఈరోజు స్పీడ్‌కు ఏపీ బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. అన్ని రంగాల్లో వేగంగా ముందుకెళ్తోంది. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ.. ఇదే మా నినాదం. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యం. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి, యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో మేం తిరగని దేశాలు లేవు. 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురాగలిగాం. తద్వారా 16లక్షల మందికి ఉపాధి కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అవన్నీ వచ్చే 3 నెలల్లో గ్రౌండ్ చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోంది' అని వివరించారు. ఇంకా ఏమన్నారంటే..



డాలస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రవాసాంధ్రులతో మంత్రి లోకేశ్ కరచాలనం



బాబు ముందుచూపున్న నేత..

చంద్రబాబు ఐటీని పరిచయం చేశాక హైదరాబాద్ రూపుమారిపోయింది. ఈరోజు బెంగళూరుకు పోటీ ఇస్తోంది. గతంలో ఐటీ.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీ. చంద్రబాబు ముందుచూపు ఉన్న నాయకుడు. తెలుగుజాతికి అది అదృష్టం. ఏ దేశానికి వెళ్లినా.. ఏ కంపెనీకి వెళ్లినా సాదర స్వాగతం పలుకుతున్నారంటే కారణం చంద్రబాబు. కార్యకర్తలే టీడీపీ బలం. వారి త్యాగాలను గుర్తు పెట్టుకుంటాం. మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య.. స్థానిక ఎన్నికల్లో పుంగనూరులో మీసాలు మెలేసి, తొడగొట్టిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. రక్తం కారుతున్నా చివరి ఓటు వేసే వరకు బూత్‌లో నిలబడిన మంజులారెడ్డికే లోకేశ్ అండ. జై తెలుగుదేశం అన్నందుకు విజయవాడలో గాంధీ కంటిచూపు పోగొట్టుకున్నారు. అధికార గర్వంతో వైనాట్ 175 అన్నారు. ప్రజలు వై నాట్ 11 అన్నారు. చివరకు ఆ పార్టీని భూస్థాపితం చేశారు.

స్వరాష్ట్రంపై మీకు ప్రేమ..

అందరూ మిమ్మల్ని ఎన్‌ఆర్‌ఐలు అంటారు. కానీ మీరు ఎంఆర్‌ఐలు.. మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మీరు అమెరికాకు వచ్చి దశాబ్దాలు గడిచినా మీ మనసు ఎప్పుడూ ఏపీ వైపే చూస్తుంది. మీ ఊరి వైపు ఉంటుంది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు పెద్దఎత్తున బయటకు వచ్చారు. సొంత రాష్ట్రంపై ప్రేమ ఉంది కాబట్టే.. ఎన్నికలకు 6నెలలు, ఏడాది ముందు వచ్చి ఏ పదవీ.. డబ్బు ఆశించకుండా మాకు అండగా నిలిచారు. అందుకే ఎప్పుడూ లేని విధంగా 94 శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. రాబోయే రోజుల్లో ఈ రికార్డులు తిరగరాస్తాం.

రెడ్‌బుక్ తన పని తాను చేసుకుపోతుంది

రెడ్‌బుక్ తన పని తాను చేసుకుంటూపోతోంది. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. మేం ఎలాంటి కక్ష సాధింపులకూ పాల్పడడం లేదు. నా తల్లిని అవమానించిన వారిని వదిలిపెట్టను. మీ తల్లిని అవమానించినా వదిలిపెట్టను. అయితే వారు అవమానించారని మనం అవమానించకూడదు. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం.

పేరుపేరునా ధన్యవాదాలు..

సమావేశానికి హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు లోకేశ్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తాను అమెరికాలో నాలుగేళ్లు అండర్ గ్రాడ్యుయేషన్ చేశానని, రెండేళ్లు వాషింగ్టన్ డీసీలో ప్రపంచ బ్యాంకులో పనిచేశానని తెలిపారు. స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేశానని.. సుమారు 9ఏళ్లు ఇక్కడ ఉన్నానని, కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి డాలస్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచీ ఈ కార్యక్రమం వరకు తనకు ఘనస్వాగతం పలకడం మరచిపోలేనని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే యువగళం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ సమావేశాన్ని చూసిన తర్వాత టీమ్ 11కి నిద్రపట్టదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ ప్రవాసాంధ్ర వ్యవహారాల సలహాదారు, ఏపీఎన్‌ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, ఎన్‌ఆర్‌ఐ టీడీపీ యూఎస్‌ఏ కో-ఆర్డినేటర్ కోమటి జయరాం, టెక్సాస్‌లోని గార్లాండ్ నగర మేయర్ డైలాన్ హెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

ఇది పరీక్షా సమయం..

అమెరికాలో ఉన్న అందరూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. చదువుకుని మంచి ఉద్యోగాల కోసం ఇంత దూరం వచ్చారు. ఒక్కో కుటుంబానికి దేవుడు ఒక్కో పరీక్ష పెడతాడు. చిన్న ఎదురుదెబ్బ తగిలిందని బాధపడడం, ఆత్మహత్యలకు పాల్పడడం సరైన మార్గం కాదు. మన తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. వారి గురించి కూడా ఆలోచించాలి. మీరు కేవలం జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ క్రియేటర్స్‌గా తయారు కావాలి. 2019లో నేను మంగళగిరిలో పోటీ చేసి ఓడిపోయాను. కానీ అధైర్యపడలేదు. కసితో పనిచేసి 91 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించాను. 1960 నుంచి పెద్ద ఎత్తున తెలుగువారు అమెరికాకు వచ్చారు. అద్భుతంగా రాణించారు. మన గౌరవాన్ని పెంచారు. ఇప్పుడు ఆ బాధ్యత మన భుజాలపై ఉంది. ప్రతిపక్షంలో ఉండగా మాకు అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారు. విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టమొచ్చినా ఏపీఎన్‌ఆర్‌టీ మీకు అండగా నిలుస్తుంది.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మైసూరు తలపాగా, మజ్జిగకవ్వంతో సత్కరిస్తున్న సుగుణేంద్రతీర్థ స్వామీజీ

భగవద్గీత సందేశమే మార్గనిర్దేశం

▸▸ ఉడుపి.. ఓ ఆధ్యాత్మిక శక్తి కేంద్రం

▸▸ శ్రీకృష్ణుడి దర్శనం నా అదృష్టం

▸▸ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

▸▸ కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణ మఠం సందర్శన

▸▸ 'బృహత్ గీతోత్సవం' కార్యక్రమానికి హాజరు

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భగవద్గీత సందేశం అందరికీ మార్గనిర్దేశం కావాలని, సమాజాన్ని బలోపేతం చేయడం ద్వారా జాతీయస్ఫూర్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. విజయవాడ నుంచి మంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కల్యాణ్.. అక్కడి నుంచి రోడ్డుమార్గాన ఉడుపికి చేరుకున్నారు. శ్రీకృష్ణమఠం ప్రాంగణంలోకి చేరుకోగానే పవన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకృష్ణుడిని దర్శించుకొన్న తర్వాత మఠంలోకి వెళ్లారు. అక్కడ పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామీజీ ఆశీస్సులు పొందారు. ఉడుపి అష్టమఠాలకు చెందిన ఇతర స్వామీజీల ఆశీస్సులు కూడా తీసుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన 'బృహత్ గీతోత్సవ' కార్యక్రమంలో సుగుణేంద్రతీర్థ స్వామీజీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పవిత్ర భూమి ఉడుపిని దేశ ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా అభివర్ణించారు. శ్రీకృష్ణుడు కొలువై ఉండే ఈ నేలపై అడుగు పెట్టడం తన అదృష్టమన్నారు. కోటి భగవద్గీత లేఖన యజ్ఞం నుంచి లక్ష కంఠ పారాయణం వరకు చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. 'జై శ్రీకృష్ణ, జై హనుమాన్, జైహింద్' అంటూ పవన్ తన సందేశాన్ని ముగించారు. వేదికపై పవన్ కల్యాణ్‌కు సుగుణేంద్రతీర్థ స్వామీజీ మైసూరు తలపాగాతో సత్కరించి.. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని, మజ్జిగ కవ్వాన్ని బహూకరించారు. ఇదే విషయాలను ఆయన సోషల్ మీడియాలోనూ పంచుకున్నారు. కాగా, పవన్ కల్యాణ్ నవంబరులోనే ఉడుపి మఠాన్ని సందర్శిస్తారని ప్రచారం జరిగింది. అయితే అది పలు కారణాలతో వాయిదా పడింది. ఆదివారం మఠానికి వచ్చిన పవన్‌ను చూసేందుకు స్థానికులతో పాటు భక్తులు పెద్దఎత్తున వచ్చారు. నవంబరు 28న లక్ష కంఠ గీతాపారాయణం ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనగా.. ముగింపు కార్యక్రమంలో పవన్ కల్యాణ్ భాగస్వామి అయ్యారు.

శ్రీశైలానికి డేంజర్ బెల్స్!

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం జలాశయం ప్రమాదపుటంచుల్లో ఉందని.. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీగొయ్యి విస్తరించడం.. ఆనకట్ట రక్షణకు అమర్చిన 62 సిలిండర్లు దెబ్బతినడం ప్రమాద సంకేతాలని అధ్యయన సంస్థలు తమ నివేదికల్లో స్పష్టం చేశాయి. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల అతిభారీ వరద రావడంతో ప్రాజెక్టు దెబ్బతింది. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ శ్రీశైలం డ్యాం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఆ తర్వాత పదేళ్లలో కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి, సీడబ్ల్యూసీ మరో మాజీ చైర్మన్, డ్యాం భద్రత నిపుణుడు ఏబీ పాండ్యా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మాజీ, ప్రస్తుత చైర్మన్లు వివేక్ త్రిపాఠి, అనిల్ జైన్ సహా అనేకమంది నిపుణులు, ప్యానెళ్లు, కమిటీలు ప్రాజెక్టును సందర్శించాయి. పలు లోపాలు ఎత్తు చూపుతూ డ్యాం భద్రతకు తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశాయి. డ్యాం దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ భారీ గొయ్యి సహా నదీగర్భం, రాతికట్ట కోతకు గురవుతున్నాయని.. డ్యాం భద్రత దృష్ట్యా నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించాయి. అయినా పాలకులు నిర్లక్ష్యం వీడలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం.. డ్యాం పాలిట శాపంగా మారింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రోచ్ రోడ్డు నిర్మాణం సహా పలు మరమ్మతులకు రూ.203 కోట్లు కేటాయించింది. అయితే కొత్త సిలిండర్ల ఏర్పాటు ఈ పనుల్లో లేదు. ప్రస్తుతం వీటి కోసం అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఎంతలేదన్నా.. సిలిండర్లకు రూ.160 నుంచి 180 కోట్ల వరకు ఖర్చవుతుందని రిటైర్డ్ ఇంజనీర్లు అంటున్నారు.

పలు సంస్థల అధ్యయనాలు..: వాస్తవానికి 2009లో వచ్చిన భారీ వరదల కారణంగానే

మరమ్మతులకు 203 కోట్లు

2018లో ఉన్న గుంతతో పోలిస్తే పెద్దగా ప్లంజ్‌పూల్ గొయ్యి విస్తరించలేదని, డ్యాంకు ప్రమాదం లేదని సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నివేదిక ఇచ్చింది. దీనిపై 3-డీ మోడల్‌లో స్టడీ చేయాలి. డ్యాంకు రక్షణగా ఏర్పాటు చేసిన 62 సిలిండర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ సంస్థ రిపోర్టు ఇచ్చింది. వాటిస్థానంలో కొత్త సిలిండర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. డ్యాం మరమ్మతులకు ప్రభుత్వం రూ.203 కోట్లు మంజూరు చేసింది. అప్రోచ్ రోడ్డు సహా ఆనకట్ట కుడి, ఎడమ వైపుల్లో కొండ రాళ్లు జారకుండా షాట్ క్రీటింగ్ పనులకు టెండర్లు పిలిచాం.

- కబీర్‌బాషా, ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సీఈ, కర్నూలు



శ్రీశైలం డ్యాం దిగువన అప్రాన్‌కు 15 మీటర్ల దూరంలో ఏర్పడిన ప్లంజ్‌పూల్ గుంత (ఫైల్)

ప్లంజ్‌పూల్ గొయ్యి బాగా పెద్దదైంది. సిలిండర్లు దెబ్బతినడమే కాదు.. అప్రోచ్ రోడ్డు ఆనవాళ్లే లేకుండా కొట్టుకుపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు సీఎం అయ్యాక ప్లంజ్‌పూల్ గొయ్యిపై 2018లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్‌ఐవో) సంస్థ అధ్యయనం చేసింది. గొయ్యి 42 మీటర్లు లోతు లో ఉందని నివేదిక ఇచ్చింది. 2020 ఫిబ్రవరి 25న ఏబీ పాండ్యా సారథ్యంలో నియమించిన కమిటీ 2021లో నివేదిక ఇచ్చింది. అనంతరం నాటి ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలోని నిపుణుల బృందం కూడా రిపోర్టు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్ శ్రీశైలం డ్యాంను సందర్శించారు. డ్యాం రక్షణ కోసం ఏర్పాటు చేసిన 67 సిలిండర్లలో 62 పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్లంజ్‌పూల్ ప్రమాదకరంగా మారిందని నిపుణులు ఇచ్చిన నివేదికలు చెబుతున్నాయని.. 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులు చేపట్టకపోవడం, నిపుణుల సూచనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. దాంతో ప్లంజ్‌పూల్ గుంత వల్ల డ్యాం ఆనకట్ట, పునాదులకు ఏ స్థాయిలో ప్రమాదం పొంచి ఉందో.. అధ్యయనం చేసేందుకు పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు అప్పగించారు. అలాగే.. డ్యాంకు రక్షణగా ఏర్పాటుచేసిన సిలిండర్ల తాజా పరిస్థితిని తెలుసుకునే బాధ్యతను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ సంస్థలు లోతుగా అధ్యయనం చేసి వేర్వేరుగా నివేదికలిచ్చాయి.

పునాదుల కంటే లోతులో..

ప్లంజ్‌పూల్ గొయ్యి 42 మీటర్లు లోతులో ఉందని ఎన్‌ఐవో గతంలోనే తెలుపగా.. సీడబ్ల్యూపీఆర్‌ఎస్ కూడా దాదాపు ఇదే చెప్పింది. ఈ సంస్థ ఇంటిగ్రేటెడ్ బాతిమెట్రి సిస్టమ్(ఐబీఎస్), సింగల్ బీమ్ డ్యూయల్ ఫ్రీక్వెన్సీ ఎకోసౌండర్, మోటరైజ్డ్ సర్వే బోట్‌లో అమర్చే డీజీపీఎస్, నావిగేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సర్వే చేపట్టింది. ప్లంజ్‌పూల్ గొయ్యి 43-45మీ. లోతులో, 400మీ. పొడవు, 270మీ. వెడల్పున ఉందని.. 2018 నాటి గోతితో పోలిస్తే పెద్దగా తేడా లేదని తేలినట్లు వెల్లడించింది. అయితే డ్యాం ఆనకట్ట పునాదులు కుడి, ఎడమ కొండల పక్కన 15-18 మీటర్ల లోతున, మధ్యలో 30-40 మీ. లోతున ఉన్నాయని రిటైర్డ్ ఎస్ఈ ఒకరు వెల్లడించారు. పునాదుల లోతు కంటే ప్లంజ్‌పూల్ గొయ్యి ఎక్కువ లోతులో ఉండడం డ్యాంకు ప్రమాదమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ గొయ్యి అప్రాన్ నుంచి 15 మీ తర్వాత మొదలవుతుంది.

తెలుగు రాష్ట్రాల జీవనాడి

కృష్ణానదిపై నిర్మించిన మొట్టమొదటి జలవిద్యుత్ ప్రాజెక్టు శ్రీశైలం. తర్వాత దానిని బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చారు. ఎన్నో ఏళ్లుగా ఇది తెలుగు రాష్ట్రాలకు ప్రాణాధారమైంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 1963 జూలై 24న అప్పటి ప్రధాని నెహ్రూ శంకుస్థాపన చేశారు. 20ఏళ్లకు నిర్మాణం పూర్తయింది. 1984లో ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. 143.26 మీ. ఎత్తు, 512మీ. పొడవున్న గ్రావిటీ ఆనకట్ట ఇది. 308.04 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేసినా.. తర్వాత పూడిక చేరడంతో నిల్వసామర్థ్యాన్ని 215.807 టీఎంసీలకు కుదించారు. ఆనకట్ట స్పిల్‌వే పొడవు 266.4 మీటర్లు. స్పిల్‌వేకు ఇరువైపులా నాన్-ఓవర్‌ఫ్లో విభాగాలు ఉన్నాయి.

డ్యాం రక్షణకు అత్యంత కీలకం సిలిండర్లు

శ్రీశైలం డ్యాం భద్రతలో అత్యంత కీలకమైనవి సిలిండర్లు. డ్యాం నిర్మాణ సమయంలో ఆనకట్ట ముందు భాగంలోని రాళ్లు కొట్టుకుపోయాయి. దీంతో డ్యాం రక్షణకు 1978-79లో ఆనకట్ట నుంచి 13-15 మీటర్లు పొడవు, 3-4 మీటర్ల మందంతో సీసీ కాంక్రీట్‌తో అప్రాన్ నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు అప్రాన్‌కు కూడా కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతుండంతో శాశ్వత రక్షణలో భాగంగా 1986-89 మధ్య దాదాపు 67 సిలిండర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సిలిండర్‌ను రెండు మీటర్ల వ్యాసంలో, 18-20 మీటర్లు లోతులో ఏర్పాటు చేశారు. 20 మీటర్ల లోతులో ఒక మీటరు కాంక్రీట్ వేసి ఆ కాంక్రీట్‌పైన డ్యాం కుడి, ఎడమ రెండు కొండల మధ్య వీటిని అమర్చారు. వాటిని కాంక్రీట్‌తో నింపినట్లు రిటైర్డ్ ఇంజనీర్లు తెలిపారు. ప్లంజ్‌పూల్ భారీ గొయ్యి ఆనకట్ట వైపు విస్తరించకుండా ఈ సిలిండర్లు రక్షణగా ఉంటున్నాయి. అయితే 2009లో సంభవించిన భారీ వరదలకు సిలిండర్లు భారీగా దెబ్బతిన్నాయి. ఏ మేరకు దెబ్బతిన్నాయో గుర్తించే బాధ్యతను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దీని అధ్యయనంలో విస్తుగొలిపే నిజాలు వెలుగు చూశాయి. వరదలకు కాంక్రీటు మొత్తం కొట్టుకుపోయి.. 62 సిలిండర్లు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయని.. వీటిలో కొన్ని ఎలాంటి ఆధారం లేకుండా లోపల నీటిలోనే తేలుతున్నట్లు గుర్తించారు. సిలిండర్లు పాడైపోవడంపై నిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



ఇక అమరావతే!

(మొదటి పేజీ తరువాయి)

రాజధానికి కేంద్ర ఆర్థిక సహకారం ఉంటుందని కూడా స్పష్టం చేశారు. అయితే... సొంత గడ్డపైనుంచే పాలన సాగించాలనే ఉద్దేశంతో చంద్రబాబు పదేళ్లకంటే ముందే 'హైదరాబాద్ నుంచి పాలనను నవ్యాంధ్రకు తరలించారు. 'అమరావతి'ని రాజధానిగా ప్రకటించారు. దీనికోసం భూమిని సమీకరించారు. 29 గ్రామాలకు చెందిన 27వేల మంది రైతులు తమ 33వేల ఎకరాల భూములను అప్పగించారు. అమరావతి పనులు మహోజ్వలంగా సాగుతున్న దశ లో... 2019లో ఎన్నికలు వచ్చాయి. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు.

మూడు ముక్కలాట...

ఎన్నికలముందు 'అమరావతే రాజధాని' అని నమ్మబలికిన వైసీపీ... అధికారంలోకి రాగానే మాట మార్చింది. జగన్ మూడు ముక్కలాటకు తెరలేపారు. అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లు తీసుకొచ్చారు. కానీ, మండలిలో బలంలేక ఆ పనిచేయలేకపోయారు. ఏపీ సీఆర్డీయే చట్టంలోని బలమైన నిబంధనల నేపథ్యంలో... రాజధానికి న్యాయస్థానాలు అండగా నిలిచాయి. జగన్ సర్కారు చర్యను నిరసిస్తూ రాజధాని రైతులు సమరశీల పోరాటాలు చేశారు. కోర్టుల్లో ఓటమి తప్పదని గ్రహించిన నాటి జగన్ సర్కారు... వ్యూహాత్మకంగా మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకుంది. జగన్ ప్రయత్నాలకు 2022 మార్చి 3న హైకోర్టు కూడా చెక్ పెట్టింది. 2024 ఎన్నికల్లో కూటమి సర్కారు అధికారంలోకి రావడం... చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో 'అమరావతి' మళ్లీ పట్టాలెక్కింది.

చట్టబద్ధత ఎందుకు? ఎలా?

'వీరు పోతే వారు... వారు పోతే వీరు... ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమరావతితో ఆటలాడుకోకూడదు' అనే లక్ష్యంతో ఏపీ రాజధానికి కట్టుదిట్టమైన చట్టబద్ధత కల్పించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కూటమి సర్కారు రాగానే అమరావతిని శాశ్వతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. నిజానికి... ఏది రాజధానిగా ఉండాలనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఇందులో కేంద్రం జోక్యం చేసుకోలేదు. కానీ... నవ్యాంధ్ర ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఏర్పడింది. 'ఏపీకి ఒక రాజధాని ఏర్పాటవుతుంది. దానికి కేంద్రం మద్దతు ఉంటుంది' అని పార్లమెంటు ఆమోదించిన విభజన చట్టంలోనే పేర్కొన్నారు. దీనిని ఆసరాగా తీసుకునే 'అమరావతి'కి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. 2024 జూన్ 1వ తేదీతో... 'పదేళ్ల ఉమ్మడి రాజధాని' కథ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 5 (2)లో 'ఏపీకి ఒక రాజధాని ఏర్పాటవుతుంది' అని ఉన్న చోట... 'ఏపీ రాజధానిగా అమరావతి' అని సవరణ చేస్తారు. 'అమరావతి'కి పరిధులనూ నిర్ణయిస్తారు. 'ఏపీ సీఆర్డీయే చట్టం-2014' నోటిఫై చేసిన ప్రాంతాన్ని 'అమరావతి'గా పరిగణించాలని... ఇది 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని నిర్దిష్టంగా స్పష్టం చేస్తారు. దీంతో పాటు భవిష్యత్తులో సీఆర్డీయే నోటిఫై చేసే గ్రామాలు కూడా 'అమరావతి' పరిధిలోకి వచ్చే వీలు కల్పిస్తూ ఈ సవరణను ప్రతిపాదించారు.

కేంద్ర న్యాయశాఖ ఆమోదం

అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈ ఏడాది మే 12న రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానాన్ని ఆమోదించి... కేంద్రానికి పంపించింది. ఆ తర్వాత కేంద్రం స్థాయిలో చేసిన ప్రయత్నాలతో కదలిక మొదలైంది. ప్రతిపాదిత సవరణలపై కేంద్ర న్యాయశాఖ ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వం సమాధానం చెప్పింది. సంతృప్తి చెందిన న్యాయశాఖ... ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో 'అమరావతి ఏపీ రాజధాని' అని చేర్చాలన్న సవరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. సంబంధించిన ఫైలును కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపించనున్నారు. ఆ తర్వాత ఏపీ పునర్విభజన చట్టం-2014 సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. అది ఆమోదం పొందగానే... 'అమరావతి'కి పార్లమెంటు స్థాయిలో చట్టబద్ధత లభిస్తుంది.

మాధవరెడ్డి ఎక్కడ?

▸▸ మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో సీఐడీ ఆరా

▸▸ అధికారులు అతని ఇంటికెళ్లే సరికే అజ్ఞాతంలోకి..



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో నిందితుడు మాధవరెడ్డి ఎక్కడ? దీనిపై సీఐడీ ఆరా తీస్తోంది. అదుపులోకి తీసుకునేందుకు శనివారం ఇంటికెళ్లిన అధికారులు అప్పటికే అతను అజ్ఞాతంలోకి వెళ్లినట్లు గుర్తించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డాక్యుమెంట్ల దహనం కేసులో అప్పటి సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజను ఇప్పటికే అరెస్టు చేయగా, ఆయన బెయిల్‌పై ఉన్నారు. రెండోసారి అరెస్టయిన మాజీ ఆర్డీవో మురళి ప్రస్తుతం రిమాండులో ఉన్నారు. ఇదే కేసులో నిందితుడైన మాధవరెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో.. అరెస్టు చేయొద్దని కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఆ ఉత్తర్వులు వారం కిందట రద్దు కావడంతో, శనివారం సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో అధికారులు మదనపల్లెలోని అతని ఇంటికెళ్లారు. అప్పటికే మాధవరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. అధికారులు ఇంట్లో సోదాలు నిర్వహించి రాగానిపల్లి భూముల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అతడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సెల్‌ఫోను ఆధారంగా నిఘా ఉంచారు. ఆస్తుల వివరాలూ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పీఏగా పనిచేసిన తుకారాం భారత్‌కు వచ్చినట్లు సమాచారం అందడంతో అతడి కోసం గాలిస్తున్నట్లు సమాచారం.





ఆటోలో పట్టుబడిన ఈవో దంపతులు, వారు తరలిస్తున్న వెండి ఆభరణాలు

దేవదాయ శాఖ ఈవో చేతివాటం

▸▸ అమ్మవారి ఆభరణాలు, చీరలు తరలిస్తూ పట్టుబడిన వైనం

కదిరి/పుట్టపర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఈవో చేతివాటం ప్రదర్శించాడు. అమ్మవారి వెండి వస్తువులు, ఆభరణాలు, చీరలు కాజేసేందుకు ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. మురళీకృష్ణ శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతంలోని ప్రసిద్ధ ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం, నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి తదితర సమూహ ఆలయాల ఈవోగా పనిచేస్తున్నారు. ఆదివారం ఆయన తన భార్యతో కలిసి ఆలయంలోని వెండి ఆభరణాలు, చీరలు ఇతర సామగ్రిని ఆటోలో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు అక్కడికి చేరుకుని ఈవో దంపతులను అదుపులోకి తీసుకున్నారు. ఆభరణాలు, చీరలు స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ ఉద్యోగి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఈవోపై కేసు నమోదు చేశారు. ఈఓను సస్పెండ్ చేయాలంటూ దేవదాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో మురళీకృష్ణను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక విచారణలో ఈఓ చోరీ చేసినట్లు తేలడంతో పోలీసులు అరెస్టు చేశారు.

అల్లూరి జిల్లా...

పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికీ ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రూ.100 కోట్లతో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వం భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కలెక్టరేట్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో, ఎస్పీ కార్యాలయాన్ని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నారు. మరికొన్ని కార్యాలయాలను ఐటీడీఏ కార్యాలయంలోని పలు గదుల్లో కొనసాగిస్తున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ వంటి పోస్టింగ్‌లు మినహా అనేక శాఖలు ఇన్‌చార్జులతోనే నడుస్తున్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం

అనకాపల్లి ..

అనకాపల్లి జిల్లా కేంద్రం అనకాపల్లిలో అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయంతో పాటు ఎస్పీ కార్యాలయం కూడా పరాయి పంచన నడుస్తున్నాయి. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాన్ని పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న శంకరం పంచాయతీ పరిధిలో ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇది లూప్‌లైన్ కావడంతో సొంత వాహనాలు లేనివారు అనకాపల్లి నుంచి ప్రత్యేకంగా ఆటోలను మాట్లాడుకుని వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ శాఖల కార్యాలయాలు 45 వరకు ఉండగా, వాటిల్లో 30 శాఖల కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. డీపీవో కార్యాలయాన్ని శంకరం పంచాయతీలోని సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి చదరపు అడుగుకు నెలకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తుంది. కానీ పట్టణంలో ఇంత తక్కువ అద్దెకు భవనాలు లభించకపోవడంతో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సమీపంలోని గ్రామాల్లో ఏర్పాటు చేశారు.

పార్వతీపురం మన్యం ..

పార్వతీపురం కేంద్రంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నేటికీ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఐటీడీఏ కార్యాలయ నిర్వహణ కోసం కొత్తగా నిర్మించిన కార్యాలయంలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నారు. మూతపడిన ఆర్‌సీఎం పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఐదు శాఖలకు మినహా మిగిలిన శాఖలకు సొంత భవనాలు లేని పరిస్థితి. ఒకే ప్రాంగణంలో 25 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పార్వతీపురంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

కొత్త జిల్లాలు.. పాత కష్టాలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

13 కొత్త జిల్లాల కేంద్రాల్లో పరిస్థితి దారుణం

ఓ ప్రణాళిక లేకుండా హడావుడిగా ఏర్పాటు

నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం

తాత్కాలిక భవనాల్లోనే కార్యాలయాలు

ఫంక్షన్ హాళ్లు, చాలీచాలని అద్దె భవనాలు

కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నాడు జగన్ ప్రభుత్వం భౌగోళిక పరిస్థితులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా జిల్లాలను విభజించింది. జిల్లా కార్యాలయాల కోసం శాశ్వత భవనాలను సమకూర్చలేదు. వాటి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. కనీసం స్థలాలను కూడా సేకరించలేదు. హడావుడిగా 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి వదిలేసింది. దాదాపు అన్ని కొత్త జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ వంటి అతి ముఖ్యమైన అధికారులకు మినహా ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాలకు తగిన వసతులతో భవనాలు లేవు. చాలా వరకు అద్దె భవనాల్లో పరాయి పంచన నడుస్తున్నాయి. దాదాపుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు కూడా సొంత శాశ్వత భవనాలు లేవు. డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, చాలీచాలని అద్దె భవనాలు, కాలేజీలు, ఫంక్షన్ హాళ్ల, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఇతర జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల జిల్లా కేంద్రాలకు దూరంగా పెట్టారు. ఉద్యోగులు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. తాగునీరు కూడా లభించని పరిస్థితి. చాలా కార్యాలయాలు ఇరుకు గదుల్లో నడుస్తున్నాయి. కనీస మౌలిక వసతులు లేవు. పలు చోట్ల ఉద్యోగులు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు కూడా ఇవ్వలేదు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఉద్యోగులు, అందులోనూ మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఆఫీసుల్లో సిబ్బంది కొరత ఉంది. పలు జిల్లా స్థాయి అధికారుల కార్యాలయాలు ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. ఏ జిల్లా చూసినా గందరగోళ పరిస్థితి. జిల్లా 'పాలన' అస్తవ్యస్తం. కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత రెండేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉంది. అయినా సమస్యలను పరిష్కరించలేదు. ఫలితంగా ఇప్పటికీ కొత్త జిల్లాల కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని విభాగాలు కొనసాగుతున్నాయి. స్టేషనరీ ఖర్చులకు కూడా ఇబ్బంది పడాల్సిన దుస్థితిని ఆయా శాఖలు ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానికుల కోరిక మేరకు కొత్తగా 3 జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. అలాగే కార్యాలయాలకు శాశ్వత భవనాల ఏర్పాటు, అధికారుల నియామకం తదితర సమస్యలపై దృష్టిసారించి 'పాలన'ను చక్కదిద్దాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. 2022లో అప్పటి జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 కొత్త జిల్లాల కేంద్రాల్లో దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

బాపట్ల ..


ఓ సొసైటీ కళాశాల భవనంలో కొనసాగుతున్న బాపట్ల జిల్లా విద్యాశాఖ కార్యాలయం

బాపట్ల కేంద్రంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో చాలా కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా జిల్లా కేంద్రంలో మౌలిక వసతుల కల్పన ఊసే లేదు. సమీకృత కలెక్టరేట్ పేరిట గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రకటనలకే పరిమితమైంది. ఓ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన కళాశాల భవనంలో పలు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. నెలల తరబడి అద్దె కూడా చెల్లించడం లేదని తెలుస్తోంది. మరికొన్ని శాఖల కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. కీలక శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. డీఆర్‌డీఏ, పర్యాటక, అటవీ ఇలా దాదాపు పది విభాగాలకు అదనపు బాధ్యతలతోనే నెట్టుకురావడంతో పాలనలో వేగం కనబడటం లేదు.

ఎన్టీఆర్ ..

విజయవాడ కేంద్రంగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు పలు శాఖలకు సొంత భవనాలు లేవు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటు చేయలేదు. అప్పట్లో గొల్లపూడిలోని రాష్ట్ర దేవదాయ శాఖ కార్యాలయం చెంతన ఇంటిగ్రేటెడ్ కార్యాలయానికి స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత వదిలేశారు. విజయవాడలో గతంలో సబ్ కలెక్టరేట్, విజయవాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఉన్న భవనాన్ని తాత్కాలికంగా కలెక్టరేట్‌గా చేసుకున్నారు. ఇక్కడి కలెక్టరేట్‌లో రెండు మూడు శాఖలు తప్ప మిగిలిన వాటికి చోటు లేదు. విజయవాడ రెవెన్యూ డివిజనల్/సబ్ కలెక్టరేట్‌ను మాంటిస్సోరి కళాశాలలో అద్దె భవనంలో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.

కృష్ణా ..

వ్యవసాయ ఆధారిత కృష్ణా జిల్లా(మచిలీపట్నం కేంద్రం)లో కీలకమైన నీటిపారుదల శాఖ ఎస్‌ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. విజయవాడ నుంచే ఈ శాఖకు సంబంధించిన పరిపాలన కొనసాగుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు ఈ ఎస్‌ఈ ద్వారానే పరిపాలనను నెట్టుకొస్తున్నారు. పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కలెక్టర్, జేసీ కార్యాలయాలతో పాటు బంగ్లాలను కొంతమేర ఆధునికీకరించి సరిపెట్టారు.

పల్నాడు ..



నరసరావుపేటలో చాలీచాలని భవనంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం

నరసరావుపేట కేంద్రంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో పరిపాలన ఇంకా గాడిన పడలేదు. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. ఆఫీసుల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు, ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాలలో నిర్వహిస్తున్న కార్యాలయాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, వారి నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయాలకు కనీసం ఫర్నీచర్ కూడా ఇవ్వలేదు. ఒక్కొక్క అధికారి రెండు పోస్టులను నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తున్న పోలీసు శాఖకు వసతులు లేదు. కనీసం ఆయుధాలు భద్రపరిచే వసతి లేదు. దీంతో గుంటూరులోనే ఆయుధాలు ఉంచాల్సిన దుర్భర పరిస్థితి పోలీసు శాఖ ఎదుర్కొంటోంది. జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఘటన జరిగితే జిల్లా కేంద్రం నుంచి బలగాలను పంపించే సౌకర్యం కూడా లేదు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి వేళ జిల్లా కేంద్రంలో పోలీసులు బస చేసే అవకాశం కూడా లేదు. అద్దె భవనాలలో చాలా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి.

నంద్యాల ..


నంద్యాలలోని ప్రైవేట్ భవనంలో వివిధ శాఖల కార్యాలయాలు

నంద్యాల జిల్లాలో కలెక్టర్, వ్యవసాయ శాఖ, పర్యాటక శాఖ కార్యాలయాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉద్యాన శాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ శాఖల సంక్షేమ, విద్యా శాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల భవనాల్లో ఎస్‌ఎస్‌ఏ, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ కార్యాలయాలు ఉన్నాయి. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం తాత్కాలిక రేకుల షెడ్డులో ఉంది. వైద్యఆరోగ్య శాఖ, డీసీహెచ్‌ఎస్ కార్యాలయాలను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని గదుల్లో ఏర్పాటు చేసుకుని పాలన సాగిస్తున్నారు.

శ్రీసత్యసాయి ..

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నేటికీ పరాయి పంచన, మౌలిక వసతులు లేని ఇరుకు గదుల్లోనే పాలన సాగించాల్సిన దుస్థితి. కలెక్టరేట్‌తో పాటు 90శాతం ప్రభుత్వ కార్యాలయాలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాలను సమకూర్చింది. కొన్ని కార్యాలయాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అధికారులు కూర్చునేందుకు కుర్చీలు లేవు. బుక్కపట్నంలో పాత డైట్ కళాశాలలో సమగ్ర శిక్ష కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొత్తచెరువులో ఎంఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి, బాలుర బీసీ హాస్టల్లో కార్మిక, ఐసీడీఎస్ కార్యాలయం ఉన్నాయి. దీనజనోద్ధరణ భవన సముదాయంలో 15కార్యాలయాల్లో వంద మందికిపైగా అధికారులు పనిచేస్తున్నారు. ఇక్కడ గుక్కెడు నీరు కావాలన్నా పుట్టపర్తికి వెళ్లాల్సిందే. రాత్రి 8.30 దాటిందంటే బస్సు సర్వీసులు కూడా ఉండవు.


చిన్న భవనంలో అటవీ శాఖ జిల్లా కార్యాలయం

అన్నమయ్య ..


డ్వామాలో చిన్న గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

రాయచోటి కేంద్రంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లాలో ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. పదికి పైగా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం మినహా మిగిలిన జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతులు లేవు. జిల్లా డ్వామా కార్యాలయం దిగువఅబ్బవరం సచివాలయంలో, డీపీవో కార్యాలయం చెన్నముక్కపల్లె సచివాలయంలో, డీఈవో కార్యాలయం, సర్వశిక్షా అభియాన్ పీవో కార్యాలయం ఒకప్పటి కొత్తపేట ఎంపీయూపీ స్కూల్‌లో ఉన్నాయి. రాయచోటి పట్టణానికి దూరంగా ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, సహకార బ్యాంకుల కార్యాలయాలు, వ్యవసాయం, ఉద్యాన, మత్స్యశాఖ, సూక్ష్మసేద్యం, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఏపీ ఫైబర్‌నెట్, భూగర్భ జలశాఖ, స్పోర్ట్స్, మార్కెటింగ్ సమాఖ్య జిల్లా మేనేజర్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ సిబ్బంది తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ఉన్న పల్లెలకు వెళ్లే విద్యుత్ లైను నుంచే వీటికి కనెక్షన్ తీసుకోవడంతో.. ఈ కార్యాలయాలకు ఒక్కోసారి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు రాదు. కార్యాలయాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో తరచూ విషసర్పాలు వస్తున్నాయి.

పశ్చిమగోదావరి ..


కలెక్టరేట్‌లో పరదా కప్పి ఉంచిన సర్వే రికార్డులు

భీమవరం కేంద్రంగా ఏర్పాటైన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. పట్టణానికి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేదు. దాతలు, మున్సిపాలిటీ సహకారంతో వసతులు ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నారు. కిక్కిరిసిన గదుల్లోనే జిల్లా సర్వే, విద్యాశాఖ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. రికార్డులు భద్రపరిచే సౌకర్యాలు లేవు. సర్వే శాఖలో రికార్డులు ఒక టేబుల్‌పై దుప్పటి కప్పి ఉంచుతున్నారు. కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం వైసీపీ హయాంలో స్థలం కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేయకుండా వదిలేశారు.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పేరుకే జిల్లా కేంద్రం అన్నట్టుగా పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రం ఒకచోట, అనుబంధ కార్యాలయాలు మరోచోట ఉండడంతో అటు అధికారులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అమలాపురంలో గతంలో డీఆర్డీఏ అధీనంలో ఉన్న భవనాల్లో కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. నల్లవంతెన సమీపంలో అద్దె భవనంలో ఎస్పీ కార్యాలయం ఉంది. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో 32 ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పలు కార్యాలయాలు ముమ్మిడివరంలో ఉండడంతో అధికారులు అందుబాటులో ఉండకుండా కాన్ఫరెన్సులు, క్యాంపుల పేరుతో దూరంగా ఉంటున్నారని ప్రజలు అంటున్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అద్దె భవనంలో జిల్లా ఎస్పీ కార్యాలయం

తూర్పుగోదావరి ..



రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి పేరుకే జిల్లాగా ఉన్నట్టుంది. కలెక్టరేట్‌కు ఒక కొత్త భవనం కూడా లేదు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచడం కోసం బొమ్మూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ పేరిట నిర్మించిన భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. నేక్‌ను మాత్రం గతంలో హాస్టల్‌గా వాడుకునే భవనానికి తరిమేశారు. గిరిజన యువత శిక్షణ కోసం అదే ప్రాంతంలో నిర్మించిన వైటీసీ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి కొన్ని ప్రభుత్వ శాఖలకు అప్పగించారు. వీటిలో బీరువా కూడా పట్టని పరిస్థితి. గతంలో ఇక్కడి సబ్-కలెక్టర్ నివాస భవనాన్ని కలెక్టర్ నివాస భవనంగా వాడుతున్నారు. జేసీ కూడా అద్దె ఇంట్లోనే ఉండే పరిస్థితి.

తిరుపతి ..



తిరుపతిలో కలెక్టరేట్ సహా 80 శాతం శాఖల కార్యాలయాలు ఏర్పాటైన టీటీడీ భవనం

తిరుపతి జిల్లాలో కలెక్టరేట్ టీటీడీకి చెందిన భవనంలో అద్దె ప్రాతిపదికన నడుస్తోంది. తిరుచానూరులోని పద్మావతి నిలయం భవనాన్ని నెలకు రూ.28 లక్షల అద్దెతో కలెక్టరేట్ కోసం తాత్కాలికంగా కేటాయించింది. 80శాతం శాఖల కార్యాలయాలకు టీటీడీ భవనంలోనే గదులు కేటాయించారు. మిగిలిన 20 శాతం శాఖల్లో కొన్ని డివిజన్ కార్యాలయాల్లో తాత్కాలికంగా నడుస్తుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. పోలీసు, డ్వామా, డీఆర్‌డీఏ, ట్రెజరీ వంటి నాలుగైదు శాఖలకే సొంత భవనాలున్నాయి. జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలకు సొంత నివాస బంగ్లాలు లేవు. జిల్లా ఏర్పాటు కంటే ముందే తిరుపతి అర్బన్ పోలీసు జిల్లా కావడం వల్ల జిల్లా పోలీసు కార్యాలయం మాత్రమే అది కూడా ఇటీవలే నిర్మాణమైంది. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డివిజన్లలో సొంత భవనాలు దేనికీ లేవు.

దక్షిణాది వంటకంబు.. ఒహోహ్హో మాకె ముందు..

(మొదటి పేజీ తరువాయి)

కర్రీలు, మన దక్షిణాది వంటకాలు!! అమెరికన్లు సాధారణంగా మసాలాలు తక్కువగా ఉండే వంటకాలను ఇష్టపడతారు. విదేశీ వంటకాల్లో.. థాయ్ ఆహారానికి అమెరికన్లలో ఆదరణ ఎక్కువ. మొన్నమొన్నటిదాకా భారతీయ రెస్టారెంట్లకు వచ్చినా కూడా.. చికెన్ టిక్కా మసాలా, బటర్ చికెన్, నాన్లు వంటివే ఎక్కువగా తినేవారు. రాను రానూ ట్రెండ్ మార్చి.. ఇప్పుడు స్పైసీగా ఉండే దక్షిణాది ఆహారాన్నీ ఇష్టంగా తింటున్నారు. అమెరికాలో చైనీస్, ఫిలిప్పీన్స్‌వాసుల తర్వాత ఎక్కువ సంఖ్యలో ఉన్న ఆసియా వాసులు భారతీయులే. కానీ జనాభా పరంగా చూస్తే భారతీయ రెస్టారెంట్ల సంఖ్య ఇప్పటి వరకూ చాలా తక్కువ. ఇప్పుడు అమెరికన్లు కూడా మన వంటకాలను ఇష్టంగా అడిగి తింటుండడంతో.. తెలుగు ప్రవాసులు యూఎస్ నగరాల్లో రెస్టారెంట్లను విరివిగా ప్రారంభిస్తున్నారు. 2025 అక్టోబరు గణాంకాల ప్రకారం అమెరికాలో దాదాపుగా పదివేల (9438) భారతీయ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో 2000 ఒక్క కాలిఫోర్నియా రాష్ట్రంలోనే ఉన్నాయి! దాదాపు 1500 రెస్టారెంట్లతో టెక్సాస్.. 1000 రెస్టారెంట్లతో న్యూయార్క్ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా న్యూయార్క్, లాస్‌ఏంజెలెస్, షికాగో, డాలస్, హ్యూస్టన్ ప్రాంతాల్లో వీటి సంఖ్య పెరుగుతోంది. డాలస్ మెట్రో ఏరియా.. దక్షిణ భారత రుచులను అందించే రెస్టారెంట్లకు హబ్‌గా మారింది. ఈ ప్రాంతంలో దాదాపు 400 ఇండియన్ రెస్టారెంట్లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నేపాలీ, పాకిస్థాన్, బంగ్లాదేశ్ రెస్టారెంట్లు అదనం. కానీ.. వారు కూడా తమ రెస్టారెంట్లను ఇండియన్ రెస్టారెంట్ల పేరుతోనే నిర్వహిస్తుండడం విశేషం.

'లెక్క' చేయట్లేదు!

అమెరికాలో ఉండే మనోళ్లు.. గతంలో రెస్టారెంట్లలో ధరలను భారత్‌లోని ధరలతో పోల్చి చూసుకుని.. జిహ్వాచాపల్యాన్ని అదుపులో ఉంచుకునేవారు. ఇప్పుడు.. బయట తినాలని అనిపించిందే తడవుగా కుటుంబసభ్యుల్ని, మిత్రుల్ని వెంటబెట్టుకుని వెళ్తున్నారు. ఈ డిమాండుకు తగ్గట్టుగా.. భారతీయులు గణనీయంగా ఉన్న ప్రతి నగరంలోనూ వీధికో ఇండియన్ రెస్టారెంటు వెలుస్తోంది. డాలస్‌లో 12 డాలర్లుండే చికెన్ బిర్యానీ, కాలిఫోర్నియాలో 25 డాలర్లు. సియాటెల్‌లో ఇంకా ఎక్కువ. అయినా.. మన రెస్టారెంట్లు కిక్కిరిసే ఉంటున్నాయి. యూఎస్‌లో ప్రతి ఊరిలోనూ బావార్చీ బిర్యానీ, బిర్యానీ బెస్ట్రో, బిర్యానీ పాట్, హైదరాబాద్ హౌస్, ప్యారడైజ్, స్వదేశీ మొదలైన పేర్లతో రెస్టారెంట్లు పుష్కలంగా కనిపిస్తాయి. వీటితోపాటు ఇండియాలో ఎంతో ప్రసిద్ధి పొందిన శరవణ భవన్, అడయార్ ఆనంద భవన్, బార్బిక్యూ నేషన్, పిస్తా హౌస్ మొదలైన గ్రూపులు అమెరికాలో కూడా ఫ్రాంఛైజీ మోడల్‌లో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నాయి.

దశాబ్దాల క్రితమే..

అమెరికాలో భారతీయ రెస్టారెంట్ల విప్లవం శ్రీకారం దిద్దుకోవడానికి కాలిఫోర్నియా బర్కిలీకి చెందిన లక్కిరెడ్డి బాల్ రెడ్డి ఆద్యుడని చెప్పాలి. 40-50 సంవత్సరాలకు పూర్వమే ఆయన భారతీయ రెస్టారెంట్లను స్థాపించారు. కృష్ణాజిల్లా మైలవరం దగ్గర వెల్వడం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి, 1970ల్లో ప్రారంభించిన పసంద్ అనే ఇండియన్ రెస్టారెంటు 3 దశాబ్దాలు దక్షిణ భారత వంటకాలతో అలరించింది. అదే గ్రామానికి చెందిన తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం ప్రారంభించిన స్వాగత్ గ్రూపు రెస్టారెంట్లు 35 ఏళ్లుగా కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీ భోజన ప్రియుల జిహ్వలను తృప్తి పరుస్తున్నాయి. మైలవరం ప్రాంతం నుంచి షెఫ్‌లుగా, రెస్టారెంటు ఓనర్లుగా వచ్చినవారు అమెరికాలో పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఇండియన్ క్విజిన్‌లో ఉండే ఇంద్రజాలం.. అమెరికన్లను కూడా సమ్మోహితుల్ని చేయడం ఇటీవలే ప్రారంభమైంది. దీంతో ఈ వ్యాపారంలోకి ప్రవేశించే వారి సంఖ్యా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే.. కొన్ని భారతీయ రెస్టారెంట్లలో షెఫ్‌లే ఎక్కువ సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అమెరికాలో మనోళ్ల రెస్టారెంట్ల సంఖ్య పెరుగుతున్నా.. సక్సెస్ రేటు అనుకున్నంత లేదు. షెఫ్‌ల జీతాలు భరించలేని స్థాయిలో పెరిగిపోవడం దీనికి కారణం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379, 2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.